



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**ఉపాధ్యాయుల వైపు ప్రజలు.. గూండాల వైపు జగన్‌రెడ్డి**

- దాడులు చేయించి గవర్నర్‌ను కలుస్తారా?
- మీరే సర్టిఫికెట్లు ఇస్తారు.. మీరే ఫేక్ అంటారు
- శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు


- వివరాలు 12లో..

## భారీవర్షాలపై సీఎం సమీక్ష

**జిల్లాల్లో పరిస్థితులపై ఆర్టీజీఎస్ నుంచి కీలక సూచనలు**

**నదులకు వస్తోన్న ప్రవాహాలు, యంత్రాంగం సన్నద్ధతపై చర్చ**

**సమర్థ నీటి నిర్వహణతో రిజర్వాయర్లను నింపాలని ఆదేశం**




2

*రాష్ట్రంలో తీవ్ర వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు, ఏఐ ఆధారిత సాంకేతికత వినియోగం, డేటా అనలిటిక్స్, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే వ్యూహాలపై రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. వర్షాల కారణంగా వస్తున్న ప్రవాహాలతో కృష్ణా, గోదావరి డెల్టాలోని రిజర్వాయర్లతో పాటు పరిధిలో ఉన్న రాష్ట్రంలో ఉన్న నీటి వనరు లు కూడా నింపాలని ఆదేశించారు. ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను మార్చడం సాధ్యం కాకపోయినా భూసారాన్ని పెంచడం, సాయిల్ టెస్టి గ్ ఆధారంగా ప్రత్యామ్నాయ పంటలను సూచించడం, బయోచార్, ప్రకృతి వ్యవసాయం వంటి విధానాల ద్వారా ఎల్‌నినో ప్రభావాన్ని కొంతమేర తగ్గించవచ్చని తెలిపారు. ఈ విధానాన్ని రాష్ట్రంలో పైలట్‌గా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.*

### రాష్ట్రానికి ఖ్యాతి తెచ్చేలా

# పెట్టుబడుల సదస్సు




- విశాఖలో నవంబరు 12, 13 తేదీల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి
- ఎంఎస్ఎంఈలకు ప్రాధాన్యతనిచ్చేలా
- 5 ప్రాంతాల్లో 5 రీజినల్ కాన్ఫరెన్సులు
- 30 నియోజకవర్గాల్లో శంకుస్థాపనలు
- సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ సన్నాహకాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు

3

*విశాఖ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026కు సన్నాహకంగా రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో 5 రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. విశాఖ పట్నంలో నవంబరు 12, 13 తేదీల్లో నిర్వహించనున్న 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సన్నాహక కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించా రు. భాగస్వామ్య సదస్సు కేవలం ఎంఓయూల కోసం కాకుండా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు స్ఫూర్తినింపేలా, ఏపీ బ్రాండింగ్ మరింత పెరిగేలా నిర్వహించాలని స్పష్టం చేశారు. భాగస్వామ్య సదస్సుకు ముందుగానే మరో 30 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన జరిగేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.*

# స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీ కల్చర్

- ఆ వేగాన్ని క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లాం
- ప్రాజెక్టుల గ్రౌండింగ్‌కు ప్రథమ ప్రాధాన్యం
- మా ఏకైక ప్రధాన లక్ష్యం ఉద్యోగాల కల్పన
- 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్
- ఆర్థిక వ్యవస్థగా ఏపీని నిలబెట్టడమే లక్ష్యం
- క్వాంటంతో పాటు హార్టికల్చర్, ఆక్వాకల్చర్ ముఖ్యమే
- స్థిరమైన ప్రభుత్వంతోనే పేదరికం నిర్మూలన
- ఢిల్లీలో పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా
- ఫైర్ సైడ్ చాట్‌లో మంత్రి నారా లోకేష్

*"ప్రతి రాజకీయ పార్టీకి ఓ కల్చర్ ఉంటుంది..ప్రభుత్వాలకు కూడా ఉంటుంది. ఆ కల్చర్ నాయకత్వం నుంచి వస్తుంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీ కల్చర్. ఆ వేగాన్ని మేం ఇప్పుడు క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లాం" అని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర 2047: ది న్యూ గ్రోత్ లేబోరేటరీ' అంశంపై నిర్వహించిన 'ఫైర్‌సైడ్ చాట్' ఆయన పాల్గొన్నారు. అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. రాష్ట్రానికి వస్తున్న ప్రాజెక్టుల గ్రౌండింగ్‌ను స్వయంగా పర్యవేక్షిస్తున్నా. ప్రాజెక్టు ఎంత త్వరగా గ్రౌండ్ అవుతుందో అంత త్వరగా పన్నులు చెల్లి స్తారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అంత వేగంగా అభివృద్ధి చెందుతుంది. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అనే లక్ష్యం మరింత చేరువ అవుతుందని చెప్పుకొచ్చారు.*

5



## హార్టికల్చర్ హబ్‌ను గ్లోబల్ ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతాం



- కరవు నుంచి కలల సాకారం వైపు రాయలసీమ
- 201 క్లస్టర్లలో లక్ష కోట్ల పెట్టుబడులతో అభివృద్ధి
- అక్టోబరు 2న మదనపల్లెలో ప్రాజెక్టుకు శ్రీకారం
- ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన
- ఎల్‌నినో ప్రభావం-ప్రత్యామ్నాయ పంటలు, ఉద్యాన హబ్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు

4

## గుజరాత్ సీఎంతో లోకేష్ భేటీ

- జాతీయ విధాన చర్చల్లో ఏకతాటిపై ఉందాం
- కోస్ట్ టు కోస్ట్ వాణిజ్య కారిడార్‌ను పరిశీలించండి
- శ్రీవారి ఆలయానికి భూమి కేటాయించాలని వినతి
- విజయవాడ ఉత్సవ్‌కు రావాల్సిందిగా ఆహ్వానం




3

## ఏపీని నేషనల్ స్పోర్ట్స్ హబ్‌గా మార్చేందుకు సహకరించండి

- వాటర్ స్పోర్ట్స్‌కు సహ ఆతిథ్య గమ్యస్థానంగా విశాఖను ప్రతిపాదించాలి
- దేశీయ టోర్నమెంట్లకు గమ్యస్థానంగా మారుస్తాం
- ఇండోర్ క్రికెట్ శిక్షణ అకాడమీలకు నిధులివ్వండి
- ఐసీసీ చైర్మన్ జైషాతో భేటీలో లోకేష్ ప్రతిపాదనలు

8





7

## ఏపీలో పెట్టుబడులు పెట్టండి


***ఢిల్లీలో పలు కంపెనీల ప్రతినిధులతో లోకేష్ భేటీలు***

*ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్ పెట్టుబడుల వేటలో భాగంగా పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమ య్యారు. చైనాకు చెందిన సంస్థ వివో ఇండియా ప్రెసిడెంట్ అర్జిత్ సేన్, సిస్కో సిస్టమ్స్ ఎండీ హరీష్‌కృష్ణన్, యూఎస్‌ఎకి చెందిన అబాట్, మాస్టర్ కార్డ్ ఇంక్, జర్మనీకి చెందిన శాప్, గోద్రేజ్ ఇండస్ట్రీస్, యారా ఇంటర్నేషనల్ ఏఎస్ఏ-నార్వే పబ్లిక్ ఎఫైర్స్ అండ్ కమ్యూనికేషన్స్ ప్రతినిధులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ప్రతిపాదించారు.*




# భారీవర్షాలపై సీఎం చంద్రబాబు సమీక్ష

- జిల్లాల్లో పరిస్థితులపై ఆర్టీజీఎస్ నుంచి కీలక సూచనలు
- నదులకు వస్తోన్న ప్రవాహాలు, యంత్రాంగం సన్నద్ధతపై చర్చ
- సమర్థ నీటి నిర్వహణతో రిజర్వాయర్లను నింపాలని ఆదేశం
- జన జీవనానికి ఇబ్బంది రాకుండా చూడాలని సూచనలు





అమరావతి(చైతన్యరథం): వర్షాల కారణంగా వస్తున్న ప్రవాహా లతో రాష్ట్రంలోని అన్ని నీటి వనరులను నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. కృష్ణా, గోదావరి డెల్టాలోని రిజర్వాయ ర్లతో పాటు పరిధిలో ఉన్న వివిధ నీటి వనరులు కూడా నింపాలని స్పష్టం చేశారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో గురువారం సమీక్షించారు. ఏఐ ఆధారిత సాంకేతికత వినియోగం, డేటా అనలిటిక్స్, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే వ్యూహాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్ష ప్రభావంపై  చర్చించారు. తీవ్ర వాయుగుండం కారణంగా రాష్ట్రంలో గడచిన మూడురోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా భూగర్భజలాలు కొంతమేర పెరిగాయని అధికారులు వివరించారు. ప్రకాశం బ్యారేజి సహా మున్నేరు సహా ఇతర క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని వివరించారు. ప్రాజెక్టుల దిగువన ఉన్న అన్ని నీటి వనరుల్లో వర్షపు నీటిని నిల్వ చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. అవసరమైన చోట మోటార్లను వాడి నీటిని లిఫ్ట్ చేయాలని స్పష్టం చేశారు. గోదావరి నుంచి వస్తున్న ప్రవాహాల ద్వారా 24 టీఎంసీల నీటితో ఏలేరు రిజర్వాయ ర్ నింపాలని స్పష్టం చేశారు. పోలవరం ఎడమకాలువ ద్వారా అనకాపల్లి వరకూ నీటి వనరుల్లోకి నీటిని పంపాలన్నారు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో వర్షాలు అధికంగా నమోదు అయ్యాయని అధికారులు వివరించారు. ముఖ్యంగా విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం, కాకినాడ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ సహా వివిధ జిల్లాల్లో తీవ్ర వర్ష ప్రభావం కనిపించిందని తెలిపారు.

### గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార బేసిన్లపై ప్రత్యేక దృష్టి

ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాలు, గాలుల తీవ్రత, నదులు-వాగుల్లో పెరుగుతున్న ప్రవాహాలు, రిజర్వాయర్లలోకి చేరుతున్న వరద నీరు, రాబోయే రోజుల్లో అంచనా వేసిన వర్షపాతంపై ముఖ్యమంత్రి సమీక్షించారు. తాజా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల ప్రభావంతో గోదావరి బేసిన్‌లోని శబరి, ఇంద్రావతి, ఏలేరు, తాండవ, ఎర్రకాల్వ, పంపా, మేఘాద్రిగడ్డ తదితర రిజర్వాయర్లకు భారీగా వరద నీరు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఏలేరు రిజర్వాయర్‌కు 21,200-26,500 క్యూసెక్కుల మేర, తాండవకు 6,000-7,500 క్యూసెక్కులు, మేఘాద్రిగడ్డకు 2,400-3,000 క్యూసెక్కులు, పంపాకు 3,100-3,875 క్యూసెక్కులు వరకు ఇన్‌ఫ్లో వస్తుందని అంచనా వేస్తున్నారు. ఉత్తర కోస్తా రిజర్వాయర్లకు కూడా రాబోయే రోజుల్లో ఇన్‌ఫ్లో గణనీయం గా పెరుగుతుందని వెల్లడించారు. నాగావళి-వంశధార బేసిన్లలో వర్షాల ప్రభావంతో ప్రవాహాలు పెరగనున్నాయని వివరిచారు. గొట్టా బ్యారేజీకి సెప్టెంబరు 25న శుక్రవారం ఉదయం నాటికి వార్నింగ్ లెవల్-1 చేరుకునే అవకాశం ఉందని అంచనా వేశారు. భద్రాచలం వద్ద సెప్టెంబరు 26న మధ్యాహ్నానికి వార్నింగ్ లెవల్-1, అదేరోజు రాత్రికి వార్నింగ్ లెవల్-2 దాటే అవకాశం ఉందని తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సెప్టెంబరు 27న ఉదయం వార్నింగ్ లెవల్-1, సాయంత్రం వార్నింగ్ లెవల్-2 దాటే అవకాశం ఉందని అంచనా వేశారు. శబరి నదిపై కుంటా వద్ద సెప్టెంబరు 26 ఉదయానికి వార్నింగ్ స్థాయికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

### ప్రత్యామ్నాయ మార్గాలతో ఎల్‌నినోను ఎదుర్కొందాం

ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను మార్చడం సాధ్యం కాకపోయినా వాటి ప్రభావాన్ని తగ్గించేలా అంతర్గత పరిస్థితులను మార్చుకోవచ్చని తెలిపారు. భూసారాన్ని పెంచడం, సాయిల్ టెస్టింగ్ ఆధారంగా ప్రత్యామ్నాయ పంటలను సూచించడం, బయోచా ర్, ప్రకృతి వ్యవసాయం వంటి విధానాల ద్వారా ఎల్‌నినో ప్రభావా న్ని కొంతమేర తగ్గించవచ్చని తెలిపారు. ఈ విధానాన్ని రాష్ట్రంలో పైలట్‌గా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి వ్యవసాయ రంగానికి అవసరమైన సూచనలు అందించేలా సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధిం చిన సమాచారంతో పాటు సాగునీటి లభ్యత, రిజర్వాయర్ల పరిస్థితి తదితర వివరాల డేటా పొందుపరచాలని ఆదేశించారు.

### 2న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన

అక్టోబరు 2న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేయనున్నామని, అదేరోజు రాయలసీమను హార్టికల్చ ర్ హబ్‌గా అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామని చెప్పారు. మైక్రోసాఫ్ట్ సహకారంతో రూపొందించిన ఏఐ స్టాక్ ద్వారా కలిగే లాభాలను వివరిస్తూ డెమో ఇవ్వాలని సూచించారు. భూగర్భజలాలు సహా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలపైనా అమెరికాలోని పృథ్వీ అనే యువకుడు రూపొందించిన యాప్‌లను పరిశీలించారు. వివిధ శాఖల నుంచి సేకరించిన డేటా సెట్లను సమన్వయం చేసుకుం టూ నాసా ఉపగ్రహ చిత్రాలను అనుసంధానం చేస్తూ ఈ యాప్ ను రూపొందించడాన్ని అభినందించారు. భూగర్భజలాల స్థాయి లు, వాటి మార్పులు, ప్రాంతాల వారీ పరిస్థితులను విశ్లేషించడం ద్వారా భవిష్యత్తులో నీటి నిర్వహణకు మెరుగైన నిర్ణయాలు తీసు కునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.


### శాప్ ద్వారా క్రీడా క్యాలండర్ రూపొందించాలి

పాఠశాలల్లో మౌలికసదుపాయాలను మరింతగా మెరుగుపర చాలని సీఎం ఆదేశించారు. విద్యుత్ టారిఫ్‌ను పెంచకపోయినా సేవల్లో లోపాల కారణంగా ప్రజల్లో సంతృప్తి తగ్గుతోందని, సరఫ రా నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో 287.214 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉన్న నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీటి లభ్యతపైనా దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఇసుక లభ్యత ధరలు, సరఫరా పై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. శాప్ ఆధ్వర్యం లో ఏడాది క్రీడా క్యాలెండర్‌ను రూపొందించాలని ఆదేశించారు. పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలోనూ క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. 175 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి లో సిబ్బంది పనితీరును మెరుగుపరిచేలా స్పష్టమైన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. నోడల్ అధికారుల ఆధ్వర్యంలో నియోజ కవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి పనితీరులో మార్పు తీసుకురావాలని ఆదేశించారు. గృహనిర్మాణంలో జీరామ్‌జీ ద్వారా మౌలికసదుపాయాల కల్పన పనులు చేపట్టాలని సూచించారు. డేటా ఆధారిత పాలనలో భాగంగా ప్రభుత్వ శాఖల్లో ఏఐ లివింగ్ ల్యాబ్స్ యాప్‌ల వినియోగం, సమాచార విశ్లేషణను మరింత విస్తరించాలని స్పష్టం చేశారు.

# రాష్ట్రానికి ఖ్యాతి తెచ్చేలా పెట్టుబడుల సదస్సు

- విశాఖలో నవంబరు 12, 13 తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి
- ఎంఎస్ఎంఈలకు ప్రాధాన్యతనిచ్చేలా 5 ప్రాంతాల్లో 5 రీజినల్ కాన్ఫరెన్సులు
- 30 నియోజకవర్గాల్లో శంకుస్థాపనలు
- సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ సన్నాహకాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు





అమరావతి(చైతన్యరథం): పార్టనర్‌షిప్ సమ్మిట్-2026కు సన్నాహకంగా రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో 5 రీజినల్ కాన్ఫరెన్సు లు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, అనంతపురం, తిరుపతిలో రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించాలని, ప్రాజెక్టులకు ఎంవోయూలు జరగాలని దిశానిర్దే శం చేశారు. ఆయా ప్రాంతాల ప్రత్యేకతలు, పెట్టుబడి అవకాశాల ను దృష్టిలో ఉంచుకుని చర్చలు నిర్వహించాలన్నారు. విశాఖ పట్నంలో నవంబరు 12, 13 తేదీల్లో నిర్వహించనున్న 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026కు సంబంధించి రాష్ట్ర ప్రభు త్వం చేపడుతున్న సన్నాహక కార్యక్రమాలపై గురువారం సచివా లయంలో సమీక్ష నిర్వహించారు. భాగస్వామ్య సదస్సు కేవలం ఎంవోయూల కోసం కాకుండా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తినింపేలా, ఏపీ బ్రాండింగ్ మరింత పెరిగేలా నిర్వహించాల న్నారు. పెట్టుబడులతో పాటు మిగిలిన అంశాలపైనా సదస్సులో చర్చ జరగాలని సూచించారు.

### ఎంటర్‌ప్రెన్యూర్లను తీర్చిదిద్దేలా పాఠ్యాంశాలు

ప్రతీ రీజినల్ కాన్ఫరెన్స్‌లో ఎంఎస్ఎంఈ షోకేస్ పేరుతో ప్రోత్సాహం అందించాలని సూచించారు. అలాగే స్టార్టప్‌లకు పెట్టుబడులు పెట్టే వారి కోసం వినూత్నంగా షార్క్ ట్యాంక్ అనే విధానాన్ని ప్రవేశ పెట్టాలని స్పష్టం చేశారు. రతన్ టాటా ఇన్నో వేషన్ హబ్‌లను రీజినల్ కాన్ఫరెన్సులకు అనుసంధానం చేయాల న్నారు. భాగస్వామ్య సదస్సుకు ముందుగానే మరో 30 నియోజక వర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన జరిగేలా కార్యా చరణ చేపట్టాలని చెప్పారు. పాఠశాల విద్యార్థులు స్టార్టప్ ఆలోచనలు చేసేలా రీజినల్ సమ్మిట్ ఉండాలని, 7వ తరగతి నుంచే విద్యార్థులకు ప్రేరణ ఇచ్చేలా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు సంబంధించి పాఠ్యాంశాలు ప్రవేశ పెట్టాలన్నారు. 'ఇన్వెస్ట్ కడప' తరహా కార్యక్రమాలను అన్ని జిల్లాల్లోనూ నిర్వహిస్తే మరింతగా పెట్టుబడులను ఆకర్షించవచ్చని తెలిపారు.

### వేగంగా పెట్టుబడుల గ్రౌండింగ్

సమ్మిట్‌కు ముందు రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న పెట్టుబడుల ప్రతిపాదనలను వేగంగా కార్యరూపంలోకి తీసుకురావడం, గతంలో కుదిరిన ఎంవోయూలను కన్వర్ట్ చేయడం, ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులను గ్రౌండ్ చేయడం, రీజినల్ కాన్ఫరెన్సు ల ద్వారా కొత్త పెట్టుబడులను ఆకర్షించడం వంటి అంశాలపై సమీక్షలో ప్రధానంగా చర్చించారు. అలాగే ప్రస్తుత పెట్టుబడుల స్థితిగతులను పరిశీలించారు. అక్టోబరు చివరి నాటికి పెట్టుబడి ప్రతిపాదనల్లో 80 శాతం కన్వర్ట్ చేయాలని, కన్వర్ట్ అయిన ప్రాజెక్టుల్లో 75 శాతం గ్రౌండింగ్ చేసే లక్ష్యంతో శాఖలు పనిచేయాలని నిర్దేశించారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో రూ.22.57 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 714 ప్రాజెక్టులకు ఎంవోయూలు కుదిరాయని అధికారులు వివరించారు. వీటిలో రూ.16.6 లక్షల కోట్ల విలువైన 473 ప్రాజెక్టులు కన్వర్ట్ అయ్యాయని చెప్పారు. కన్వర్ట్ అయిన ప్రాజెక్టు ల్లో ఇప్పటికే 247 ప్రాజెక్టులు గ్రౌండింగ్ జరిగినట్టు తెలిపారు.

### అక్టోబరు 7 నుంచి రీజినల్ కాన్ఫరెన్సులు

అక్టోబరు 7 నుంచి అక్టోబర్ 26 వరకు రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించనున్నారు. ముందుగా విశాఖపట్నంలో అక్టోబరు 7న ఏఐ, డేటా సెంటర్లు, ఐటీ - ఫిన్‌టెక్, సెమి కండక్టర్స్, జీసీసీ, ఫార్మా, మెడ్‌టెక్ ఫోకస్‌గా కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. అక్టోబరు 12న కాకినాడలో మారిటైమ్, షిప్ బిల్డింగ్, కెమికల్స్, గ్రీన్ హైడ్రోజన్, అమోనియా, ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలకు ప్రయార్టీ ఇవ్వనున్నారు. ఇక అక్టోబరు 16న గుంటూ రులో గవర్నెన్స్, క్యాపిటల్ సిటీ డెవలప్‌మెంట్, అర్బన్ ఇన్‌ఫ్రా, క్వాంటం వ్యాలీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పైన... అక్టోబరు 23న అనంతపురంలో ఏరో స్పేస్, డెఫెన్స్, ఆటోమోటివ్, నేచురల్ ఫార్మింగ్, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, రెన్యువబుల్ ఎనర్జీ, అక్టోబరు 26న తిరుపతిలో టూరిజం, హాస్పిటాలిటీ, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్, సెమికండక్టర్, అడ్వాన్స్డ్ మెటీరియల్స్, ఆటో మోటివ్, స్పేస్, ఫుట్‌వేర్ రంగాలకు ప్రాధాన్యతనిస్తూ రీజినల్ కాన్ఫరెన్సులు జరగనున్నాయి. రీజినల్ కాన్ఫరెన్స్‌లోనే ఎంవో యూలు చేసుకునేలా ఈసారి మార్పులు చేశారు. ప్రధానమైన కొన్ని ప్రాజెక్టుల ఎంవోయూలు సమ్మిట్‌లో చేసుకోవాలని... వివిధ అంశాలపై చర్చలకు ప్రాధాన్యతనిచ్చేలా అలాగే విశాఖ సదస్సు చేపట్టాలని నిర్ణయించారు.

### దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోలతో ప్రచారం

సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026కు పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ప్రతినిధులను ఆకర్షించేందుకు ఇప్పటికే దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. దేశీ యంగా చెన్నై, కోయంబత్తూరు, బెంగళూరు నగరాల్లో రోడ్‌షోలు నిర్వహించగా, సెప్టెంబరు 25న అహ్మదాబాద్, 28న హైదరా బాద్, 30న ముంబైలో రోడ్‌షోలు నిర్వహించనున్నారు. అంతర్జా తీయంగా సింగపూర్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, తైవాన్‌లలో రోడ్‌షో లు పూర్తయ్యాయి. సెప్టెంబరు 29-అక్టోబరు 1 మధ్య స్వీడన్‌లో, అక్టోబరు 13-14 తేదీల్లో జపాన్‌లో, అక్టోబరు 15-16 తేదీల్లో చైనాలో రోడ్‌షోలు నిర్వహించనున్నారు. ఇప్పటికే 11 మంది అంతర్జాతీయ మంత్రులు, 26 మంది అంతర్జాతీయ స్పీకర్లు, 21 దేశాల ప్రతినిధులు భాగస్వామ్య సదస్సుకు ఖరారయ్యారు. మరింత అంతర్జాతీయ, దేశీయ భాగస్వామ్యం కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సింగపూర్, కంబోడియా, మయన్మార్, స్లోవాక్ రిపబ్లిక్, లిథువేనియా, బల్గేరియా, మారిషస్, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, గ్వాటెమాలా, మొజాంబిక్ తదితర దేశాల నుంచి మంత్రులు, ప్రతినిధులు ఈసారి హాజరవుతున్నా రు. ఈసారి 'ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్, థాట్ లీడరిషిప్' ప్రధాన థీమ్‌గా నిర్ణయించారు.

### అక్టోబరు 8న న్యూఢిల్లీలో కర్టెన్ రైజర్

సమ్మిట్‌కు ముందు అక్టోబర్ 8న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించనున్నారు. దౌత్య వేత్తలు, ప్రభుత్వ ప్రతినిధులు, మీడియా సమక్షంలో ఈ కార్యక్రమం జరగనుంది. మరోవైపు విశాఖలోని కాపులుప్పాడలో నిర్మించ తలపెట్టిన కన్వెన్షన్ సెంటర్ భవిష్యత్‌లో మిగిలిన అవసరాలకు వినియోగించుకునేలా ఉండాలని సీఎం అధికారు లకు సూచించారు. రాజమహేంద్రవరంలో కన్వెన్షన్ సెంటర్ గోదావరి పుష్కరాల కన్నా ముందే పూర్తి కావాలని స్పష్టం చేశారు. అలాగే అమరావతి, తిరుపతి, అనంతపురం కన్వెన్షన్ సెంటర్ల డిజైన్లు కూడా ప్రత్యేకంగా నిలిచేలా ఉండాలని సూచించారు.

# గుజరాత్ ముఖ్యమంత్రితో లోకేష్ భేటీ

- జాతీయ విధాన చర్చల్లో ఏకతాటిపై ఉందాం
- కోస్ట్ టు కోస్ట్ వాణిజ్య కారిడార్‌ను పరిశీలించండి
- శ్రీవారి ఆలయానికి భూమి కేటాయించాలని వినతి
- విజయవాడ ఉత్సవ్‌కు రావాల్సిందిగా ఆహ్వానం






గాంధీనగర్/గుజరాత్(చైతన్యరథం): గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో మంత్రి నారా లోకేష్ గాంధీనగర్‌లో భేటీ అయ్యారు. తీరప్రాంత రాష్ట్రాల వృద్ధి, పారిశ్రామిక నియంత్రణ సడలింపు, ఆర్థిక సంస్కరణలు వంటి కీలక జాతీయ విధాన చర్చ ల్లో ఆంధ్రప్రదేశ్, గుజరాత్ ఏకతాటిపై ఉండాలని కోరారు. పశ్చిమ తీరంలోని గుజరాత్, తూర్పు తీరంలో గేట్‌వేగా ఉన్న ఆంధ్రప్రదేశ్ సమన్వయంతో ముందుకుసాగితే సముద్ర, పోర్టుల ఆధారిత పరిశ్రమలతో పెద్దఎత్తున అభివృద్ధి సాధిస్తుందన్నారు. గుజరాత్ మోడల్ సముద్ర రవాణా అభివృద్ధిలో భాగంగా రామా యపట్నం, మచిలీపట్నం, మూలపేట నాన్-మేజర్ పోర్టులను ఏపీ అభివృద్ధి చేస్తోందన్నారు. ప్రైవేట్ పోర్టు కన్సెషన్లు, పోర్టుల ఆధారిత పారిశ్రామికీకరణ (పీఎల్ఐడీ)లో ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి ద్వైపాక్షిక (కోస్ట్ టు కోస్ట్) లాజిస్టిక్స్, వాణిజ్య కారిడార్ ఆవశ్యకతను వివరించారు.

### ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గిఫ్ట్ సిటీ ఆదర్శం

గుజరాత్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గిఫ్ట్ సిటీ ఫ్రేమ్‌వర్క్‌ను ఆదర్శంగా తీసుకుని నూతన రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్, అమరావతి ప్రాంతాల్లో పెద్దఎత్తున పారిశ్రామిక అభివృద్ధికి శ్రీకా రం చుట్టినట్లు చెప్పారు. దేశంలో అంతర్జాతీయ ఆర్థిక సేవలు, ఆవిష్కరణలకు గిఫ్ట్ ఐఎఫ్ఎస్ఈ ల్యాండ్‌మార్క్‌గా నిలిచిందని కొనియాడారు. అదే తరహాలో విశాఖపట్నం, అమరావతిలో ఆధు నిక బిజినెస్ డిస్ట్రిక్ట్‌లను అభివృద్ధి చేయడానికి ఏపీ అమలు చేస్తు న్న వ్యూహాలను వివరించారు. గిఫ్ట్ సిటీలోని సింగిల్ విండో క్లియరెన్స్, డెవలపర్ ప్రోత్సాహకాలు, నియంత్రణ నిర్మాణాలపై ద్వైపాక్షిక పరిజ్ఞాన మార్పిడికి మద్దతు అందించాలని కోరారు. ఏపీలో సెమీకండక్టర్, గ్రీన్ ఎనర్జీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తూ పారిశ్రామిక సప్లయ్ చైన్‌తో అనుసంధానిస్తున్నామని తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్ (కాకినాడ హబ్), పారిశ్రామిక స్మార్ట్ సిటీలు (కొప్పర్తి, ఓర్వకల్లు), టెక్నాలజీ వర్క్‌ఫోర్స్ తయారీతో ఏపీ ప్రణాళి కాబద్ధంగా ముందుకుసాగుతోందని చెప్పారు.

### విజయవాడ ఉత్సవ్, గోదావరి పుష్కరాలకు ఆహ్వానం

అక్టోబరు 11 నుంచి 20 వరకు పున్నమి ఘాట్ వేదికగా జరగనున్న విజయవాడ ఉత్సవ్‌కు హాజరుకావాల్సిందిగా లోకేష్ ఆహ్వానించారు. 2027 గోదావరి పుష్కరాలకు రావాల్సిందిగా కోరారు. గుజరాత్‌లో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయ నిర్మా ణం చేపట్టాలని భావిస్తున్నామని, ఇందుకు అవసరమైన భూమి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ వెంట రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ ఉన్నారు.

# హార్టీకల్చర్ హబ్‌ను గ్లోబల్ ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతాం

- కరవు నుంచి కలల సాకారం వైపు రాయలసీమ
- 201 క్లస్టర్లలో లక్ష కోట్ల పెట్టుబడులతో అభివృద్ధి
- అక్టోబరు 2న మదనపల్లెలో ప్రాజెక్టుకు శ్రీకారం
- ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన
- ఎల్‌నినో ప్రభావం-ప్రత్యామ్నాయ పంటలు,
- ఉద్యాన హబ్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి(చైతన్యరథం): రాయలసీమలోని ఉద్యాన పంటల హబ్‌ను గ్లోబల్ ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అక్టోబరు 2వ తేదీన అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకు స్థాపన చేసి ఉద్యాన హబ్‌కు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించా రు. గతంలో కరువు, వర్షాభావంతో వెనుకబడిన రాయలసీమను ప్రపంచస్థాయి ఉద్యాన పంటల కేంద్రంగా తీర్చిదిద్దాలని అధికా రులను ఆదేశించారు. ఉమ్మడి ప్రకాశంతో కలిపి రాయలసీమ లోని 10 జిల్లాల్లో 201 క్లస్టర్లతో రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టీకల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. సచివాల యంలో ఈ అంశంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో సుమారు లక్ష కోట్ల పెట్టుబడు లతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు అక్టోబరు 2న శ్రీకా రం చుట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఇందులో ప్రభుత్వం రూ.40 వేల కోట్లు, ప్రైవేటు రంగం రూ.60 వేల కోట్ల పెట్టుబడులతో రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన పంటల హబ్‌గా తీర్చిదిద్దు తామన్నారు. రాయలసీమ హార్టీకల్చర్ హబ్ కార్యక్రమంలో రైతు లు, ప్రజలను పెద్దఎత్తున భాగస్వాములను చేస్తూ పండుగలా నిర్వహించాలని సూచించారు. ప్రతి రైతూ ఇదే నా భవిష్యత్తు అనే భావన కలిగేలా కార్యక్రమాలు ఉండాలని అన్నారు. గతంలో రాయలసీమలో తీవ్రమైన కరవు, వర్షాభావ పరిస్థితులు ఉండేవ ని.. ఇప్పుడు ఆ పరిస్థితులను మార్చి అభివృద్ధి దిశగా వివిధ కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. సూక్ష్మ సేద్యం నుంచి హంద్రీనీవా, గాలేరు-నగరి ప్రాజెక్టుల ద్వారా కరవు సీమకు నీటిని తరలించడంతో పాటు, ఫామ్ పాండ్స్, చెక్‌డ్యామ్‌ల నిర్మా ణం వంటి చర్యలతో వ్యవసాయానికి అనుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా సుమారు 660 కిలోమీటర్ల మేర కుప్పం వరకు నీటిని తీసుకెళ్లగలిగామని తెలి పారు. కియా నుంచి ఆమ్నా డిఫెన్సు ప్రాజెక్టు వరకూ పరిశ్రమల ఏర్పాటుతో రాయలసీమలో పారిశ్రామిక మార్పు చోటుచేసుకుం దని, ఇప్పుడు ఉద్యాన రంగం ద్వారా తదుపరి స్థాయి ఆర్థిక పరి వర్తన సాధించాలని ఆకాంక్షించారు. కరువును అవకాశంగా మార్చుకుని క్షామం నుంచి అభివృద్ధి వైపు రాయలసీమ రూపాం తరం చెందుతోందని పేర్కొన్నారు.



### 201 క్లస్టర్లలో ఉద్యాన పంటల కార్యాచరణ

10 జిల్లాల్లోని 201 క్లస్టర్లలో ఉద్యాన పంటలు, ఎఫ్‌పీఓలు, ఆహార శుద్ధి పరిశ్రమలు, మార్కెటింగ్ వ్యవస్థలను అనుసంధానం చేయాలని సీఎం ఆదేశించారు. క్లస్టర్, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయాలని సూచించారు. డ్వాక్రా సంఘాల తరహాలో రైతులు పరస్పరం సహకరించుకుంటూ ఎఫ్‌పీఓలుగా ఏర్పడి తమ ఉత్పత్తులను సమష్టిగా మార్కెట్ చేసుకునే విధానాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. ఉద్యాన పంటల సాగులో కొత్త రకాల పంటల ఎంపిక, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటు, మార్కెటింగ్ అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అంతర్జాతీయ డిమాండ్ ఉన్న పంటలపై దృష్టి సారించి ఫలితాలు సాధించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. రాయలసీమలో వివిధ రకాల పండ్లను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉందని, ఇక్కడ ఉత్పత్తి అయ్యే అనేక రకాల పండ్లకు ప్రపంచ మార్కెట్‌లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలిపారు. రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టీకల్చర్ హబ్ ద్వారా వచ్చే 5-6 ఏళ్లలో రాయలసీమను తదుపరి స్థాయికి తీసుకెళ్లాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. జిల్లాల కలెక్టర్లు తమ ప్రాంతాల్లోని అవకాశాలను గుర్తించి విని యోగించుకోవాలని సూచించారు. ప్రతి క్లస్టర్‌లో రైతులను చాంపియన్ ఫార్మర్లుగా రైతులను తీర్చిదిద్దేలా కార్యాచరణ ఉండాలని చెప్పారు.

### గాంధీ జయంతి రోజున శ్రీకారం

అక్టోబరు 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని ఇంటిగ్రేటె డ్ హార్టీకల్చర్ హబ్ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషదా యకమని సీఎం వ్యాఖ్యానించారు. అలాగే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. మన ఉద్యాన ఉత్పత్తులు విదేశీ మార్కెట్లకు ఎగుమతి చేసేలా ఈ హబ్ కు శ్రీకారం చుడుతున్నామని స్పష్టం చేశారు. ఉమ్మడి ప్రకాశం సహా రాయలసీమ జిల్లాల్లోని 201 క్లస్టర్ల లోని రైతులను కూడా వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. 3 వేల పైచిలుకు రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శనలు క్లస్టర్ వారీగా కార్యక్రమాలు నిర్వహించి ఉద్యాన హబ్ ఆవిర్భా వాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని చెప్పారు. రాయలసీమ సంస్కృతి ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమా లు ఏర్పాటు చేయాలని సూచించారు. క్లస్టర్ స్థాయిలో వర్క్‌షాప్ లు, ట్రాక్టర్ ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ఉద్యాన పంటల సాగు ద్వారా రైతుల జీవితాల్లో వచ్చిన మార్పులను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఉద్యాన పంటల ద్వారా పెరిగిన రైతుల ఆదాయం, కొత్త పంటలతో వారి జీవన ప్రమాణాలు ఎలా మారాయన్న అంశాలను తెలియచెప్పాలని స్పష్టం చేశారు. రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌నూ ప్రజలు స్వాగతించేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు.

### ఎల్‌నినో ప్రభావం ఎదుర్కొనేలా పంటల ప్రణాళిక

ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై సీఎం సమీక్షిం చారు. ఉత్పత్తి, వినియోగం, వాణిజ్య అవకాశాలను పరిగణనలోకి తీసుకుని పంటల ప్రణాళిక రూపొందించాలని సూచించారు. శనగ, మినుము, పెసర, కంది, రాగులు, మొక్కజొన్న, జొన్నలు, ఉల్లి తదితర పంటల సాగు, కొనుగోళ్లు, కనీస మద్దతు ధరల అంశాలపై కేంద్రాన్ని సంప్రదించాలని నిర్ణయించారు. ప్రత్యామ్నా య పంటల ద్వారా ప్రతీ ఎకరానూ సాగులోకి తీసుకురావటం ద్వారా ఎల్‌నినో ప్రభావాన్ని పూర్తిస్థాయిలో ఎదుర్కోవాలని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖలో ఏఐ ఆధారిత విశ్లేషణ వ్యవస్థను ఉపయోగించి ఏ ప్రాంతంలో ఏ పంట సాగు చేస్తే రైతులకు, వినియోగదారులకు ప్రయోజనం ఉంటుందో గుర్తించాలని సూచిం చారు.

ద్రవ్యోల్బణం పెరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పప్పు దినుసులు, చిరు ధాన్యాల లాంటి 14 రకాల పంటల ధరలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, రైతులకు గిట్టుబాటు ధర లభించేలా, వినియోగదారులకు ధరల భారం పడకుండా సమతుల్య విధానం అవలంబించాలని సూచించారు. ఇకపై ప్రతి వారం ద్రవ్యోల్బణంపై సమీక్ష నిర్వహిస్తానని తెలిపా రు. ఆరోగ్యపరంగా ప్రజలు వంటనూనె వినియోగాన్ని పరిమితం చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. రాగి, జొన్న, సజ్జ తదితర చిరు ధాన్యాల వినియోగాన్ని పెంచేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవా ట్లపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించా రు. నంద్యాల, కర్నూలు, అన్నమయ్య, చిత్తూరు, మార్కాపురం, శ్రీసత్యసాయి, అనంతపురం, కడప జిల్లాల కలెక్టర్లతో వర్షాలు, పంటల సాగుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల ఉన్నతాధికారులు, ఆయా జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా హాజరయ్యారు.

# గోద్రెజ్ ఆగ్రో కెమికల్ యూనిట్ ఏర్పాటు చేయండి

### గ్రూప్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామితో లోకేష్ భేటీ

న్యూఢిల్లీ: గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామి తో మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. గోద్రెజ్ అనుబంధ సంస్థల్లో ఒకటైన అస్టెక్ లైఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఒక ఆగ్రో కెమికల్ యూనిట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. రెడీ టు ఈట్ పాల ఉత్పత్తుల కోసం ఏపీలో ప్రాసెసింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాలను విస్తరించడానికి గోద్రెజ్ అగ్రోవెట్ విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా సూచించా రు. గోద్రెజ్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామి స్పందిస్తూ గోద్రెజ్ /బాయిస్ గృహోపకరణాలు, ఇంటీరియో ఫర్నిచర్, తాళాలు, పారిశ్రామిక పరికరాల తయారీ,



ఇస్రో/డీఆర్‌డీవో ఏరోస్పేస్ విడి భాగాల తయారీ రంగంలో సేవలందిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా పెద్దఎత్తున రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నాం, ఇంటీరియో ద్వారా 2 లక్షల చదరపు అడుగుల రిటైల్ స్థలాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పెట్‌కేర్ శ్రేణి, రుణాల కోసం గోద్రెజ్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్‌ను కొత్తగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గోద్రెజ్ అగ్రోవెట్ భారతదేశంలో అతిపెద్ద ఆయిల్ పామ్ ప్రాసెసర్‌గా ఉందని తెలిపారు. గత ఏడాది నవంబరులో ఆంధ్రప్రదేశ్‌లో గోద్రెజ్ అగ్రోవెట్, ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాల ఏర్పాటు కోసం రూ.70 కోట్ల విలువైన ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేసినట్లు చెప్పారు. ద్వారకా తిరుమల మండలంలో రూ.210 కోట్ల పెట్టుబడితో మిఠాయి, కోకో బటర్ ప్రత్యామ్నాయ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నా మని తెలిపారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలి స్తామని చెప్పారు.




# స్థిరమైన ప్రభుత్వంతోనే పేదరికం నిర్మూలన

- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీ కల్చర్
- ఆ వేగాన్ని క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లాం
- ప్రాజెక్టుల గ్రౌండింగ్ ప్రథమ ప్రాధాన్యం
- మా ఏకైక ప్రధాన లక్ష్యం ఉద్యోగాల కల్పన
- 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్
- ఆర్థిక వ్యవస్థగా ఏపీని నిలబెట్టడమే లక్ష్యం
- క్వాంటంతో పాటు హార్టికల్చర్, ఆక్వాకల్చం ముఖ్యమే
- అక్టోబర్ 2న హార్టికల్చర్ మిషన్‌ను ప్రారంభిస్తున్నాం
- ఢిల్లీలో పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా ఫైర్ సైడ్ చాట్‌లో మంత్రి నారా లోకేష్




న్యూఢిల్లీ: స్థిరమైన ప్రభుత్వంతోనే పేదరిక నిర్మూలన జరుగు తుంది..అగ్రికల్చర్ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్ వరకు స్పీడ్ ఏపీ కల్చర్‌గా మారింది.. స్పీడ్ ఈజ్ మనీ.. టైం ఈజ్ మనీ అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర 2047: ది న్యూ గ్రోత్ లేబోరేటరీ' అంశంపై నిర్వహించిన 'ఫైర్‌సైడ్ చాట్' ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వ యకర్తగా వీవో మొబైల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రెసిడెంట్ అర్జిత్ సేన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ప్రతి రాజకీయ పార్టీకి ఓ కల్చర్ ఉంటుంది.ప్రభుత్వాలకు కూడా ఉంటుంది. ఆ కల్చర్ నాయ కత్వం నుంచి వస్తుంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీ కల్చర్. ఆ వేగాన్ని మేం ఇప్పుడు క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లాం. ప్రతిఒక్కరూ వేగాన్ని ఎలా అందుకోవాలని ఆలోచిస్తున్నారు. మంత్రివర్గ సమావేశంలో కూడా ఫైళ్లను ఎంత వేగంగా పరిష్కరి స్తున్నారనే అంశంపై చర్చ జరుగుతుంది. దీనిపై మంత్రులకు ర్యాంకులు కూడా ఇవ్వడం జరుగుతుంది. అదే విధానం బ్యూరోక్రసీ స్థాయిలో కూడా ఉంటుందని తెలిపారు.

### స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీ ప్రత్యేకత

పెట్టుబడులను ఆకర్షణలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీ ప్రత్యేకత. పొరుగు రాష్ట్రాల్లో దశాబ్దానికి పైగా నిలిచిపోయిన ప్రాజెక్టులను ఏపీలో 18 నెలల్లోపే ప్రారంభించగలిగాం. 13 నెలల్లోనే విశాఖకు గూగుల్ డేటా సెంటర్‌ను తీసుకువచ్చాం. విధానాల విషయంలో కూడా ఇదే వేగం అవసరం. టెక్నాలజీ చాలా వేగంగా మారుతోంది. వేగవంతమైన పురోగతి జరుగు తోంది. సాధారణంగా విధానాలు టెక్నాలజీ కంటే ఒక అడుగు వెనుకే ఉంటాయి. విధానాలు కూడా తమను తాము మార్చుకు నేందుకు మంత్రుల పాత్ర, బ్యూరోక్రాట్ల పాత్ర కీలకమవుతుంది. పౌరులకు వేగంగా సేవలందించేందుకు 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకువచ్చాం. దాదాపు వెయ్యి పౌరసేవలను వాట్సా ప్ ద్వారా అందిస్తున్నాం. టెక్నాలజీని విస్తృతంగా ఎలా ఉపయోగి స్తున్నామో చెప్పడానికి ఇదో ఒక గొప్ప ఉదాహరణ. అందువల్ల స్పీడ్ ఇప్పుడు ఏపీ ప్రభుత్వ సంస్కృతిగా మారింది. ఇది వ్యవసాయం నుంచి తయారీ రంగం వరకు, పాలన నుంచి ఐటీ వరకు అన్ని రంగాల్లో మార్పును తీసుకొస్తోంది. సీఎం చంద్రబా బు నేతృత్వంలో మేం తీసుకొచ్చిన ప్రధాన సాంస్కృతిక మార్పు ఇదేనని చెప్పారు.

### రాష్ట్రవ్యాప్తంగా 23 ప్రత్యేక క్లస్టర్ల అభివృద్ధి

రాష్ట్రంలో 23 ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం. అవి స్పేస్, డ్రోన్లు, సిమెంట్, స్టీల్, మెడికల్ డివైసెస్, ఫార్మా, ఏఐ, డేటా నుంచి హార్టికల్చర్, ఆక్వా రంగాల వరకు విస్తరించాయి. వర్టికల్, హారిజాంటల్ విధానంలో ముందుకు వెళుతు న్నాం. ఒక పూర్తిస్థాయి నౌకను తయారు చేయడానికి సుమారు 360 కంపెనీ ల అవసరం ఉంటుంది. ఫైర్ ఫైటింగ్ పరికరాలు, నావిగేషన్ పరికరాలు, లైటింగ్, మెటీరియల్ సైన్సెస్ వంటి అనేక రంగాలకు చెందిన కంపెనీలు కలిసి ఒక షిప్‌బిల్డింగ్ క్లస్టర్‌ను తయారు చేస్తాయి. ఇలాంటి 23 క్లస్టర్లను మేం అభివృద్ధి చేస్తున్నాం. వీటిని వర్టికల్స్ అంటారు. ఇక హారిజాంటల్ విధానంలో మానవ వనరు ల అభివృద్ధి విభాగం వస్తుంది. ఆయా క్లస్టర్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచాల్సిన అవసరం ఉంది. సర్టిఫికేషన్, టెస్టింగ్, వాలిడేషన్ వ్యవస్థలను కూడా అభివృద్ధి చేయాలి. స్కైరూట్ ఇందుకు ఉదాహరణ. ఏడాది క్రితమే మేం స్కైరూట్‌పై నమ్మకం ఉంచాం. వారికి 300 ఎకరాల భూమిని ఎకరాకు రూ.5 లక్షల చొప్పున ఇచ్చాం. వారు తమ ఉత్పత్తులను తయారు చేసుకోవడానికి, మన లాంచ్‌ప్యాడ్‌కు సమీపంలో తమ కార్యకలాపాలను ఏర్పాటు చేసుకోవడానికి ఈ భూమిని ఉపయో గిస్తున్నారు. అదేవిధంగా స్పేస్ సిటీని నిర్మిస్తున్నాం. అదే విధంగా సాగర్ డిఫెన్స్ అనే మరో సంస్థతో కూడా ఇదే విధానాన్ని అనుస రించాం. వారు సముద్ర సంబంధిత డ్రోన్లను తయారు చేస్తున్నా రు. వారు మా వద్దకు వచ్చినప్పుడు వారి విలువ సుమారు రూ.3 వేల కోట్లు ఉండేది. ఇప్పుడు అది రూ.23 వేల కోట్లకు చేరింది. ఈ మార్పు కేవలం 18 నుంచి 24 నెలల్లోనే జరిగింది. క్లస్టర్ ఆధారిత విధానం గొప్ప ఫలితాలను ఇస్తోందని పేర్కొన్నారు.

### స్పీడ్ ఈజ్ మనీ.. టైం ఈజ్ మనీ

ఎవరూ ఇంకా పెద్దగా దృష్టి పెట్టని, ప్రారంభ దశలో ఉన్న కంపెనీలను గుర్తించి ముందుగానే వాటిపై పెట్టుబడి రూపంలో నమ్మకం ఉంచగలుగుతున్నాం. కొన్ని రాష్ట్రాల్లో ఇబ్బందులు ఎదు ర్కొంటున్న కంపెనీలను కూడా ముందుగానే సంప్రదిస్తున్నాం. రాష్ట్రంగా మేం వారికి మద్దతు ఇస్తున్నాం. అవసరమైన ప్రక్రియ లు సక్రమంగా పూర్తైన తర్వాత ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. ఆ తర్వాత వారు తమ సత్తాను చూపిస్తున్నారు. అదే విధానాన్ని ఆర్సెలర్ మిట్టల్ విషయంలో కూడా అనుసరించాం. 3వేల ఎకరా ల భూమిని ఇచ్చాం. వారు తమ పనులను ప్రారంభించారు. 17 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరుగుతోంది. అసాధ్యాన్ని మేం సుసాధ్యం చేశాం. ఆదిత్య మిట్టల్ తో జూమ్ కాల్ నుంచి ప్రాజెక్టు గ్రౌండింగ్ వరకు పట్టిన కాలం 17 నుంచి 18 నెలలు మాత్రమే. పర్యావరణ అనుమతు లు సహా అన్ని ప్రక్రియలను

(తరువాయి 6లో..)



చైతన్యరథం

# స్థిరమైన ప్రభుత్వంతోనే పేదరికం నిర్మూలన



(5వ పేజీ తరువాయి.. )

పూర్తి చేశాం. ఫలితాలపై దృష్టిపెట్టి పనిచేస్తున్నాం. ఇదే మమల్ని ఇతరుల కంటే ప్రత్యేకంగా నిలబెడు తోంది. ఎందుకంటే స్పీడ్ ఈజ్ మనీ, టైం ఈజ్ మనీ.

## ప్రాజెక్టులను గ్రౌండింగ్‌ను స్వయంగా పర్యవేక్షిస్తున్నా

ప్రాజెక్టుల గ్రౌండింగ్‌ను నేను స్వయంగా పర్యవేక్షిస్తున్నా. సమస్యలు ఏవైనా ఉంటే కలిసి పరిష్కరిస్తాం. కాబట్టి స్పీడ్‌ను ప్రభుత్వ కల్చర్‌గా మార్చడం, దానికి క్లస్టర్ ఆధారిత విధానాన్ని జోడించడం.. ఈ రెండూ కలిసి మనం ఈరోజు సాధిస్తున్న విజయాలకు కారణం అవుతున్నాయి. ప్రాజెక్టులను గ్రౌండ్ చేయడం మా ఏకైక ప్రధాన ప్రాధాన్యత. మేం కేవలం ఎంవోయూలపై ఆధారపడబోం. నాకు ఎంవోయూలపై సంతకం చేయడం అంతగా ఇష్టం లేదు. పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో కొన్ని ఎంవోయూలు చేసుకున్నాం. కానీ మేం 80 శాతం గ్రౌండింగ్ లక్ష్యంగా పెట్టుకు న్నాం. 80 శాతం కంటే తక్కువ గ్రౌండింగ్ రాష్ట్రానికి ఆమోద యోగ్యం కాదని చెప్పాను. ఎందుకంటే ప్రాజెక్టు ఎంత త్వరగా గ్రౌండ్ అవుతుందో అంత త్వరగా పన్నులు చెల్లిస్తారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అంత వేగంగా అభివృద్ధి చెందుతుంది. దీంతో 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అనే లక్ష్యం మరింత చేరువ అవుతుంది.

## సమగ్ర అభివృద్ధి ఏపీ లక్ష్యం

అందరికీ పీపీపీ మోడల్ తెలుసు. ఏపీలో పీ-4 మోడల్ అమలుచేస్తున్నాం. ప్రజలను నాలుగో భాగస్వామిగా చేర్చాం. అభివృద్ధి ప్రయాణంలో పేదలు, వెనుకబడిన వర్గాలను విస్మరించకూడదు. మేం మరింత సమగ్ర అభివృద్ధి కోరుకుంటు న్నాం. కేవలం నగదు ఇవ్వడం పరిష్కారం కాదని మేం విశ్వసిస్తు న్నాం. ఆలోచనలు, అనుభవం, అవకాశాల పరిచయం కూడా అంతే ముఖ్యమైనవి. ఇక్కడ పరిశ్రమలు కీలక పాత్ర పోషించాలి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజలకు కొత్త అవకాశాలను పరిచయం చేయాలి. ఏపీలోని నియోజకవర్గాల్లో దీనివల్ల అద్భుత మైన మార్పులను చూస్తున్నాం. ముఖ్యమంత్రి గారు ఇటీవల తన నియోజకవర్గానికి వెళ్లి తిరిగి వస్తూ ఒక విషయం మాతో పంచు కున్నారు. ఏడాది క్రితం వరకు ఇటుకల బట్టీలో పనిచేసిన ఒక మహిళ ఇప్పుడు అదే వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. ఆమె ప్రస్తుతం 20 మందికి ఉపాధి కల్పిస్తోంది. ఆమెకు పెట్టుబడిగా అవసరమై నది కేవలం రూ.60 వేలు మాత్రమే. కానీ అంతకంటే ముఖ్యంగా ఆమెకు బుక్ కీపింగ్ ఎలా చేయాలి? కొత్త మార్కెట్లను ఎలా అన్వేషించాలి? ఉత్పత్తిని ఎలా అమ్మాలి? మార్కెటింగ్ ఎలా చేయాలి? అనే విషయాల్లో మార్గదర్శకత్వం అవసరమైంది. అక్కడే నిజమైన విలువ ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ ఉన్న ప్రతిఒక్కరి కీ ప్రత్యేకమైన అనుభవాలు ఉన్నాయి. బిజినెస్ స్కూల్‌లో నేర్చు కునే దానికంటే జీవిత ప్రయాణంలో మనం చాలా ఎక్కువ నేర్చు కుంటాం. ఆ అనుభవాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి. కంపెనీలు పాఠశాలలను దత్తత తీసుకోవడం కూడా మనం చూస్తున్నాం. ఇదే మేం అమలుచేస్తున్న పీ-4 మోడల్.

## రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ అవసరం

రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ కూడా ఉండాలి. రాష్ట్రా లు పోటీ పడితే, భారతదేశం గెలుస్తుంది. నేను దీనిని పూర్తిగా విశ్వసిస్తా. ఈ కార్యక్రమం తర్వాత నేను గుజరాత్‌కు వెళుతున్నా ను. అక్కడ కూడా ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని పెట్టుబడులను ఆకర్షిం చేందుకు ప్రయత్నిస్తాను. అదేవిధంగా గుజరాత్ వాళ్లు కూడా ఆక్వా రంగంలో పెట్టుబడులను ఆకర్షించడానికి ఆంధ్రప్రదేశ్‌కు రావచ్చు. ఇదేవిధంగా మనం పనిచేయాలి. ఒక రాష్ట్రం ఏదైనా కొత్తగా చేసి మంచి ఫలితాలు సాధిస్తే ఇతర రాష్ట్రాలు త్వరగా నేర్చుకుంటాయి.

## 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఏపీ

వచ్చే పదేళ్లలో వేగంగా అభివృద్ధి చెందే ఉద్యోగ రంగాల విషయానికి వస్తే.. ఏపీలో 23 క్లస్టర్లు ఉన్నాయి. సాంప్రదాయ తయారీ రంగాలైన సిమెంట్ నుంచి ఆటోమొబైల్, మెటీరియల్ సైన్సెస్ వరకు విస్తృతమైన రంగాలు ఉన్నాయి. రాష్ట్రంలో రేర్ ఎర్త్, మినరల్ క్లస్టర్ కూడా అభివృద్ధి చెందుతోంది. బయోమెడికల్, ఫార్మా, ఏఐ, డేటా సెంటర్లు వంటి రంగాలు కూడా ఉన్నాయి. గూగుల్ ఏపీలో భారీ పెట్టుబడులు పెడుతోంది. దాని తర్వాత మరికొన్ని పెట్టుబడులు కూడా వస్తున్నాయి. క్వాంటం టెక్నాలజీ కూడా రాష్ట్రానికి వస్తోంది. అమరావతిలో క్వాంటమ్ రంగాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఐబీఎం నుంచి ప్రపంచంలోని తొలి 150-క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావడానికి కృషిచేస్తున్నాం. కేవలం కంప్యూటర్‌ను తీసుకురావడమే కాదు... పూర్తి క్వాంటం ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తాం. తయారీ రంగం విషయా నికి వస్తే.. క్రయోజెనిక్స్, మెటీరియల్ సైన్సెస్ వంటి రంగాలపై దృష్టి పెట్టాలి. క్వాంటం టెక్నాలజీకి సంబంధించిన వినియోగా లను అభివృద్ధి చేయాలి. హాస్పిటాలిటీ రంగం కూడా అంతే ముఖ్యమైనది. రాష్ట్రంలో సుమారు 50 వేల హోటల్ రూమ్‌లను నిర్మిస్తున్నాం. అందువల్ల ఈ రంగంలో కూడా భారీ అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఏపీ 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంది. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం.





## హార్టికల్చర్ మిషన్‌లో లక్ష కోట్ల పెట్టుబడులు


క్వాంటం ఎంత ముఖ్యమో, హార్టికల్చర్ కూడా అంతే ముఖ్యం..ఆక్వాకల్చర్ కూడా అంతే ముఖ్యం. అక్టోబర్ 2న హార్టి కల్చర్ మిషన్‌ను ప్రారంభిస్తున్నాం. దాదాపు లక్ష కోట్ల పెట్టుబడులు ఈ రంగంలో రానున్నాయి. పరిశోధన కూడా ముఖ్యమే. హైదరాబాద్‌లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఉన్నట్లే, ఆంధ్రప్ర దేశ్‌లో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను అభివృద్ధి చేయాలను కుంటున్నాం. అదే నమూనాను వ్యవసాయ రంగానికి అనుసరిస్తు న్నాం. అందువల్ల మా దృష్టిలో హార్టికల్చర్ నుంచి అగ్రికల్చర్, ఆక్వాకల్చర్ నుంచి క్వాంటమ్ వరకు.. మొత్తం 23 రంగాలు ముఖ్యమైనవే.

## స్థిరమైన ప్రభుత్వంతోనే పేదరికం నిర్మూలన

2047 నాటికి సాధారణ ఏపీ పౌరుడి జీవితం ఎలా ఉంటుం దనే ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. ఒక తరంలోనే మనం పేదరికా న్ని నిర్మూలించగలమని నా నమ్మకం. ఒక తరం అంటే దాదాపు ఒక దశాబ్దం. ఒక దశాబ్దం పాటు స్థిరమైన, నిరంతరాయమైన ప్రభుత్వం ఉంటే పేదరికాన్ని నిర్మూలించగలం. ఏపీలో మా ఏకైక ప్రధాన లక్ష్యం ఉద్యోగాల కల్పన. అదే మా సింగిల్ అజెండా అని మంత్రి లోకేష్ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ కార్పోరేట్ అఫైర్స్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామి, వివో మొబైల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రెసిడెంట్ అర్జిత్ సేన్, సెల్‌కాన్ గ్రూప్ ఫౌండర్, డైరెక్టర్ ఆర్.మురళీకృష్ణ, డీజీఏ గ్రూప్ పార్టనర్ అండ్ హెడ్ ఆఫ్ ఇండియా ఆఫీస్ సునీతా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.











# తిరుపతిలో మొబైల్స్ కాంపోనెంట్స్ తయారీ కేంద్రం

**- వెండర్ ఎకో సిస్టమ్‌కు సమావేశాన్ని నిర్వహించండి**

**- వివో ఇండియా ప్రెసిడెంట్‌కు మంత్రి లోకేష్ విజ్ఞప్తి**

న్యూఢిల్లీ: చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్, యాక్సెసరీస్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ వివో ఇండియా ప్రెసిడెం ట్ అర్జిత్ సేన్ (గవర్నమెంట్ ఎఫైర్స్/స్ట్రాటజిక్ ఎంగేజ్‌మెంట్)తో మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఎలక్ట్రాని క్స్ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తిరుపతిలో వివో మొబైల్స్ కాంపోనెంట్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. వివో సరఫరాదారుల కోసం ఒక కాంపోనెంట్స్ తయారీ పార్క్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. వివో, దాని అనుబంధ సంస్థల వెండర్ ఎకో సిస్టమ్ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలసి ఒక సప్లై చైన్ సమావేశా న్ని నిర్వహించాలని సూచించారు. దీనికి స్పందించిన వివో ఇండియా ప్రెసిడెంట్ అర్జిత్ సేన్ మాట్లాడుతూ వివో మొబైల్ ఇండియా ప్రతిఏటా 154.2 మిలియన్ యూనిట్ల మొబైల్ యూని ట్లను తయారీ చేస్తూ స్మార్ట్ ఫోన్ మార్కెట్‌లో 2025 నాటికి అగ్రగామిగా ఉందని తెలిపారు. దేశంలో విక్రయించే ఫోన్లలో 99 శాతానికి పైగా (మదర్‌బోర్డులు, 90% పైగా బ్యాటరీలు, ఛార్జర్ లతో సహా) గ్రేటర్ నోయిడాలోనే తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని తెలిపారు.

# విశాఖలో ఇంజనీరింగ్ సెంటర్, జీసీసీ కేంద్రం

***- సిస్కో ఇండియా ఎండీతో భేటీలో లోకేష్ వినతి***



న్యూఢిల్లీ: గ్లోబల్ నెట్‌వర్కింగ్, సెక్యూరిటీ, కొలాబరేషన్/ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పేరెన్నికగన్న సిస్కో సిస్టమ్స్ (యుఎస్‌ఏ) మేనేజింగ్ డైరెక్టర్ (ఇండియా అండ్ సౌత్ ఈస్ట్ ఆసియా) హరీష్ కృష్ణన్‌తో మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు.

డేటా సెంటర్ ఎకోసిస్టమ్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్ర దేశ్‌లో భారీ ఉత్పత్తి వల్ల కలిగే ప్రయోజనాలను (ఎకానమీస్ ఆఫ్ స్కేల్) సాధించడానికి డేటా సెంటర్ వాల్యూ చైన్ మొత్తం వ్యవస్థను రాష్ట్రంలోకి ఆకర్షించాలని ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు. డేటా సెంటర్ల డిమాండ్‌కు అనుగుణంగా ఏపీలో యూనిఫైడ్ కంప్యూటింగ్ సిస్టమ్ సర్వర్లు, స్విచ్‌లు, రౌటర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్/జీసీసీని ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

సిస్కో ఇండియా ఎండీ హరీష్‌కృష్ణన్ మాట్లాడుతూ భారతదేశంలో 8,000 మందికి పైగా ఇంజనీర్లతో సహా 16,000 మందికి పైగా సిబ్బంది, 1,000కి పైగా పేటెంట్లు – కీలకమైన ఇంజనీరింగ్ విభాగాలను సిస్కో కలిగి ఉందని తెలిపారు.

చెన్నైలోని తయారీ ప్లాంట్ ద్వారా 1 బిలియన్ డాలర్లకు పైగా ఎగుమతులు, దేశీయ అమ్మకాలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో 50 వేల మంది యువతను నెట్‌అకాడ్ యాక్సెస్, ఐటీ, ఇతర పరిశ్రమల్లో అత్యంత నైపుణ్యం గల శ్రామికశక్తిగా అభివృద్ధి చేయడానికి ఏపీ ప్రభుత్వంతో గత ఏడాది మార్చిలో ఒప్పందం చేసుకున్నామని, ఈ ప్రోగ్రామ్ ఇప్పటికే అమలులో ఉందని తెలిపారు. విశాఖపట్నంలో ఇన్నోవేషన్ సెంటర్, తిరుపతిలో సీఓఈ, విజయవాడ స్మార్ట్ సిటీ, ఏపీ ఫైబర్‌నెట్ (22,500 కి.మీ.) ప్రాజెక్టుల్లో తాము భాగస్వామ్యం వహించినట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

# ఏపీలో వైద్యపరికరాల తయారీ యూనిట్

**అబాట్ ఇండియా ఎండీకి లోకేష్ ఆహ్వానం**



న్యూఢిల్లీ: యుఎస్‌ఏకి చెందిన ప్రముఖ మెడికల్ డివైసెస్, డయాగ్నస్టిక్స్, న్యూట్రిషన్, ఫార్మాస్యూటిక్స్ తయారీ సంస్థ అబాట్ మేనేజింగ్ డైరక్టర్ ఇస్తేయాక్ అంజాద్‌తో మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏఎంటీజెడ్/ఈఎంసీలలో ఒకచోట వైద్యపరికరాలు/డయాగ్నోస్టిక్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. నక్కపల్లిలో రాబోయే బల్క్ డ్రగ్ పార్క్‌లో జనరిక్ మందుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ప్రతిపాదించారు. ఈ పార్క్‌లో అనుకూలమైన భూమి, ప్రపంచస్థాయి మౌలికసదుపాయాలు, వినియోగ సేవలు, ఇతర రాష్ట్రాలకు మించిన విధానపరమైన మద్దతు ఉంటాయని తెలిపారు. విశాఖపట్నంలో అబాట్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అబాట్ ఎండీ అంజాద్ మాట్లాడుతూ తమ సంస్థ భారత్ లో 400కు పైగా ఫార్మా బ్రాండ్లు, 12 వేలకు పైగా ఉద్యోగులను కలిగి ఉందని తెలిపారు. ప్రస్తుతం గోవా, బద్ది (హిమాచల్ ప్రదేశ్), ఝగాడియా (గుజరాత్)లలో తయారీ కేంద్రాలు, ముంబై, న్యూఢిల్లీలలో కార్యాలయాలు ఉన్నట్లు చెప్పారు. పోషకా హారం, ఫార్మా ఉత్పత్తుల కోసం స్థానిక పేరెన్నికగన్న తయారీ సంస్థల్లో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

# స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందించండి

**- ఆర్‌టీఐహెచ్‌లో సలహాదారు సభ్యులుగా చేరండి**

**- మాస్టర్ కార్డ్ వైస్ ప్రెసిడెంట్‌తో భేటీలో లోకేష్**



న్యూఢిల్లీ: ప్రముఖ గ్లోబల్ పేమెంట్స్, టెక్నాలజీ సంస్థ మాస్టర్ కార్డ్ ఇంక్ (యుఎస్‌ఏ) వైస్ ప్రెసిడెంట్, గవర్నమెంట్ ఎఫైర్స్ హెడ్ అభిషేక్ లాహిరితో మంత్రి నారా లోకేష్ గురువారం న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. విశాఖపట్నంలో భూమి లభ్యత, ఐటీ, జీసీసీ పాలసీ మద్దతుతో ఒక జీసీసీ/టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్టార్టప్‌లకు మార్గదర్శకత్వం వహించి వాటిని ప్రోత్సహించడానికి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఫిన్‌టెక్ సలహాదారు సభ్యునిగా చేరాలని ఆహ్వానించారు. ఫైనాన్స్, బ్యాంకింగ్, ఫిన్‌టెక్ రంగాల్లో సీఎస్‌ఆర్ ద్వారా నైపుణ్యా భివృద్ధి, పీ4 కార్యక్రమాల్లో భాగస్వామ్యం వహించాల్సిందిగా విన్నవించారు. మాస్టర్‌కార్డ్ తన ప్రైస్‌లెస్ ఎక్స్‌పీరియన్స్‌ను రాజమండ్రి, కోనసీమ ప్రాంతంలో అమలు చేసింది. పర్యాటకాన్ని ప్రోత్సహించే ఈ చొరవకు సహకరించిన తొలి రాష్ట్రాలలో ఆంధ్ర ప్రదేశ్ ఒకటి. ఆంధ్రప్రదేశ్‌లో మరిన్ని పర్యాటక, పర్యావరణ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సహకారం అందించాలని కోరా రు. మాస్టర్ కార్డు వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ లాహిరి మాట్లాడుతూ భారత్‌లో పూణే, గురుగ్రామ్, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, వడోదరలో కార్యాలయాల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మాస్టర్ కార్డ్ 2 వేల మంది ఉద్యోగులను కలిగి ఉందని తెలిపారు. 6 వేల మంది టెక్నాలజిస్టులతో ప్రపంచంలో అతిపెద్ద టెక్ హబ్ ను పూణేలో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్త "ప్రైస్‌లెస్" ప్లాట్‌ఫామ్ ద్వారా దిండి, తిరుపతి, సూర్యలంక, అరకు/వైజాగ్‌లను ప్రోత్సహించడానికి ఏపీ టూరిజం అథారిటీతో ఎంఓయు చేసుకున్నట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని తెలిపారు.

# కాకినాడలో గ్రీన్ అమ్మోనియా తయారీ కేంద్రం

**యారా పబ్లిక్ ఎఫైర్స్ హెడ్‌కు మంత్రి లోకేష్ ప్రతిపాదనలు**



న్యూఢిల్లీ: ప్రముఖ క్రాప్ న్యూట్రిషన్, ఫెర్టిలైజర్స్, అమ్మోనియా తయారీ సంస్థ యారా ఇంటర్నేషనల్ ఏఎస్‌ఏ–నార్వే పబ్లిక్ ఎఫైర్స్ అండ్ కమ్యూనికేషన్స్ హెడ్ వైశాలి చోప్రాతో గురువారం మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా మ్యానుఫ్యాక్చరింగ్, ఎక్స్‌పోర్ట్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ అవసరాలను తీర్చడానికి అక్కడ ఒక ప్రత్యేక ఎరువుల మిశ్రమం, సూక్ష్మపోషకాల ప్లాంట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని సూచించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో పంట–పోషణ సాంకేతికత, డిజిటల్ వ్యవసాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వైశాలి చోప్రా స్పందిస్తూ యారా ఇండియా (గురుగ్రామ్) పంట పోషణ, వ్యవసాయ శాస్త్రం, డిజిటల్ వ్యవసాయ రంగాల్లో సేవలందిస్తోంది. 17 రాష్ట్రాలలో 1,500 అవుట్‌లెట్‌ల ద్వారా 5.5 మిలియన్ల మంది రైతులకు డిజిటల్‌గా చేరువైందని తెలిపారు. యూపీలోని బాబ్రాలా కాంప్లెక్స్ ద్వారా 1.6 మిలియన్ టన్నుల యూరియా, 0.66 మిలియన్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. బయోలాజికల్ క్రాప్ సొల్యూషన్ కోసం కైరాన్ బయోప్రైమ్‌తో భాగస్వామ్యం వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని తెలిపారు.

# డిజిటల్ గవర్నెన్స్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయండి

***శాప్ వైస్ ప్రెసిడెంట్ చనానాతో మంత్రి లోకేష్ భేటీ***

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన ప్రముఖ ఎంటర్ ప్రైజ్ సాఫ్ట్‌వేర్, క్లౌడ్, బిజినెస్ ఏఐ అభివృద్ధి సంస్థ శాప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లవ్‌నీష్ చనానాతో గురువారం మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్ గవర్నెన్స్, ఎస్‌ఎంఈ డిజిటలైజేషన్, నైపుణ్యాభివృద్ధి కోసం శాప్ ఆధ్వర్యంలో డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు శాప్ నైపుణ్యాభివృద్ధి, సర్టిఫికేషన్ అందించడానికి ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్‌తో కలిసి పనిచేయాలని కోరారు. శాప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చనానా స్పందిస్తూ భారత్‌లో ఎంటర్‌ప్రైజెస్, ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, వివిధ ప్రభు త్వ విభాగాలకు తాము సాంకేతిక సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. శాప్ ల్యాబ్స్ ఇండియా ప్రపంచవ్యాప్తంగా రెండవ అతిపెద్ద ఆర్‌అండ్‌డీ హబ్ అభివృద్ధి చేస్తోందని, ఇది గ్లోబల్ ప్రొడక్ట్, బిజినెస్ ఏఐ విడుదలకు దోహదపడుతుందని తెలిపారు. బెంగళూ రులో కొత్తగా 15 వేల సీట్లతో ఆర్‌అండ్‌డీ, ఇన్నోవేషన్ క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.



### ఏపీని నేషనల్ స్పోర్ట్స్ హబ్‌గా
# మార్చేందుకు సహకరించండి

- వాటర్ స్పోర్ట్స్‌కు సహ ఆతిథ్య గమ్యస్థానంగా
- విశాఖపట్నంను మార్చేందుకు ప్రతిపాదించాలి
- దేశీయ టోర్నమెంట్లకు గమ్యస్థానంగా మారుస్తాం
- ఇండోర్ క్రికెట్ శిక్షణ అకాడమీలకు నిధులివ్వండి
- ఐసీసీ చైర్మన్ జైషాతో భేటీలో లోకేష్ ప్రతిపాదనలు



అహ్మదాబాద్ (గుజరాత్): ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చైర్మన్ జైషాతో మంత్రి నారా లోకేష్ అహ్మదాబాద్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. చైర్మన్‌గా అంతర్జాతీయ క్రికెట్‌ను విజయవంతంగా నడుపుతున్నందుకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు స్థానం కల్పించడం, రికార్డు స్థాయిలో ఐపీఎల్ మీడియా హక్కులు, మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)ను ప్రారంభించడం, మహిళా క్రికెటర్లకు సమాన వేతనం అందించడంలో జై షా సాధించిన విజయాలను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆధునిక మౌలిక సదుపాయాలు, క్రీడా సాంకేతికత, యువత నైపుణ్యా భివృద్ధిని అనుసంధానిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను నేషనల్ స్పోర్ట్స్ హబ్‌గా మార్చేందుకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఒలింపిక్ ఈవెంట్‌లకు ముఖ్యంగా వాటర్ స్పోర్ట్స్‌కు(సెయిలింగ్, రోయింగ్, విండ్ సర్ఫింగ్, ఓపెన్-వాటర్ స్విమ్మింగ్, బీచ్ వాలీబాల్) విశాఖపట్నాన్ని సహ-ఆతిథ్య గమ్యస్థానంగా మార్చేందుకు సహకరించాలని కోరారు. అమిత్ షా ప్రారంభించిన గాంధీనగర్ ప్రీమియర్ లీగ్ (జీపీఎల్) స్ఫూర్తితో యువత ప్రోత్సహించి క్షేత్రస్థాయిలో ప్రతిభను గుర్తించడానికి ఆంధ్రప్రదేశ్‌లో 175 నియోజక వర్గాల్లో అసెంబ్లీ ప్రీమియర్ లీగ్‌లను ప్రారంభించాలని యోచిస్తున్నామని తెలిపారు. ఇటీవల 128 స్థానిక జట్లను భాగస్వామ్యం చేస్తూ మంగళగిరి ప్రీమియర్ లీగ్ (ఎంపీఎల్) విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని ప్రస్తావించారు. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్), జాతీయ జట్టుకు మెరుగైన క్రీడాకారిణల కోసం మిథాలీరాజ్ బ్రాండ్ అంబాసిడర్‌గా మంగళగిరిలో ఇటీవల మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూ ఏపీఎల్) ప్రారంభించి తొలి టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. డబ్ల్యూపీఎల్ లీగ్‌లు, జాతీయ మహిళల క్రీడా శిబిరాలు, దేశీయ టోర్నమెంట్‌లను నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రత్యేక గమ్యస్థానంగా మార్చేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మౌలిక సదుపాయాలను ఆధునీకరించి క్రీడల్లో బాలికల చురుకైన భాగ స్వామ్యాన్ని ప్రోత్సహించడానికి విద్య, మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన 'షీ ప్లేస్' కార్యక్రమం వివరాలను ఈ సందర్భంగా వివరించారు. టైర్-2, టైర్-3 క్రీడాకారుల ప్రతిభను పెంపొందించడానికి రాష్ట్రవ్యాప్తంగా ఇండోర్ క్రికెట్ శిక్షణ అకాడమీలను నిర్మించడానికి బీసీసీఐ నుంచి సాంకేతిక మార్గదర్శకత్వం, నిధులను అందించాలని కోరారు.

# విశ్వతేజ క్రీడా ప్రస్థానం స్ఫూర్తిదాయకం

**- కువైట్ జాతీయ క్రికెట్ జట్టుకు ఎంపికైన తెలుగు యువకుడికి పల్లా అభినందనలు**

అమరావతి (చైతన్యరథం): కువైట్ జాతీయ క్రికెట్ జట్టుకు ఎంపికైన కడప జిల్లా యువ క్రికెటర్ నెట్టెం విశ్వ తేజకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హృదయ పూర్వక అభినందనలుతెలిపారు. తెలుగు యువకుడు కువైట్ జాతీయ జట్టులో స్థానం సంపాదించడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. చిన్ననాటి నుంచి క్రికెట్‌పై ఉన్న ఆసక్తిని క్రమశిక్షణ, పట్టుదలతో కొనసాగిస్తూ అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన విశ్వతేజ ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం.కువైట్ తరపున అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటూ తనప్రతిభను చాటుకుంటున్న విశ్వతేజ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి, క్రీడా రంగంలో తనకంటూ ప్రత్యేకగుర్తింపు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను. విశ్వ తేజను ప్రోత్సహించిన తల్లిదండ్రులు ఝాన్సీ నెట్టెం,



ప్రసాద్ నెట్టెం దంపతులకు కూడా పల్లా అభినందనలు తెలియజేశారు.

### భారీ వర్షాల నేపథ్యంలో..
# వరద నియంత్రణ చర్యలు చేపట్టాలి

- ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూ, తదనుగుణంగా నిర్ణయాలు
- ఇరిగేషన్ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఈమేరకు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాలు, వరద పరిస్థితులపై సమీక్షించారు.

వాతావరణ శాఖ నుంచి అందే ముందస్తు సమాచారాన్ని ఎప్పటికప్పుడు తీసుకుంటూ, దానికి అనుగుణంగా వరద నియంత్రణ చర్యలు చేపట్టాలని మంత్రి నిమ్మల సూచించారు. రిజర్వాయర్లు, నదులు, వాగుల్లోకి వచ్చే నీటి ప్రవాహాలను నిరంతరంఅంచనా వేస్తూ, పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మున్నేరు నదికి వచ్చే ఇన్‌ఫ్లో, బుడమేరు వరదపరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరానికి అనుగుణంగా పట్టిసీమ పంపులను ఆపరేట్ చేయాలని మంత్రి నిమ్మల సూచించారు. ఏలేరు రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ప్రాంతంలో నమోదయ్యే వర్షపాతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా పురుషోత్తపట్నం పంపులను ఆపరేట్ చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వంశధార, నాగావళి, బహుదా, మహేంద్రతనయ నదుల ప్రవాహాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మంత్రి తెలిపారు. ఆయా నదుల పరివాహక ప్రాంతాల్లో వరద పరిస్థితులపై ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని సూచించారు.

ఇరిగేషన్ అధికారులు నిరంతరం వార్ రూమ్‌లో పరిస్థితిని పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయి సిబ్బందికి అవసరమైన సూచనలు వెంటనే అందించాలని మంత్రి ఆదేశించారు. ఉన్నతాధికారులు సైతం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు.

ఈ టెలికాన్ఫరెన్స్‌లో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, కడా కమిషనర్ ప్రశాంతి, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి పట్టిన చీడపురుగు జగన్ రెడ్డి

- బందరుకి పట్టిన శని గ్రహం పేర్ని నాని
- ఐదేళ్లు అధికారంలో ఉండి మున్సిపాలిటీకి రూపాయి ఖర్చు చేయలేదు
- యుద్ధ ప్రాతిపదికన పూర్తవుతున్న బందరు పోర్టుపైనా కుట్రలు
- గంజాయి బ్యాచ్, వీధి రౌడీలతో రాష్ట్రాన్ని నాశనానికి జగన్ కుట్ర
- అరాచక శక్తులను తరిమికొడదామని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు

మచిలీపట్నం (చైతన్యరథం): రాష్ట్ర అభివృద్ధి కంటే.. అరాచకం సృష్టించడమే ముఖ్యం అనేలా జగన్ రెడ్డి వ్యవహరిస్తున్నాడని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నం ఆర్ అండ్ బీ కార్యాలయంలో మీడియాతో గురువారం మంత్రి మాట్లాడుతూ మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలపై జగన్‌రెడ్డి అండ్ కో ఏకంగా 350కి పైగా కేసులు వేశారన్నారు. అయినప్పటికీ కేసులన్నింటినీ పరిష్కరించి.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 16 వేల ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశాం. ఏడాదికి పైగా వారు ఉద్యోగాలు చేసుకున్నారు. మొదట పేపర్ లీకయిందని, మాస్ కాపీయింగ్ జరిగిందని ఆరోపణలు చేశారు. తర్వాత స్పోర్ట్స్ కోటాలో ఏదో జరిగిపోయిందని ఆరోపిస్తున్నారు. కానీ ఆధారాలు చూపమంటే మాత్రం పారిపోతున్నారు.ఇప్పుడు ఏకంగా శాప్ కార్యాలయంలో ఉపాధ్యాయులపై రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్‌తో దాడులకు ప్రయత్నించారని ధ్వజమెత్తారు.

కృష్ణా జిల్లా అంటే రాజకీయంగా ఎంతో గొప్ప పేరు ఉంది. కానీ కృష్ణా జిల్లాలోని వైసీపీ నాయకులకు కనీస ఇంగితం కూడా లేకుండాపోయింది. రాజకీయాలు కృష్ణా జిల్లాకు కొత్తేమీ కాదు. కానీ.. వైసీపీ లాంటి నీచ రాజకీయాలు ఎవరూ చేయలేదు. బందరు అభివృద్ధిని అడ్డుకున్న వ్యక్తి దుర్మార్గుడు పేర్ని నాని. బందరు చరిత్రను నాశనం చేశాడు. ఐదేళ్లు మంత్రిగా ఉండి డ్రైనేజీలకు రూపాయి కూడా ఖర్చు చేయలేదు. గతంలో బందరు పోర్టు కోసం ఉద్యమాలు చేస్తున్న మమ్మల్ని కృత్రిమ ఉద్యమాలు అంటూ అవమానించాడు. ఉద్యమాలు చేసి ప్రభుత్వాలనే తలవంచేలా చేసి పోర్టు సాధించుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో గాలికి వదిలేశారు. పోర్టు పూర్తి చేయకుంటే ముక్కు నేలకు రాస్తానన్న పేర్ని నాని తర్వాత సిగ్గు లేకుండా తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు.

సాధారణ వ్యక్తులు కూడా పేర్ని నాని అరాచకాలను నిలదీస్తున్నారు. ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్నాడు. బ్యాంకుల్ని ముంచేసి,



ఎవరైనా ప్రశ్నిస్తే రాద్ధాంతం చేస్తున్నాడు. వైసీపీ ఐదేళ్ల పాలనలో బందరు పోర్టును గాలికి వదిలేశారు. ఎన్నికల ముందు డ్రామాలాడాడు. ప్రజలిచ్చిన తీర్పుతో మేము పోర్టు పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నాం. పరిశ్రమలు తీసుకొస్తున్నాం. అలాంటి అభివృద్ధిపై కూడా ఏదో జరిగిపోతోందంటూ రాద్ధాంతం చేస్తున్నాడు. ఇలాంటి వ్యక్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజల్లో అలజడులు సృష్టించాలని ప్రయత్నిస్తే ఉపేక్షించేది లేదు. రైతులకు ఎలాంటి నష్టం లేకుండా.. భూములు సేకరిస్తాం. గతంలోనే ఎకరాకు రూ.25లక్షల చొప్పున రూ.200కోట్లు చెల్లించాం. గత రెండు సంవత్సరాల్లో మచిలీపట్నం మున్సిపాలిటీలో రూ.300కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేస్తున్నాం. రోడ్లు, తాగునీటి ప్రాజెక్టులు, డ్రైనేజీలు, పార్కులు, శ్మశానవాటికలు అన్నింటినీ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నాం. విజన్ డాక్యుమెంట్ తయారుచేసి.. రాబోయే 25 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకుని అడుగులు వేస్తున్నామని మంత్రి తెలిపారు.

రోడ్లెక్కి బూతులు మాట్లాడడం, కులాలు మతాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యవహరించడం తప్ప జగన్ రెడ్డికి ఏదీ సాధ్యం కాదు. అభివృద్ధిని అడ్డుకోవాలనుకోవడం సిగ్గుచేటు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి, బందరులో పేర్ని నాని అరాచకాలకు పాల్పడుతున్నారు. గంజాయి బ్యాచ్‌తో అరాచకాలు చేస్తున్నారు. దాడులు చేయిస్తున్నారు. ఇలాంటి వ్యక్తులను ప్రజలు తరిమి కొట్టాలి. మన బందరు అభివృద్ధిలో అందరం భాగస్వాములవుదాం. అభివృద్ధి ఫలాలను అందరం అనుభవిద్దాం. పేర్ని నాని లాంటి దుర్మార్గుల వ్యాఖ్యలు నమ్మి కూర్చొన్న కొమ్మను నరుక్కునే ప్రయత్నం చేయొద్దు. బందరుకి పరిశ్రమలు తీసుకొస్తాం. పెట్టుబడులు ఏర్పాటు చేస్తాం. ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు పెంచడమే మా లక్ష్యం. మన బందరు చరిత్రని పునరుద్ధరించడమే కూటమి నాయకుల లక్ష్యమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# అప్రమత్తంగా ఉండాలి

- అధికారులకు, ప్రజలకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సూచన
- ముంపు ప్రాంతాల్లో విస్తృత పర్యటన
- ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకున్న పల్లా
- ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యల్లో పాల్గొనాలని టీడీపీ శ్రేణులకు పిలుపు





విశాఖపట్నం/గాజువాక (చైతన్యరథం): భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు,గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచించారు. వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గురువారం పెద్ద గంట్యాడ, గంగవరం, హరిజన జగ్గయ్యపాలెం, నీలపువీధి, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ముంపు, లోతట్టు ప్రాంతాల్లో పల్లా విస్తృతంగా పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలతో మమేకమై వర్షాల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పొంగిపొర్లుతున్న డ్రైనేజీలను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, కాలువలు, నీటి ప్రవాహాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పల్లా కోరారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జీవీఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

అలాగే టీడీపీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుని సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొనాలని పల్లా పిలుపునిచ్చారు. వర్షాలు తగ్గే వరకు ముంపు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# టీచర్లకు అండ కూటమి ప్రభుత్వం

- రౌడీషీటర్లకు అండ జగన్
- లిక్కర్ స్కామ్ డైవర్షన్ కోసమే డీఎస్సీపై నిందలు
- డీఎస్సీపై లోకేష్ వివరణ ఇచ్చారు... లిక్కర్ స్కామ్‌పై జగన్ ఎందుకు నోరు విప్పడం లేదు?




తొడగొట్టి రెచ్చగొడుతున్న వైసీపీ కార్యకర్త, పక్కన టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో నిందితుడు పానుగంటి చైతన్య

వైసీపీ కార్యకర్తల మధ్య నుంచి కేకలు వేస్తుతున్న రౌడ్జీషీటర్ సందీప్



- విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పెంచుతున్న లోకేష్... యువతను డ్రగ్స్, గంజాయిలకు బానిస చేస్తున్న జగన్.
- పెట్టుబడుల ఆకర్షణ యజ్ఞం చేస్తున్న లోకేష్-పెట్టుబడులను తరిమేసిన జగన్.
- తొలి ఏడాదే డీఎస్సీ ద్వారా 16వేల ఉపాధ్యాయ నియామకం చేసిన లోకేష్... ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని జగన్.
- ధర్నా చౌక్‌లో ధర్నాలు చేయాలే గానీ ప్రభుత్వ సంస్థ (శాప్)పై దాడి చేయడం ఉగ్రవాద చర్య కాదా?
- సరైన ఆధారాలుంటే హైకోర్టు లేదా సుప్రీంకోర్టుకు వెళ్ళాలి గానీ రోడ్లపై అరాచకం చేయడం నేర రాజకీయం కాదా?
- రూ.3500 కోట్ల లిక్కర్ కుంభకోణంపై 'సిట' చార్జ్‌షీట్, ఈడీ విచారణపై నోరు విప్పకుండా జగన్ ఎందుకు తప్పించుంటున్నారు?
- తన క్రిమినల్ లక్షణాల్ని ఎదుటివారికి అంటగట్టి చెప్పిన అబద్దమే వందసార్లు చెప్పడం జగన్ నైజం.
- వాస్తవానికి స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన 372 మందిలో 252మందికి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలోనే క్రీడా సర్టిఫికెట్లు వచ్చాయి. మరి ఆ సర్టిఫికెట్లన్నీ ఫేక్ అని జగన్‌రెడ్డి ఒప్పుకుంటారా?
- గత ప్రభుత్వంలో ఆర్కే రోజా క్రీడా శాఖ మంత్రిగా, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి శాప్ చైర్మన్‌గా ఉన్నప్పుడు సాఫ్ట్‌బాల్ నేషనల్స్‌కు ఎంపికయ్యారని 25మందికి రూ.3లక్షల చొప్పున నగదు ప్రోత్సాహకాలు ఇచ్చారు. వారిలో ఇప్పుడు 15 మందికి ఉద్యోగాలు వస్తే మీరిచ్చిన ఆ ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు కూడా నకిలివేనా?
- 14 డీఎస్సీలు నిర్వహించి 2 లక్షల ఉపాధ్యాయ నియామకాలు చేసిన చంద్రన్న పాలన.
- రెండేళ్లలోనే రూ.26 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి 20 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించింది కూటమి ప్రభుత్వం.
- మెగా డీఎస్సీ, జనవరిలో జాబ్ క్యాలెండర్ హామీపై మాట తప్పి జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చిన జగన్.

**గొడ్డలి పార్టీ... క్రిమినల్ ఫ్యాక్టరీ:**

- క్రిమినల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటేనే ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ ఉంటుంది.
- నేరం చేయించడం, దాన్ని ఎదుటి వారికి అంటగట్టడం జగన్ నైజం.
- అందులో భాగంగానే 'శాప' కార్యాలయంపై రౌడీషీటర్లు, గంజాయి, సైకో గుంపులతో దాడి చేయించాడు.
- దాడి చేసిన వారితో అర్ధరాత్రి వేళ ప్యాలెస్‌లో మంతనాలు జరిపిన జగన్.
- అక్రమ కేసులంటూ గవర్నర్‌ను కలిసి రౌడీషీటర్లను కాపాడే జగన్నాటకం ఆడారు.
- ఎత్తుకుని పెంచిన చిన్నాన్నను చంపించి గుండెపోటుగా చిత్రీకరించే కుట్ర చేశారు.
- గుండెపోటు కాదు గొడ్డలి వేటు అని తేటతెల్లం కాగానే 'నారాసుర రక్త చరిత్ర'ను చంద్రబాబుకు అంటగట్టే కుట్ర చేశారు.
- కోడికత్తి కుట్ర చేశారు... గులకరాయి డ్రామాలాడారు.
- ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చి ప్రజల ఆస్తుల కబ్జాకు కుట్ర చేశారు.
- నాడు ప్రశ్నించిన పౌరులు, ప్రతిపక్షాలు, పత్రికలపై టెర్రరిస్టుల్లా కేసులు పెట్టి జైలపాలు చేసిన జగన్.
- నేడు ప్రభుత్వ కార్యాలయాలపైన, ఉపాధ్యాయులపైన దాడి చేసిన రౌడీషీటర్లకు రక్షణగా గవర్నర్ వద్దకెళ్ళారు.

**లిక్కర్ స్కామ్ డైవర్షన్ కోసమే డీఎస్సీపై నిందలు**

- లిక్కర్ కుంభకోణంలో రూ.3,500కోట్లలో సింహ భాగం తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయని సత్యప్రసాద్ ఏసీబీ కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు.
- లిక్కర్ స్కామ్‌పై హైకోర్టు ఆధ్వర్యంలో వేసిన 'సిట' చార్జిషీట్ కోర్టుకు సమర్పించింది. ఈడీ దాడులు వైఎస్ అనిల్ రెడ్డి ఇంటిపై జరిగాయి.
- ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలో 97శాతం మార్కులు తారుమారు చేశారని 'సిట' నిర్ధారించింది.
- జగన్ పాలనలో విషపూరిత మద్యంతో 30వేల మంది పేదల ప్రాణాలు పోయాయి-లక్షలాది మంది ఆరోగ్యాలు గుల్లయ్యాయి.
- ఈ నేరాలు, ఘోరాలు డైవర్షన్ కోసమే డీఎస్సీపై నిరాధార నిందలు వేస్తున్నారు.
- డీఎస్సీపై ఆరోపణలకు లోకేష్ పాయింట్ టు పాయింట్ వివరణ ఇచ్చారు. అసెంబ్లీకి వచ్చి చర్చించమని ఆహ్వానించారు. అయినా జగన్ తప్పించుకుని బెంగళూరు ప్యాలెస్కు వెళ్లిపోయాడు.
- తన ఆరోపణల్లో సత్తా ఉంటే లోకేష్ సవాల్ ఎందుకు స్వీకరించట్లేదు?
- డీఎస్సీపై లోకేష్ వివరణ ఇచ్చిన విధంగానే లిక్కర్ స్కాంపై జగన్ ఎందుకు వివరణ ఇవ్వడం లేదు. ఎందుకు తప్పించుకుంటున్నాడు.
- లిక్కర్ కుంభకోణం నిజం కాబట్టే దాని డైవర్షన్ కోసమే డీఎస్సీపై నిందలు వేస్తున్నారు.
- జగన్ కుట్రలను, అబద్ధాలను ప్రతి పౌరుడూ తిప్పికొట్టాలి.
- పెట్టుబడుల ఆకర్షణకు తోడ్పడి 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కూటమి ప్రభుత్వానికి తోడ్పడాలి.



**- గురజాల మాల్యాద్రి,**
**చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్**

# గూండాయిజంపై ఉక్కుపాదం

- యువతకు ఉద్యోగాలు కూటమి నైజం.. రౌడీయిజం జగన్ నైజం
- రోడ్లపైకి వచ్చి అల్లర్లు చేస్తామంటే సహించేది లేదు
- టీచర్లపై దాడిచేసినవారిలో రౌడీషీటర్లు, క్రిమినల్ కేసుల్లో నిందితులు.. ఏ ఒక్కరినీ వదిలేది లేదు
- రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టీకరణ




అమరావతి (చైతన్యరథం): యువతకు ఉద్యోగాలు కూటమి నైజం.. రౌడీయిజం జగన్ నైజమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన విధ్వంసం, అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ వరకు కొనసాగి వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించినవిలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రాత్మక విజయాన్ని అందించి అధికారం అప్పగించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. చట్టబద్ధ పాలనతో రాష్ట్రంలో క్రైమ్‌రేటును 14శాతం తగ్గించామని, శాంతిభద్రతలు అదుపులో ఉండటం వల్లే వేల కోట్ల రూపాయల పెట్టుబడులు,లక్షల ఉద్యోగాలు రాష్ట్రానికి తరలివస్తున్నాయని స్పష్టం చేశారు.

యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మంత్రి నారా లోకేష్ అన్ని న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి 16,000 మందికి పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలను అత్యంత పారదర్శకంగా భర్తీ చేశారని హోం మంత్రి కొనియాడారు. రిక్రూట్‌మెంట్ విధానంపై లోకేష్ స్వయంగా అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి వివరాలు వెల్లడించడమే కాకుండా బహిరంగ చర్చకు రావాలని మూడుసార్లు సవాల్ విసిరినా జగన్‌కు అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేకపోయిందన్నారు. కడపలో స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన 350 మందికి పైగా క్రీడాకారులు తమ సర్టిఫికెట్లు, టెట్ అర్హత పత్రాలతో విజయవాడలోని శాప్ కార్యాలయానికి వచ్చి రక్షణ కోరితే, తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లో 50-60 కార్లలో వచ్చిన వైసీపీ రౌడీ మూకలు వారిపై రాళ్లు, గాజు సీసాలు, ఇనుప రాడ్లతో పాశవిక దాడికి దిగడం దుర్మార్గమన్నారు.

శాప్ కార్యాలయం వద్ద నిరసనల పేరుతో వీరంగం సృష్టించిన వారిలో 60 నుంచి 70 శాతం మంది నేరచరిత్ర కలిగిన రౌడీషీటర్లు, పోక్సో కేసులు, హత్యాయత్నం కేసులు, బ్లేడ్ బ్యాచ్‌లతో సంబంధాలు ఉన్నవారేనని ఫోటోలు, కేసుల వివరాలతో సహా హోం మంత్రి మీడియా ముందు బట్టబయలు చేశారు. మాజీ ఎమ్మెల్యేలపై 37 క్రిమినల్ కేసులు ఉన్నాయని, టీడీపీ కేంద్ర కార్యాలయంపై గతంలో దాడి చేసిన వైసీపీ విద్యార్థి విభాగం నేత చైతన్యపై 22 కేసులు, కంచికచర్లకు చెందిన రౌడీషీటర్ సురేష్ బాబుపై మర్డర్ కేసులు, మరికొందరిపై 13-14 కేసులు, తీవ్రమైన పోక్సో కేసులు ఉన్నాయని ఆధారాలు ప్రదర్శించారు. ఇటువంటి నేరగాళ్లను 'జెన్‌జీ' యువత అంటూ అమాయక విద్యార్థులుగా చిత్రీకరిస్తూ, 'వి స్టాండ్ విత్ రాజ్ పాల్' అంటూ పోస్టర్లు వేసుకుని గవర్నర్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేయడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. చదువుకునే యువతను రాజకీయ స్వార్థానికి రౌడీలుగా మార్చే కుట్రలను తల్లిదండ్రులు గమనించి తమ పిల్లలను అప్రమత్తం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష పత్రాల మూల్యాంకనాన్ని ప్లంబర్లు, కార్మికులతో చేయించిన అక్రమాలపై గానీ, లిక్కర్ కుంభకోణంలో వేల కోట్ల రూపాయలు తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయంటూ వెలువడిన అపూర్వర్ల వాంగ్మూలాలపై గానీ జగన్ ఎందుకు నోరు మెదపరని అనిత నిలదీశారు. ఆ అవినీతి పాపాలు బయటపడటంతో ప్రజల దృష్టిని మళ్లించేందుకే డీఎస్సీపై తప్పుడు కూతలు కూస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టి అవమానించిన చరిత్ర జగన్‌దని, కూటమి ప్రభుత్వం బడిని గుడిగా, గురువులను దైవంగా భావిస్తూ గౌరవిస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులపై దాడికి తెగబడిన రౌడీషీటర్లు, సంఘ విద్రోహ శక్తుల వికృత చేష్టలన్నీ సీసీటీవీ ఫుటేజీల్లో రికార్డయ్యాయని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని, రౌడీయిజంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర హెచ్చరికలు చేశారు.

## మత్స్యకారులు క్షేమంగా తిరిగివచ్చే వరకు నిరంతర పర్యవేక్షణ

- గోపాల్‌పూర్ పోర్టులోకి రాష్ట్రానికి చెందిన 51 యాంత్రిక పడవలకు అనుమతి
- అరయపల్లి ఫిష్‌ల్యాండింగ్ సెంటర్‌కు సురక్షితంగా చేరిన 16 పడవలు
- ఒడిశా అధికారులతో సమన్వయం చేసుకుంటూ రక్షణ చర్యలు
- పడవల యజమానులతో నిత్యం సంప్రదింపులు జరపాలని అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం



అమరావతి (చైతన్యరథం): బంగాళాఖాతంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన మత్స్యకారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఒడిశా మత్స్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ చేపల వేట పడవలకు ఆశ్రయం కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పరిస్థితులు అనుకూలించి, మత్స్యకారులు తమ ప్రాంతాలకు క్షేమంగా తిరిగివచ్చే వరకు తీరప్రాంత జిల్లాల మత్స్యశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఒడిశా అధికారుల నుంచి అందిన సమాచారం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 51 యాంత్రిక పడవలను గోపాల్‌పూర్ పోర్టులోకి అనుమతించినట్లు మంత్రి వివరించారు. వీటిలో ఇంజిన్ పనిచేయకుండా నిలిచిపోయిన ఒక పడవను లాగి తీసుకువచ్చి, పోర్టులో సురక్షితంగా లంగరు వేసినట్లు తెలిపారు. అరయపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు మరో 16 పడవలు క్షేమంగా చేరుకున్నాయని పేర్కొన్నారు. పడవలను గోపాల్‌పూర్ పోర్టులోకి అనుమతించేందుకు ఒడిశా మత్స్యశాఖ అక్కడి కలెక్టర్, పోర్టు అధికారులకు సమాచారం అందించి సమన్వయం చేసిందని వివరించారు. మత్స్యశాఖ కమిషనర్, అధికారులు నివేదించిన రెండు పడవలతోపాటు వాటిలోని సిబ్బంది కూడా గోపాల్‌పూర్‌లో సురక్షితంగా ఉన్నారని మంత్రి తెలిపారు. సంబంధిత కుటుంబాలను సంప్రదించి ఈ సమాచారాన్ని తెలియజేసినట్లు పేర్కొన్నారు. మత్స్యకారుల క్షేమ సమాచారాన్ని కుటుంబాలకు ఎప్పటికప్పుడు చేరవేసి, వారికి భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. పడవల యజమానులతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరపాలి. ప్రతి పడవ పరిస్థితిని తెలుసుకుంటూ అవసరమైన సహాయానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలి. సముద్రంలో ప్రతికూల పరిస్థితులు తొలగిన తర్వాతే ఆయా పడవలు తమకు సంబంధించిన ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లకు క్షేమంగా చేరుకునేలా పర్యవేక్షించాలని మంత్రి స్పష్టం చేశారు. మత్స్యకారుల ప్రాణ రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. తీరప్రాంత జిల్లాల అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ, క్షేత్రస్థాయి సమాచారానికి అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



## బందరులో గోవాషిప్ యార్డ్ అభివృద్ధికి శుభసూచకం



- దేశంలో గోవా వెలుపల ఏర్పాటవుతున్న రెండో కేంద్రం ఇదే
- స్థానిక యువత, మహిళల ఉద్యోగ ఉపాధికి ప్రభుత్వం తోడ్పాటు
- రెండేళ్లలోనే గోవా షిప్ యార్డు పూర్తి చేస్తామన్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం (చైతన్యరథం): మచిలీపట్నం సిగలో మరో మణిహారం గోవా షిప్ యార్డు అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బందరులో గోవా షిప్ యార్డు సంస్థ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోనే నౌకల నిర్మాణం, యుద్ధ నౌకల నిర్మాణంలో దశాబ్దాల నైపుణ్యం ఉన్న గోవా షిప్ యార్డు కంపెనీ ఏపీలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం, దానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదించడం ఆనందంగా ఉందన్నారు. దేశంలో గోవా వెలుపల ఏర్పాటవుతున్న రెండో కేంద్రం ఇదే. దాదాపు రూ.8000 కోట్ల పెట్టుబడితో 400 ఎకరాల్లో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. యుద్ధ నౌకల నిర్మాణంతో దేశ రక్షణరంగంలో మచిలీపట్నం పేరు కూడా శాశ్వతంగా నిలిచిపోబోతోందన్నారు.

గోవా షిప్ యార్డునిర్మాణంతో దాదాపు 10వేలకు పైగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ నేపథ్యంలో ఇప్పటి నుండే స్థానిక యువతకు మహిళ లకు నైపుణ్య శిక్షణఇచ్చి ఉపాధి పొందేలా ప్రణాళికలు రచిస్తాం. ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో.. ప్రభుత్వం నుండి అన్ని రకాల అనుమతులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. బందరు పోర్టు, హార్బర్ ఇప్పటికే వేగవంతంగా పూర్తవుతున్నాయి. ఈ నేపథ్యంలో గోవా షిప్ యార్డు సంస్థ ఏర్పాటుకు ఆమోదం తెలపడం అంటే.. భవిష్యత్తులో రాబోయే పెట్టుబడులకు తొలిమెట్టుగా భావిస్తున్నామన్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మచిలీపట్నంలో ఇంత పెద్ద పెట్టుబడి ఎప్పుడూ రాలేదు. గతంలో భారత్ సాల్ట్ కూడా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటైంది. ఇప్పుడు షిప్ యార్డు వచ్చింది. ఎప్పుడో 1864లో చివరిసారిగా ఈ ప్రాంతానికి నౌక వచ్చింది. 164 సంవత్సరాల తర్వాత బందరు పోర్టుకు నౌక రాబోతోంది. ఈ మహోన్నత కార్యక్రమంలో స్థానిక యువతను, మహిళలను భాగస్వాముల్ని చేసి వారిని ఆర్థికంగా చేయూత అందించేలా కృషి చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణతో పాటు
# పోలీసుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

- **పోలీసు ట్రైనింగ్ స్టైపండ్ రూ. 4,500 నుంచి రూ. 12,500 కి పెంచిన ఘనత సీఎం చంద్రబాబుదే**
- **ప్రజల రక్షణ, మహిళల భద్రతలో రాజీపడే ప్రసక్తే లేదు**
- **మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**
- **ఒంగోలులో మహిళా కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి**



ఒంగోలు (చైతన్యరథం): పోలీసులు నీతి, నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డా.శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. గురువారం ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలు పోలీస్ శిక్షణా కాలేజీలో మహిళా కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పెరేడ్ కార్యక్రమములో మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నెలల కఠోర శిక్షణ అనంతరం ప్రత్యక్ష విధులలో చేరుతున్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు పోలీసుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పోలీసు ట్రైనింగ్ స్టైపండ్ రూ. 4,500 నుంచి రూ. 12,500 కి పెంచిన ఘనత సీఎం చంద్రబాబుదేనని మంత్రి తెలిపారు. పోలీస్ యూనిఫారం వేసుకొని న్యాయం, ధర్మం, చట్టాన్ని కాపాడుతూ ప్రజలకు న్యాయం చేయాలన్నారు. రానున్న రోజులలో వస్తున్న సైబర్ క్రైం వంటి విభిన్న పోకడలపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణ అనంతరం విధులలో ప్రత్యక్షంగా చేరుతున్న పోలీసులు శాఖకు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని అన్నారు. అంతా తెలుసు అనే ధోరణి వీడి అవసరమైనప్పుడు సీనియర్ల సలాహాలు, సూచనలు తీసుకోలన్నారు. పోలీస్ యూని ఫారం చూడగానే సమాజం గౌరవించేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. యూనిఫారం ఇచ్చిన పవర్ ని గౌరవంగా చూసుకోవాలన్నారు. ప్రజల రక్షణ, మహిళల భద్రతలో కూటమి ప్రభుత్వం రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపల్ రాధిక పాల్గొన్నారు.

# నకిలీ పత్రాలతో భూమి కబ్జా

- **ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు.. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి**
- **రోడ్డు విస్తరణ పరిహారం గోల్‌మాల్.. అధికారులతో కుమ్మక్కై సొమ్ము స్వాహా**
- **తాతల కాలం నాటి భూమి నిషేధిత జాబితాలోకి.. న్యాయం చేయాలి**
- **టీడీపీ కేంద్ర కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు**
- **అర్జీలు స్వీకరించిన మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు, నాగవంశం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ఎరుబోతు రమణారావు**



అమరావతి (చైతన్యరథం): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి సమస్యలు విన్నవించుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు, ఏపీ నాగవంశం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ఎరుబోతు రమణారావు అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగోట్ల గ్రామానికి చెందిన కె. అబ్దుల్ మునాఫ్ అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం. 146-సి1, పట్టా నెం. 1022లో తనకు 2 ఎకరాల 14 సెంట్ల వ్యవసాయ భూమి ఉందన్నారు. అయితే కొందరు అక్రమార్కులు నకిలీ పత్రాలు సృష్టించి చట్టవిరుద్ధంగా ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనిపై గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, జిల్లా రిజిస్ట్రార్ సమగ్ర విచారణ జరిపి ప్రాసిక్యూషన్ ఆర్డర్ ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా పోలీసులు నిందితులపై క్రిమినల్ కేసులు..ఎఫ్.ఐ.ఆర్ నెం. 26/2025 నమోదు చేశారు. అనంతరం పోలీసులు కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా, ఎమ్మిగనూరు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ కొనసాగుతోంది. కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ అక్రమార్కులు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. ప్రస్తుతం ఆ భూమిలో తాను సాగు చేసిన మిరప పంటను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కె. మహమ్మద్ రసూల్, కె. ఇబ్రాహీం, కె. తహెరా బీ, బుడగజంగం ధూపం రంగన్న, ధూపం యోగి, ధూపం చందు, ధూపం మహాలింగమ్మ, మంచోడు పాలరాజు, వేమూరి వెంకటేశ్వర్లు, కల్లూరి శివకుమార్, ధూపం గడ్డం ఉపేంద్ర, ధూపం మద్దిలేటి, తదితరులు తనపై దాడికి పాల్పడుతూ, భూమి వదిలి వెళ్లకపోతే చంపేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. అంతేకాకుండా అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

అన్నమయ్య జిల్లా రామాపురం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగేంద్రనాయక్ విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలోని సర్వే నెం. 144 ప్రభుత్వ భూమిని సూరం దుగ్గిరెడ్డి అనే వ్యక్తి ఆక్రమించి పశువుల పాక నిర్మించారని ఫిర్యాదు చేశారు. ఇతరులు ఎవరూ రాకుండా దారికి అడ్డంగా ప్రహరీ గోడ కట్టారని, దీనివల్ల రాకపోకలకు ఆటంకంతో పాటు తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 144 అనేది పూర్తిగా ప్రభుత్వ భూమిగా నమోదై ఉంది. ఇందులో మొత్తం 19.14 ఎకరాల విస్తీర్ణం ఉండగా, వెబ్‌ల్యాండ్‌లో సర్వే నెం. 144-1 కింద 12.60 ఎకరాలుగా నమోదై ఉంది. ఈ భూమిని ప్రభుత్వం ఎవరికీ అసైన్‌మెంట్ చేయలేదు. ప్రభుత్వానికి చెందిన ఈ స్థలంలో సూరం దుగ్గిరెడ్డి అనే వ్యక్తి సుమారు 30 సెంట్ల మేర ఆక్రమించి పశువుల పాక నిర్మించడంతో పాటు, దారికి అడ్డంగా గోడ నిర్మించారు. దీనిపై ప్రశ్నించినందుకు తమపై దౌర్జన్యం చేస్తున్నాడు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

గుంటూరుకు చెందిన లక్ష్మీ పరంజ్యోతి విజ్ఞప్తి చేస్తూ..బాపట్ల 12వ వార్డు అక్కర్‌పేటలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తమ తల్లి దివంగత మాణిక్యమ్మ పేరు మీద ఉన్న పట్టా ఇంటిని (పట్టా నెం: 978/1399, ప్లాట్ నెం: 583/1) 2020లో అధికారులు నేలమట్టం చేశారు. దీనికి పరిహారంగా బాపట్ల మున్సిపాలిటీ, తహశీల్దార్ కార్యాలయం ద్వారా రూ.11,21,739ల చెక్కుతో పాటు 6 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఈ విషయాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా తాను తెలుసుకున్నాను. అయితే, తన సంతకాన్ని ఫోర్జరీ చేసి తానే స్వయంగా ప్రాతినిధ్య లేఖ ఇచ్చినట్లుగా నకిలీ పత్రాలు సృష్టించి మొత్తం పరిహార సొమ్మును, స్థలాన్ని తన వదిన, చెల్లెలు దక్కించుకున్నారు. పెద్ద కుమార్తెగా కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ ప్రకారం తనకు చట్టపరంగా రావాల్సిన వాటాను పూర్తిగా తొక్కిపెట్టారు. న్యాయం కోసం పీజీఆర్ఎస్ ద్వారా ఇప్పటివరకు ఏడుసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ అధికారులు ఆన్‌లైన్‌లో 'పరిష్కరించబడింది' అని చూపిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. గతంలో హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌ను సైతం ఉపసంహరించుకుని, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రంతో సహా అన్ని ఆధారాలు సమర్పించినా బాపట్ల మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. తగు చర్యలు తీసుకుని తనకు రావాల్సిన పరిహార సొమ్ము, ఇంటి స్థలాన్ని ఇప్పించి ఆదుకోవాలని కోరారు.

నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం వీరారెడ్డిపల్లె గ్రామానికి చెందిన తుమ్మూరు కోటిరెడ్డి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెం. 481/1 లో తమ కుటుంబానికి చెందిన 5.10 ఎకరాల భూమి పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో చేరిందని తెలిపారు. సర్వే నెం. 481 లోని మొత్తం 11.64 ఎకరాల భూమి ప్రభుత్వ పోరంబోకుగా నమోదై ఉంది. సదరు సర్వే నెంబర్ విభజన తర్వాత సర్వే నెం. 481/1 లోని 5.10 ఎకరాల విస్తీర్ణం "ఆయకట్టు బంజరు" గా నమోదై ఉంది. ఈ 5.10 ఎకరాల స్థలానికి సంబంధించి 1961 నుంచే చట్టబద్ధమైన లావాదేవీలు ఉన్నట్లు మాన్యువల్ ఈసీల ద్వారా స్పష్టమైంది. 1961 మే 23న సేల్ డీడ్, అలాగే 1961 జూలై 01న రిజిస్టర్డ్ భాగ పరిష్కార పత్రం జరిగిన ఆధారాలు రికార్డుల్లో లభ్యమయ్యాయి. తగు చర్యలు తీసుకుని తమ భూమిని నిషేధిత జాబితాలో నుంచి తొలగించి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని కోరాడు.

కర్నూలు జిల్లా ఆలూరుకు చెందిన ప్రభాకర్ విజ్ఞప్తి చేస్తూ.. గత 20 సంవత్సరాల క్రితం ఇందిరా నగర్‌లో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని నిర్మించారని తెలిపారు. నాటి నుంచి తానే అర్చకుడిగా ఉంటూ స్వామివారికి నిత్య పూజలు నిర్వహిస్తున్నాను. ఎలాంటి స్థిర ఆదాయం లేకపోయినా ఇన్నాళ్లూ స్వంత ఖర్చులతోనే పూజా కార్యక్రమాలు, దీపధూప నైవేద్యాలు కొనసాగిస్తున్నాను. ఆలయ నిర్వహణ రోజురోజుకూ భారంగా మారుతున్న దృష్ట్యా, ప్రభుత్వం స్పందించి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ధూపదీప నైవేద్యాల కోసం నిధులు మంజూరు చేయాలని కోరాడు.

వీటితో పాటు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని పలువురు కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

చైతన్యరథం

## అక్టోబర్ 1 మధ్యాహ్నం నుంచి

# ఇంటింటికీ పింఛన్ల పంపిణీ

- రూ.2,692.34 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- బ్యాంకుల సెలవులు, సమ్మె ఉన్నా పింఛనుదారులకు ఇబ్బంది కలగనివ్వం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్




అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని 61.80 లక్షల మంది పింఛనుదారులకు అక్టోబర్ 1న పింఛన్లు అందజేసేందుకు ప్రభుత్వం రూ.2,692.34 కోట్ల విడుదల చేసిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విడుదల చేసే మొత్తం నిధుల్లో రూ.2,675.63 కోట్లను సంబంధిత స్వర్ణ గ్రామం / స్వర్ణ వార్డు పింఛను బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. రూ.16.65 కోట్లను పింఛనుదారుల బ్యాంకు ఖాతాల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నేరుగా జమ చేస్తారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, SNA SPARSH విధానం ద్వారా ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లో నేరుగా డీబీటీ ద్వారా పింఛన్లను జమ చేసే ప్రక్రియను విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలో పైలట్ ప్రాతిపదికన అమలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

సెప్టెంబర్ 26వ తేదీ శనివారం బ్యాంకు సెలవు కావడం, అలాగే సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె ఉన్న నేపథ్యంలో పింఛనుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ముందస్తుగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ మేరకు అక్టోబర్ 1వ తేదీ ఉదయమే పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదును విత్‌డ్రా చేసుకునేలా బ్యాంకులను అందుబాటులో ఉంచాలని ఎస్ఎల్‌బీసీ (రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి)కి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. స్వర్ణ గ్రామం / స్వర్ణ వార్డు సిబ్బంది అక్టోబర్ 1వ తేదీ ఉదయం బ్యాంకుల నుండి నగదును విత్‌డ్రా చేసి.. అదే రోజు మధ్యాహ్నం నుంచి నేరుగా పింఛన్‌దారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని మంత్రి కొండపల్లి స్పష్టం చేశారు. బ్యాంకు సెలవులు, సమ్మె కారణాల వల్ల పింఛన్ల పంపిణీ తేదీ, విధానంలో జరిగిన ఈ మార్పులను పింఛను దారులందరూ గమనించి, పంపిణీ సిబ్బందికి, ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు.

## రూ.25 లక్షలు పలికిన బందరు సాగరతీర మహాగణపతి లడ్డూ




మచిలీపట్నం (చైతన్యరథం): బందరు సాగర తీరంలో ఏర్పాటు చేసిన మహాగణపతి లడ్డూ రూ. 25 లక్షలు పలికింది. ఈ లడ్డూను ఎస్‌సీఎస్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత గుమ్మడి భవానీ శంకర్ దక్కించుకున్నారు. ఈ మేరకు 630 కేజీల స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని భవానీ శంకర్‌కు ఇవ్వనున్నట్లు ఉత్సవ కమిటీ అధికారికంగా ప్రకటించింది. ఆఫ్ లైన్, ఆన్ లైన్‌లో గురువారం నిర్వహించిన ఈ వేలం పాటలో సుమారు 600 మంది భక్తులు పాల్గొన్నారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. లడ్డూ వేలం మొదటగా రూ. 63 వేలతో ప్రారంభమైనట్లు వారు తెలిపారు. కాగా.. శుక్రవారం జరగనున్న వరసిద్ధి వినాయక స్వామి కల్యాణ ఉత్సవాలకు భవానీ శంకర్ దంపతులు హాజరుకానున్నారు. అనంతరం ఫైర్ జెట్ల సహాయంతో 63 అడుగుల మహా గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. తరువాత భారీస్థాయిలో అన్నదానం జరుగుతుంది.

# ప్రజలు టీచర్లు వైపు.. జగన్ గూండాల వైపు

- గురువులపై వైసీపీ రౌడీల పాశవిక దాడి
- అమాయకుడిలా నటిస్తూ గవర్నర్‌కు జగన్ ఎదురు ఫిర్యాదు
- ఫేక్ ఆరోపణలకు సమాధానం ఇస్తాం, ఆధారాలు చూపిస్తామని టీచర్లు సవాల్ చేస్తే ముందుకురాని గొడ్డలిపార్టీ నేతలు
- శాప్ ఛైర్మన్ రవి నాయుడు ధ్వజం




తిరుపతి (చైతన్యరథం): విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద టీచర్లపై వైసీపీ గూండా మూకలతో దాడులు చేయించిన జగన్‌రెడ్డి తరువాత ఏమీ ఎరగని నంగనాచిలా గవర్నర్ దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేయటం హాస్యాస్పదమని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ అనిమిని రవి నాయుడు విమర్శించారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న వైసీపీ వాళ్లపై టీడీపీ వాళ్లే దాడిచేశారంటూ అమాయకత్వం వలకబోస్తూ జగన్ ఫిర్యాదు చేయటం వింతల్లో కెల్లా పెద్ద వింత అని ఎద్దేవా చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వస్తున్న ఆరోపణలు, ఇటీవల శాప్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై రవినాయుడు స్పందించారు. వైసీపీ చేస్తున్న తప్పుడు ఆరోపణలకు నిరసనగా తమ సర్టిఫికెట్లను శాప్ అధికారులకు చూపించేందుకు వచ్చిన స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ మూకలు దాడులకు దిగితే గవర్నర్‌ను కూడా మభ్యపెట్టేలా జగన్ రెడ్డి అసత్యాలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారన్నారు.

జగన్ రెడ్డి ఆరోపణలు చేస్తున్న గాయత్రి అనే టీచర్.. అసలు ఎక్కడ పనిచేస్తున్నారో కూడా తెలియకుండా, ఆమెకు అసలు నాలెడ్జ్ లేదని, ఆమె సర్టిఫికెట్ ఫేక్ అని జగన్ రెడ్డి ఎలా చెబుతారు? ఆధారాలు లేకుండా ఒక టీచర్‌పై ఇలాంటి ఆరోపణలు చేయడం సరికాదని రవినాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పంలో వైసీపీకి ఓటు వేసిన ఒక వ్యక్తి కూడా రిటైర్డ్ ఆర్మీ పర్సన్‌గా స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగం పొందారు. ఆయన కూడా స్పోర్ట్స్ కోటా కిందనే ఉద్యోగం పొందారు. గతంలో మీరే వారిని సన్మానించారని ఆ ప్లేయర్లు చెబుతున్నారు. వారు సాధించిన విజయాలకు మీరే మెడల్స్ సన్మానించారని చెబుతున్నారు. అలాంటప్పుడు ఇప్పుడు అదే క్రీడాకారులను ఫేక్ అని ఎలా అంటారని జగన్ మోహన్ రెడ్డిని ప్రశ్నించారు. శ్రీకాకుళంలో రాజు అనే క్రీడాకారుడు బాక్సింగ్‌లో సాధించిన విజయాలకు జిల్లాలో చాలామంది సన్మానం చేశారు. అలాంటి వ్యక్తికి కూడా ఫేక్ సర్టిఫికెట్లు ఇచ్చారని మీరు ఆరోపించడం సమంజసమా అని రవినాయుడు నిలదీశారు.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందిన 370 మంది టీచర్లు ముక్త కంఠంతో... మీకు ఏమైనా అనుమానాలు ఉంటే రండి., అన్నీ తీరుస్తాం.. మా సర్టిఫికెట్లు, మేము సాధించిన మెడల్స్, క్రీడా రికార్డులు అన్నీ చూపిస్తాం.. సాక్షిగా లైవ్‌లో మా సర్టిఫికెట్లు చూపించడానికి కూడా శాప్ కార్యాలయం వద్ద సిద్ధంగా ఉన్నామని సవాల్ చేస్తే జగన్, ఆయన ఫేక్ బ్యాచ్ ముందుకు రాలేదన్నారు. సాయంత్రం వరకు ఎదురుచూసిన టీచర్లు కనకదుర్గమ్మ తల్లిని దర్శించుకుని, తాము నిజమైన క్రీడాకారులమని, కష్టపడి చదువుకుని, క్రీడల్లో పాల్గొని మెడల్స్ సాధించామని, తాము తెచ్చుకున్న మెడల్స్ నిజమైనవేనని అమ్మవారి సాక్షిగా ప్రమాణం చేసి చెప్పారన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఆరోపణల కారణంగా ఆ టీచర్లకు రోజూ అవమానం జరుగుతోంది. వారు ఫేక్ సర్టిఫికెట్లు పెట్టుకుని ఉద్యోగాలు తెచ్చుకున్నారని కొందరు వేధిస్తున్నారు. మీ రాజకీయ ఆరోపణల వల్ల నిజమైన క్రీడాకారులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని రవినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.

శాంతియుతంగా శాప్ కార్యాలయం దగ్గరకు వచ్చి వినతిపత్రం సమర్పించేందుకు వచ్చిన సమయంలో టీచర్లపై దాడి జరిగిందని తెలిపారు. వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన టీచర్లపై దాడి చేయడం ఏమిటి? మహిళా టీచర్ల పట్ల కూడా అసభ్యంగా ప్రవర్తించడం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ రౌడీలు చాల అసభ్యంగా ప్రవర్తించారని, మహిళా టీచర్లకు జిప్పు విప్పి చూపించిన దారుణాన్ని జగన్ సమర్థిస్తున్నారా అని నిలదీశారు. కర్రలు, రాడ్లతో టీచర్లపై దాడి చేసి, తలలు పగలగొట్టిన రౌడీ మూకలను అమాయకులుగా జగన్ పేర్కొనటాన్ని రవినాయుడు తీవ్రంగా తప్పుబట్టారు.

ఉపాధ్యాయులను, టీచర్లను పట్టుకుని "బొచ్చు కూడా పీకలేరు", ఇంకా రాయటానికి వీలుకాని భాషలో అంటూ అసభ్యంగా తిట్టారంటూ వీడియోను పాత్రికేయులకు చూపించారు. టీచర్లపై వాటర్ బాటిళ్లు, మద్యం బాటిళ్లు, కోడిగుడ్లు కూడా విసిరారని, వికలాంగులు ఉపయోగించే కర్రలతో కూడా టీచర్లపై దాడి చేశారని తెలిపారు. గురువులను అవమానించడం, అసభ్యకరంగా మాట్లాడటం, తొడలు కొట్టి రెచ్చగొట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

మీరు రోజూ ఆరోపణలు చేస్తున్నారు. టీచర్లు మాత్రం ప్రతి ఆరోపణకు నిజాయితీగా సమాధానం చెబుతున్నారు. తమ వద్ద నిజమైన సర్టిఫికెట్లు ఉన్నాయని,తాము ఫేక్ కాదని ఆధారాలతో చూపిస్తున్నారు. వారు నిజమైన టీచర్లని, స్పోర్ట్స్ కోటా కింద తమ విద్యార్హతల ఆధారంగా టీచర్లుగా ఉద్యోగాలు పొందామని చెబుతున్నారన్నారు. అయినా మళ్లీ మళ్లీ వాళ్లను ఫేక్ టీచర్లంటూ ఆరోపించటం సరికాదన్నారు. వచ్చి వాళ్ల సర్టిఫికెట్లు పరిశీలించి నిజాలు తెలుసుకోవచ్చు కదా అని హితవు పలికారు.

### వేధిస్తున్న గంజాయి బ్యాచ్

జగన్మోహన్ రెడ్డి కి సంబంధించిన గంజాయి బ్యాచ్ టీచర్లను తీవ్రంగా వేధిస్తోందని రవినాయుడు ఆరోపించారు. టీచర్లు పనిచేస్తున్న పాఠశాలలకు వెళ్లి, "నీ సర్టిఫికెట్ చూపించు, నువ్వు ఫేక్ సర్టిఫికెట్ తో జాబ్ సాధించావంటూ విచారణ పేరుతో మహిళా టీచర్లను వేధిస్తున్నారని తెలిపారు. దౌర్జన్యం భరించలేక ఒక గిరిజన మహిళా టీచర్ కన్నీటి పర్యంతమయ్యారని రవి నాయుడు గుర్తు చేశారు. నాలుగు నెలల నుంచి ఆ టీచర్ల పిల్లలు కూడా వారిని అనుమానించే పరిస్థితి ఏర్పడిందన్నారు. "ఇలా వేధించడం కంటే మమ్మల్ని చంపేయవచ్చు కదా" అంటూ ఒక మైనార్టీ టీచర్ కన్నీటి పర్యంతమవుతు న్నారని గుర్తు చేశారు. మీ రాజకీయ ప్రయోజనాల కోసం కష్టపడి మెడల్స్ సాధించి ఉద్యోగం పొందిన మమ్మల్ని ఎందుకు బలిపశువులను చేస్తున్నారని ఆ టీచర్లు ప్రశ్నిస్తున్నారని రవి నాయుడు తెలిపారు.

ఇదిలా ఉండగా, జగన్మోహన్‌రెడ్డి సలహాదారుడైన సజ్జల రామకృష్ణారెడ్డి మట్లాడుతూ మేము అధికారంలోకి రాగానే 16వేల మంది టీచర్లను తీసేస్తాం.. ముందు దానిపైనే మేము సంతకం చేస్తాం.. అని చెప్పారని రవి నాయుడు గుర్తు చేశారు. వెటర్నరీ పోస్టుల విషయంలో కూడా అలాగే చేస్తున్నారన్నారు. రిక్రూట్‌మెంట్ జరిగిన ప్రతి డిపార్ట్‌మెంట్‌పై ఈ రౌడీ మూకలు దాడి చేస్తున్నారని ఆరోపించారు. అయితే తాము చట్టాలను గౌరవిస్తూ శాంతియుతంగా ఉన్నామని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని తెలిపారు. ఈ విషయాలన్నింటినీ జర్నలిస్టులు కూడా ముక్తకంఠంతో ప్రశ్నించాలి. ప్రజలు కూడా నిలదీయాలన్నారు.

గతంలో తమ పార్టీ ఆఫీస్‌పై కూడా దాడి చేసిన విధ్వంసం సృష్టించిన వారే, ఇప్పుడు టీచర్లపై దాడుల కు చేశారని రవినాయుడు తెలిపారు. మేమందరం శాప్ ఆఫీసులోనే ఉన్నాం. మంత్రి, శాప్ ఎండీ, అందరూ అక్కడే ఉండగా టీచర్లపై దాడి జరిగింద న్నారు. దాడికి వస్తున్నారని తమ దృష్టికి వచ్చినప్పటికీ అక్కడే ఉండి, చర్చలు జరిపి, అవసరమైన అన్ని ఆధారాలను వారికి చూపించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అయితే వైసీపీ వాళ్లకు అసలు చర్చలు జరిపే ఉద్దేశమే లేదని, వస్తే వాళ్ల ఆరోపణలన్నీ ఫేక్ అని ప్రజలకు తెలిసిపోతుందనేది వాళ్ల భయమని రవినాయుడు ఎద్దేవా చేశారు.

### ఎవరినీ వదిలిపెట్టం

టీచర్లను ఇబ్బంది పెట్టిన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకుంటామని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని రవి నాయుడు తెలిపారు. గురువులపై దాడికి దిగిన అందరిపైనా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని, రాష్ట్రంలోని ప్రతి టీచర్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. టీచర్లకు ఒక్కటే చెప్పదలుచుకున్నాం. ఇది కేవలం 16 వేల మంది టీచర్ల సమస్య కాదు. రాష్ట్రంలో ఉన్న ప్రతి టీచర్ దీనిపై స్పందించాలి. మీకు ప్రభుత్వం అండగా ఉంది. మీరు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. మళ్లీ టీచర్ ఉద్యోగాలకు సంబంధించి మూడు డీఎస్సీలు వస్తాయని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారని తెలిపారు. మిగతా టీచర్లు కూడా ప్రస్తుతం ఫేక్ ఆరోపణలు ఎదుర్కొంటున్న స్పోర్ట్స్ కోటా టీచర్లకు సంఘీభావం తెలపాలని రవి నాయుడు విజ్ఞప్తి చేశారు.

# కువైట్ తెలుగు సమాజానికి గర్వకారణం

## - ఆ దేశ జాతీయ క్రికెట్ జట్టుకు ఎంపికైన తెలుగు తేజం విశ్వతేజకు ఏపీఎన్ఆర్టీ-కువైట్ అభినందనలు






కువైట్ (చైతన్యరథం): కువైట్ జాతీయ క్రికెట్ జట్టులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగు యువకుడు నెట్టెం విశ్వతేజకు చోటు దక్కడం పట్ల ఏపీఎన్ఆర్టీ-కువైట్ హర్షం వ్యక్తం చేసింది. కువైట్‌లోని తెలుగు సమాజానికి ఇది ఎంతో గర్వకారణమైన విషయమని పేర్కొంది. కడప జిల్లా రాజంపేట మండలం కుప్పవారిపల్లి గ్రామానికి చెందిన రూన్సీ నెట్టెం, ప్రసాద్ నెట్టెం దంపతుల కుమారుడు విశ్వతేజ చిన్ననాటి నుంచే క్రికెట్‌పై ఆసక్తితో క్రమశిక్షణతో సాధన చేస్తూ తన ప్రతిభను నిరూపించుకున్నారు. కువైట్ తరఫున ఇటీవల సింగపూర్‌లో జరిగిన అంతర్జాతీయ క్రికెట్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు.

తెలుగు యువకుడైన విశ్వతేజ కువైట్ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగడం కువైట్‌లోని తెలుగు వారందరికీ స్ఫూర్తిదాయకమని ఏపీఎన్ఆర్టీ-కువైట్ తెలిపింది. అతని ప్రతిభను గుర్తించి అవకాశాలు కల్పిస్తున్న కువైట్ క్రికెట్ యాజమాన్యం, కోచ్‌లు, టీమ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపింది. విశ్వ తేజను చిన్ననాటి నుంచి ప్రోత్సహిస్తూ క్రీడా ప్రయాణంలో అండగా నిలిచిన తల్లిదండ్రులు రూన్సీ నెట్టెం, ప్రసాద్ నెట్టెం దంపతులకు ప్రత్యేక అభినందనలు తెలిపింది. విశ్వ తేజ భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, కువైట్‌తో పాటు భారతదేశం, ఆంధ్రప్రదేశ్, తెలుగు సమాజానికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఏపీఎన్ఆర్టీ-కువైట్ ఆకాంక్షించింది.

విశ్వ తేజను అభినందించిన వారిలో ఏపీఎన్ఆర్టీ-కువైట్ సభ్యులు ఓలేటి దివాకర్ నాయుడు, రాచూరి రెడ్డి మోహన్, అదుసుపల్లి, ఉదయ ప్రకాశ్, ముస్తాక్ ఖాన్, శంకర్ యాదవ్, బాబు మలేపాటి, రవి ములకల, దొడ్డిపల్లి సుబ్బరాజు, శ్రీను మేడమల్లి, గుండయ్య నాయుడు, బుజ్జి, తదితరులు ఉన్నారు.

# గురువులకు ఇచ్చే గౌరవం ఇదేనా?

మన భారతీయ సంస్కృతిలో మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అంటూ దేవుడితో సమానంగా పూజించబడే పవిత్ర స్థానం గురువులది. అలాంటి సమాజ నిర్మాతలను, రేపటి భావి భారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై దాడులు చెయ్యడం వైసీపీ నీచ సంస్కృతికి నిదర్శనం. విజయవాడలో జరిగిన ఆ సంఘటన సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉంది. విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దుతున్న గురువులపై దాడులు చేయడం చూస్తుంటే గురువులకు మనం ఇస్తున్న గౌరవం ఇదేనా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. విజయవాడలో ఉపాధ్యాయులపై జరిగిన దాడి కేవలం కొందరిపై జరిగిన దాడి కాదు. యావత్ గురు పీఠంపై, విజ్ఞానంపై జరిగిన దాడి. ఈ నీచ దాడులను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలి. ఉపాధ్యాయుల నియామకాల విషయంలో వైసీపీ నాయకులు కొందరు హద్దుమీరి వ్యవహరించారు. శాంతియుతంగా తమ వాదన వినిపించడానికి, మెగా డీఎస్సీ విషయంలో వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టే ప్రయత్నం చేసిన టీచర్లపై కొందరు రౌడీషీటర్లు, వైసీపీ నాయకులు వాటర్ బాటిల్స్, కోడిగుడ్లు, రాళ్లు విసురుతూ దాడికి దిగడం అత్యంత హేయం. మీసాలు తిప్పుతూ, తొడ కొడుతూ రాయలేని భాషలో బూతులు తిడుతూ తమ వెంట తెచ్చుకున్న కర్రలతో వైసీపీ నీలిమూకలు దాడులకు తెగపడ్డాయి. వైసీపీ మహిళా నాయకురాళ్లు మహిళలను టీచర్లపైకి ఉసిగొల్పారు. టీచర్లనుద్దేశించి మురికిభాషతో వైసీపీ మహిళా కార్యకర్తలు రెచ్చిపోయారు. గాజులు, చీరలు ఇస్తాం తొడుక్కోండి అంటూ రెచ్చగొడుతూ 2029లో మేము వస్తాము రప్పా, రప్పా చేస్తాం అంటూ ఇష్టానుసారం బూతులు తిట్టారు. వైసీపీ నాయకులు ఈ విధంగా బరితెగించి వ్యవహరించడం విద్యా వ్యవస్థకే తీరని కళంకం. స్వార్థ రాజకీయ కోసం అభం శుభం తెలియని ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకోవడం సిగ్గుచేటు. ఉపాధ్యాయులను రాజకీయ కక్ష సాధింపులకు పావులుగా వాడుకోవడం వైసిపి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులపై భౌతిక దాడులకు పాల్పడిన వైసిపి నీలి మూకలపై, రౌడీషీటర్లపై ప్రభుత్వం కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

### రాజకీయ లబ్ధి కోసం గురువులను బలిపశువులను చేస్తారా?

ఉపాధ్యాయుల నియామకాల్లో తప్పులుంటే ఆధారాలతో ప్రశ్నించాలి, విచారణ కోరాలి, కోర్టును ఆశ్రయించాలి. కానీ గురువులపై భౌతిక దాడి చేయడం మాత్రం సమర్థనీయం కాదు.గురువు అంటే కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి కాదు. భావి భవిష్యత్తు తరం వారికి బాటలు వేసే శిల్పి. తల్లిదండ్రుల తర్వాత పిల్లలు అత్యంత విశ్వాసంతో చూసేది గురువునే. అలాంటి గురువు గౌరవానికి రాజకీయ రంగు పులమడం ఎంతవరకు సమంజసం? నియామకాలపై అనుమానాలుండొచ్చు. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించవచ్చు. గురువును గౌరవించాల్సిన సమాజంలో గురువు మీదే చేయిచేసుకునే పరిస్థితి వస్తే గురువులకు మీరు ఇచ్చే గౌరవం ఇదేనా? అని సమాజం ప్రశ్నిస్తుంది. ఏళ్ల తరబడి చదివి, పరీక్షలు రాసి, ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగం సాధించిన వ్యక్తులపై నిరాధార ఆరోపణలు వస్తే అతని కుటుంబం, సామాజిక గౌరవం దెబ్బతింటుంది. మీ రాజకీయ లబ్ధి కోసం గురువులను బలిపశువులను చేస్తారా? ఉపాధ్యాయుడు ఏ పార్టీకి చెందిన వాడైనా ముందుగా ఆయన ఒక ఉపాధ్యాయుడు. రాజకీయ అభిప్రాయం వేరుగా ఉండవచ్చు. కానీ తరగతి గదిలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే వ్యక్తి గౌరవాన్ని కాపాడటం సమాజం మొత్తం బాధ్యత. నియామకాల్లో నిజంగా అక్రమాలు జరిగి ఉంటే బయటపెట్టండి. తప్పు చేసినవారిపై చర్యలకు డిమాండ్ చెయ్యండి. కానీ విచారణకు ముందే ఉపాధ్యాయులను దోషులుగా ప్రకటించడం, వారిపై భౌతిక దాడులకు పాల్పడటం ఏమిటి? గురువులపై దాడులు చెయ్యడం ద్వారా మీ ఆరోపణలు నిజం అవుతాయా? గురువు గౌరవం దెబ్బతింటే ఒక్క ఉపాధ్యాయుడి గౌరవం మాత్రమే దెబ్బతినదు, విద్యకు, విలువలకు, సమాజ భవిష్యత్తుకు కూడా గాయం అవుతుంది.

### గురువులపై దాడులకు పాల్పడే నీచ సంస్కృతిపై ఉక్కుపాదం!

ప్రజాస్వామ్యంలో గుండాగిరికి తావులేదు. గురువులపై భౌతిక దాడులు, బూతుల సంస్కృతి వైసీపీ రాజకీయ పతనానికి నిదర్శనం. వైసీపీ నాయకుల అరాచకత్వాన్ని తుంచకపోతే ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు. భారతీయ సంస్కృతిలో గురువు స్థానం అత్యున్నతమైనది. అటువంటి ఉపాధ్యాయులను రోడ్డు మీదకు లాగి దాడి చేయడం, బూతులు తిట్టడం, రాళ్లతో విరుచుకుపడటం ఏ రాజకీయ సంస్కృతికి నిదర్శనం? ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను విమర్శించే హక్కు, శాంతి యుతంగా నిరసన తెలిపే వెసులుబాటు ఉంది. కానీ ప్రతిపక్షంలో ఉన్నామన్న అక్కసుతో, తాము కోరుకున్నట్లు వ్యవస్థలు నడవలేదన్న ఫ్రస్టేషన్‌తో ఇష్టానుసారంగా రెచ్చిపోవడం, రౌడీషీటర్లను ముందుపెట్టి దాడులకు తెగబడటం రాజకీయ చైతన్యం అనిపించుకోదు. ఇది పూర్తిగా గుండాగిరీ కిందకే వస్తుంది. అధికారం కోల్పోయినంత మాత్రాన సమాజంలోని కనీస నైతికతను, సంయమనాన్ని కోల్పోవడం నేరపూరిత మనస్తత్వానికి పరాకాష్ట. మెరిట్ ఆధారంగా పారదర్శకంగా ఉద్యోగాలు భర్తీ చేస్తే అర్హులైన అభ్యర్థులు ఉపాధ్యాయులుగా ఎంపిక అయితే దాన్ని హర్షించాల్సింది పోయి, ఈర్ష్యతో ఓర్వలేకపోవడం హేయమైన చర్య. నియామక ప్రక్రియను అడ్డుకోవాలని, ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేయాలని చూడటం ద్వారా వైసీపీ నాయకులు ఎవరికి మేలు చేయాలని చూస్తున్నారు? నిరుద్యోగ యువతను, విద్యా వ్యవస్థను బలిపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న వైసీపీ నాయకుల వికృత చేష్టలను ఎండగట్టవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. ఇలాంటి హింసాత్మక రాజకీయాలను అన్ని వర్గాలు, ప్రజా సంఘాలు ముక్తకంఠంతో ఖండించాలి. చట్టం తన పని తాను చేసుకుపోవడం ఎంత అవసరమో, ప్రజల నుంచి నైతిక తిరస్కారమూ కూడా అంతే అవసరం. గురువులపై దాడులకు పాల్పడే నీచ సంస్కృతిపై ఉక్కుపాదం మోపకపోతే రేపు సమాజంలో ఏ ఒక్కరూ ప్రశాంతంగా జీవించలేని పరిస్థితి వస్తుంది. కావున ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలంటే వైసీపీ నాయకుల గుండాగిరిని ఉక్కుపాదంతో అణచివేయాల్సిన తక్షణ కర్తవ్యాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించాలి.

### ఉపాధ్యాయ దినోత్సవ వేడుక రోజున బహిష్కరణ!

జగన్ రెడ్డికి ఉపాధ్యాయ వృత్తిపై ఏమాత్రం గౌరవం లేదు. డీఎస్సీలో అక్రమాలంటూ ఆరోపణలు చెయ్యడం తన రాజకీయ ఉనికి కోసమే తప్ప ఉపాధ్యాయులపై ప్రేమతో మాత్రం కాదు. గత ఐదేళ్లు అధికారంలో వున్నప్పుడు కూడా ఆయన గురువులకు కనీస గౌరవం ఇవ్వలేదు. గురువులను మద్యం షాపుల వద్ద మందు బాబులను క్యూలో నిలబెట్టడానికి ఉపయోగించి అవమానించిన చరిత్ర ఆయనదే. ఉపాధ్యాయులు నిలువెత్తు అక్షరమై నిలబడాల్సిన ఊరు బడిని దూరం చెయ్యొద్దన్నందుకు హాజరు నుంచి బాత్రూం క్లీనింగ్ దాకా యాప్‌ల గోలేంటని నిలదీసిందుకు అణచివేతకు పూనుకున్నారు. విధానపరమైన నిర్ణయాలను వ్యతిరేకించినందుకు ఉపాధ్యాయులను గృహ నిర్బంధాలు చేశారు. విద్యారంగాన్ని కాపాడమన్నందుకు బైండోవర్ చేస్తూ నాన్ బెయిలబుల్ కేసులు పెట్టారు. ఇచ్చిన మాటకు కట్టుబడమన్నందుకు, చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోమని ఉద్యమ కార్యాచరణ ప్రకటించి శాంతియుత పోరాటానికి పిలుపునిచ్చిన ఉపాధ్యాయులపై ఉక్కుపాదం మోపారు. అందుకే ఉపాధ్యాయ దినోత్సవ వేడుక రోజున మాకే పూజలూ వద్దు, పురస్కారాలూ వద్దు మీ సన్మాన సత్కారాలు అసలే వద్దు, మమ్మల్ని రోడ్డు మీద దోషులుగా నిలబెట్టకుంటే చాలు, మాకే ఉత్సవమూ వద్దు, ఊరేగింపూ వద్దు, మాకే దండా వద్దు, దండమూ వద్దు, నలుగురిలో మమ్మల్ని అవమానించకుంటే చాలు, మాకే గౌరవం వద్దు, గుర్తింపూ వద్దు, పొగడ్తలూ వద్దు, ప్రశంసలు అసలే వద్దు. మా మర్యాదను మంటగలపకుంటే చాలు, కీర్తీ వద్దు, కిరీటాలు వద్దు అందలమెక్కించే పదవులు అసలే వద్దు, సమాజంలో నేరస్తులుగా చిత్రీకరించకుంటే చాలు, బడి పిల్లల ముందు మమ్మల్ని ఉపాధ్యాయులుగా గుర్తిస్తే చాలు అది మా ఆత్మ గౌరవానికి ప్రతీక, అదే మాకు మీరిచ్చే గురుపూజోత్సవ కానుక అంటూ టీచర్స్ డే రోజున ఉపాధ్యాయులు బహిష్కరణ చెయ్యాల్సిన దుస్థితి జగన్ హయాంలో జరిగింది. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకమే చెయ్యకుండా ఉపాధ్యాయులను అనేక విధాలుగా ఇబ్బంది పెట్టిన చరిత్ర జగన్ రెడ్డిదే అని చెప్పాలి.

- నీరుకొండ ప్రసాద్

# కొండవాలు ప్రాంతాల్లో ప్రభుత్వ విప్ గణబాబు విస్తృత పర్యటన

**● అల్పపీడన ప్రభావంతో కుండపోత: కొండచరియల నడుమ పశ్చిమ ఎమ్మెల్యే క్షేత్రస్థాయి పరిశీలన**

విశాఖపట్నం (చైతన్యరథం): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో విశాఖ నగరాన్ని కుండపోత వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కొండవాలు ప్రాంతాలో పలుచోట్ల కొండచరియలు, మట్టి దిబ్బలు విరిగిపడి నివాసాలు కొంతమేర ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ శాసనసభ్యులు పి.జి.వి.ఆర్.నాయుడు కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటన చేపట్టారు. 59వ వార్డు హనుమాన్ నగర్, 63వ వార్డు పరిధిలోని కాకరలోవ, క్రాంతి నగర్ వంటి అత్యంత సమస్యాత్మక కొండవాలు ప్రాంతాల్లో గురువారం ఆయన స్వయంగా పర్యటించారు. కొండచరియలు విరిగిపడి దెబ్బతిన్న ఇళ్లను నిశితంగా పరిశీలించి, భయాందోళనల్లో ఉన్న స్థానికులతో నేరుగా మాట్లాడారు. "ప్రభుత్వం మీకు అన్ని విధాలా అండగా ఉంటుంది.. ఎలాంటి ఆందోళన చెందవద్దు" అంటూ బాధితుల్లో మనోధైర్యాన్ని నింపారు.

**అధికారులకు కచ్చితమైన ఆదేశాలు:**

పర్యటన సందర్భంగా జీవీఎంసీ, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో ఎమ్మెల్యే అక్కడికక్కడే సమీక్షించారు. ఆయా కొండవాలు ప్రాంతాల్లో ఇప్పటికే నిర్మాణ దశలో ఉన్న రిటైనింగ్ వాల్ (రక్షణ గోడ) పనులను ఏమాత్రం జాప్యం చేయకుండా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కొండచరియలు విరిగిపడే ప్రమాదం లేకుండా నాణ్యతా ప్రమాణాలతో పనులు వేగంగా ముగించాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పులువురు అధికారులు పాల్గొన్నారు.

# పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు

**● టెక్కలి నియోజకవర్గంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు విస్తృతంగా పర్యటన**



టెక్కలి (చైతన్యరథం): టెక్కలి నియోజకవర్గంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విస్తృత పర్యటన చేశారు. టెక్కలి మండలం పరిధిలోని మెలియాపుట్టి రహదారిని పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం విస్తృతంగా పరిశీలించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు.తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రహదారులను స్వయంగా పరిశీలించారు. రహదారుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, రహదారులు, భవనాల శాఖల అధికారులతో పరిస్థితిపై సమీక్షించి, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. పాడైన రహదారులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు, కొత్త రహదారుల ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లోని అన్ని గ్రామాలకు నూతన రహదారులు వేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని రహదారులు, పంచాయతీరాజ్, ఐటీడీఏ అధికారులకు సూచించారు. నందిగామ మండలం కొత్త అగ్రహారం వద్ద తుఫాన్ ప్రభావంతో కూలిపోయిన వంతెనను మంత్రి పరిశీలించారు. వంతెన పునర్నిర్మాణానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని ఆదేశించారు. వర్షాలతో వ్యవసాయ పొలాల్లో చేరిన నీటిని కూడా మంత్రి పరిశీలించారు. పంట పొలాల్లో నీటి నిల్వలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రాంతాల్లో నిలిచిన నీరు బయటకు వెళ్లేలా కాలువలు, నీటి మార్గాలను సరిచేయాలని అధికారులకు సూచించారు. రైతులకు నష్టం కలగకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువు పాల్గొన్నారు.

# ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో గొట్టా బ్యారేజ్ వద్ద నీటి ఉధృతిని పరిశీలించిన ఎమ్మెల్యే ఎంజీఆర్



పాతపట్నం (చైతన్యరథం): నియోజకవర్గం హిరమండలం మండలం గొట్టా బ్యారేజ్ వద్ద ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో వంశధార నదిలో పెరుగుతున్న నీటి ఉధృతిని శాసనసభ్యులు మామిడి గోవిందరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వంశధార శాఖ అధికారులను నీటి ప్రవాహం, ప్రస్తుతం బ్యారేజ్ వద్ద కొనసాగుతున్న క్యూసెక్కుల వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో వంశధార నదిలో నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. గొట్టా బ్యారేజ్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఈయనతో పాటుగా ఎన్డీఏ కూటమి నాయకులు, వంశధార శాఖ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# ముంపు ప్రాంతాల్లో పల్లా విస్తృత పర్యటన : ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

**●ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యల్లో పాల్గొనాలని టీడీపీ శ్రేణులకు పిలుపు**




విశాఖపట్నం (చైతన్యరథం): వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పెద్ద గంట్యాడ, గంగవరం, హరిజన జగ్గయ్యపాలెం, నీలపువీధి, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ముంపు, లోతట్టు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలతో మమేకమై వర్షాల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు పొంగిపొర్లుతున్న పరిస్థితులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, కాలువలు, నీటి ప్రవాహాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పల్లా కోరారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జీవీఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే టీడీపీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుని సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొనాలని పల్లా పిలుపునిచ్చారు. వర్షాలు తగ్గే వరకు ముంపు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# డేటా సెంటర్ పనులకు ఉన్నత సాంకేతికత అవసరం

**● పనుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి : ఎమ్మెల్యే గంటా**

**● వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు పరామర్శ**



విశాఖపట్నం (చైతన్యరథం): జాతీయ రహదారి నుంచి తర్లువాడ గూగుల్ డేటా సెంటర్‌కు మెరుగైన సాంకేతికతతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. ప్రతిష్ఠాత్మక డేటా సెంటర్ పనుల విషయంలో తగిన జాగ్రత్త వహించాలన్నారు. వర్షానికి బ్రిడ్జి పనులు కొట్టుకుపోవడం, ముడసర్లోవ దగ్గర గూగుల్ పనుల్లో ప్రహరీ కూలిపోవడం గురించి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడానని తెలిపారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా ఆనందపురం, మధురవాడలలో దెబ్బ తిన్న ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వర్షాల కారణంగా కొండ వాలు, లోతట్టు ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని.. ఎక్కడికక్కడ షెల్టర్లు ఏర్పాటు చేసి తాగునీరు, భోజన, వసతి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించామన్నారు. వర్షం కొనసాగే అవకాశం ఉన్నందున రాబోయే 2 రోజులు అప్రమత్తంగా ఉండాలని, 24 గంటలు పని చేసే కంట్రోల్ రూంల సాయాన్ని తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

**రిజర్వాయర్‌లలో నీటి మట్టాలు పెరిగాయి**

ఎల్ నినో కారణంగా వర్షాభావంతో నీటి సమస్య తలెత్తిందని, ప్రస్తుతం మేఘాద్రిగెడ్డ, ముడసర్లోవ, తాటిపూడి రిజర్వాయర్‌లలో నీటి మట్టాలు బాగా పెరిగాయన్నారు. జిల్లాలో మౌలిక వసతుల కల్పనకు ఒకేసారి రూ.3,892 కోట్లు మంజూరు చేయడం ఒక చరిత్రగా అభివర్ణించారు. మధురవాడలో 24 గంటల తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, 65 పార్కుల అభివృద్ధి తదితర పనుల కోసం పెద్దఎత్తున నిధులు కేటాయించారని.. అలాగే భీమిలి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం రూ.100 కోట్లు ఇచ్చారని వెల్లడించారు.

**పరామర్శ**

కార్పెంటర్ కాలనీలో రేకుల షెడ్ కూలి గాయపడిన మెట్ట రాము, అతని కుమార్తె కాంచనలను పరామర్శించారు. కాలనీలో సాంకేతిక అంశాలు సరి చేసి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తామని, అలా కాని పక్షంలో ప్రత్యామ్నాయం చూస్తామని హామీ ఇచ్చారు. కొమ్మాది రేఖా రెసిడెన్సీ వద్ద నిల్వ ఉన్న వర్షపు నీటి ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ నీటిని యుద్ధ ప్రాతిపదికన తోడాలని ఆదేశించారు.

# విశాఖ లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



విశాఖపట్నం తూర్పు (చైతన్యరథం): తుఫాన్ కారణంగా ఎడతెర్పు లేకుండా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తూర్పు నియోజకవర్గం పరిధి 9వ వార్డు హనుమంతువాక కొండవాలు ప్రాంతంలో నివాసముంటున్న బాదరు సత్యవతమ్మ, శివశంకర్, గంగాధర్ ఇళ్లపై మట్టి గోడ కూలి మూడు ఇల్లులు పూర్తిగా ధ్వంసమైయ్యాయి. దీంతో భారీగా ఆస్తి నష్టం జరగడంతో బాధిత కుటుంబాలను గురువారం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే రామకృష్ణబాబు పరామర్శించారు. భారీ వర్షాలకు మట్టి గోడలతో ఉన్న ఇళ్లలో నివాసం ఉంటున్న వాళ్లు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. వర్షాలకు ఆస్తి నష్టం జరిగినా ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని, నష్టపోయిన బాధితుల్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఇక్కడ రక్షణ గోడ కట్టించాల్సిన అవసరం ఉందని జీవీఎంసీ అధికారులు గంగాధర్, చంద్రమౌళికి ఆదేశాలు జారీ చేశారు.

# విద్యార్థి మృతి తీవ్ర విషాదకరం : మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



టెక్కలి (చైతన్యరథం): టెక్కలి మండలం పరిధిలో నిన్న జరిగిన రైలు ప్రమాదంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న నలుగురు విద్యార్థులు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ ప్రమాదంలో మెలియాపుట్టి మండల కేంద్రంలో నివాసముంటున్న సవర కృష్ణారావు, అను దంపతుల ఏకైక కుమారుడు శివ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషాదకర ఘటనపై స్పందించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు శివ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, శివ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ విషాద సమయంలో ప్రభుత్వం, పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా కల్పించారు.

## రైతులకు అండగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

● నీట మునిగిన పంట పొలాలు పరిశీలన



గోపాలపురం (చైతన్యరథం): రైతులకు అండగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు నిలుస్తున్నారు. గోపాలపురం మండలం చిట్యాల గ్రామంలో భారీ వర్షాల కారణంగా నీట మునిగిన పంట పొలాలను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు స్థానిక రైతులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నష్టంపై రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయ అధికారి మరియు సిబ్బందితో మాట్లాడి, పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన వివరాలను సేకరించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా, పంట నష్టంపై తగిన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు. రైతులకు అండగా.. ప్రతి కష్టంలో తోడుగా... ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు కృషి చేస్తున్నారు.

## విశాఖ అపార్ట్మెంట్ సెల్లార్లోకి భారీగా వరద నీరు



విశాఖపట్నం (చైతన్యరథం): కొమ్మాది ప్రాంతంలోని రేఖ రెసిడెన్సీ అపార్ట్మెంట్ సెల్లార్లోకి భారీగా వరద చేరింది. దీంతో అపార్ట్మెంట్లో చిక్కుకున్న సుమారు 80 మందిని పోలీసులు, సహాయక బృందాలు సురక్షితంగా కాపాడాయి. రాత్రి విధుల్లో ఉన్న పీఎంపాలెం క్రైమ్ ఎస్సై సూర్యప్రకాష్ అక్కడి పరిస్థితిని గమనించి వెంటనే ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. లా అండ్ ఆర్డర్ సీఐ జి. బాలకృష్ణ, నైట్ ఎన్ఎస్ఈల అధికారుల ఆదేశాల మేరకు.. పీఎం పాలెం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. అపార్ట్మెంట్లో చిక్కుకున్న వారందరిని సురక్షితంగా రక్షించారు.

## 26న గడ్డిపాడు రైల్వే ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపన విజయవంతం చేద్దాం : ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు నగరాభివృద్ధిలో మరో కలికి తురాయి వచ్చి చేరిందని, గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్ – గడ్డిపాడు రైల్వే లెవల్ క్రాసింగ్ (LC-3)పై రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించ బోతున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రైల్వే కేంద్ర సహాయ మంత్రి సోమన్న, కేంద్రగర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. దీనికి సంబంధించిన సన్నాహక సభను గురువారం రాత్రి స్థానిక తూర్పు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గట్టిపాడు వద్ద భూమి పూజ అనంతరం ఇన్నర్ రింగ్ రోడ్ జంక్షన్ నుంచి భారీ బైక్ ర్యాలీ ప్రారంభమై వెంకటేశ్వర విజ్ఞాన్ మందిరం వరకు కొనసాగుతుందని చెప్పారు. గుంటూరు నగర అభివృద్ధికి ఎంతో కీలకమైన ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపన కార్యక్రమాన్ని కూటమి శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆధ్వర్యంలో గుంటూరు నగరానికి మహర్దశ తీసుకొచ్చారని తెలిపారు. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం గుంటూరు నగరానికి మణికిరీటం అన్నారు.

## వర్షపు నీరు నిలవకుండా తక్షణ చర్యలు చేపట్టండి

అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచన



విజయవాడ (చైతన్యరథం): రూరల్ మండలం రామవరప్పాడు-- ప్రసాదంపాడు జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలిచిపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పంచాయతీ అధికారులను ఆదేశించారు. ప్రసాదంపాడు హిందూ శ్మశానవాటికకు వెళ్లే మార్గంలోని సంపు వద్ద నీటి సరఫరా మార్గంలో మట్టి పేరుకుపోవడంతో వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో వెంటనే స్పందించి సంపును తెరిచి పూడికతీత పనులు చేపట్టాలని, డ్రైనేజీ మార్గాన్ని శుభ్రం చేసి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు రామవరప్పాడు- ప్రసాదంపాడు ప్రాంతంలో నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు పూడికతీత పనులు చేపట్టారు. నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# 20 ఏళ్ల నాటి పైప్‌లైన్ సమస్యకు శాశ్వత పరిష్కారం

●5వ డివిజన్లో రూ.43.50 లక్షలతో నూతన తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): స్థానిక 5వ డివిజన్ మఠం వీధిలో తాగునీటి సరఫరా సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా చర్యలు చేపట్టినట్లు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. రూ.43.50 లక్షల అంచనా వ్యయంతో పాత పైప్‌లైన్ స్థానంలో ఏర్పాటు చేయనున్న 110 ఎంఎం నూతన తాగునీటి పైప్‌లైన్ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ మఠం వీధిలో సుమారు 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పీవీసీ పైప్‌లైన్ తరచూ మరమ్మతులకు గురవుతోందన్నారు. పైప్‌లైన్‌లోని కొన్ని ప్రాంతాలు డ్రైనేజీల మీదుగా ఉండటంతో లీకేజీలు ఏర్పడిన సందర్భాల్లో తాగునీరు కలుషితమయ్యే సమస్య తలెత్తుతోందన్నారు. ప్రజలు ఈ సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం కోసం నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మఠం వీధితో పాటు దాని పరిసర వీధులకు కూడా నూతన 110 ఎంఎం పైప్‌లైన్ ద్వారా తాగునీటి సరఫరా కల్పించేలా పనులు చేపడుతున్నట్లు వివరించారు. భవిష్యత్తులో డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టినా నూతన పైప్‌లైన్‌కు ఇబ్బందులు తలెత్తకుండా సరైన అలైన్‌మెంట్‌తో పనులు చేపట్టాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు చెప్పారు. పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకుండా నెల రోజుల్లోనే పనులను పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు.

పనులను కూటమి నాయకులు కూడా దగ్గరుండి పర్యవేక్షించాలని సూచించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, లో-వోల్టేజ్ వంటి సమస్యలను గుర్తించి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు.

# ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు... పొంగిపొర్లిన వాగులు, వంకలు

● స్తంభించిన రాకపోకలు... గ్రామాలకు నిలిచిపోయిన రవాణ వ్యవస్థ... ఏజెన్సీ ప్రాంతాలను చుట్టిముట్టిన వరద



విశాఖపట్నం (చైతన్యరథం): తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రను భారీ వర్షాలు ముంచెత్తాయి. ఎడతెరిపిలేని వానలతో జనజీవనం స్తంభించింది. వాగులు, గెడ్డలు పొంగిపొర్లడంతో గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. విద్యుత్ స్తంభాలు, వృక్షాలు రహదారులపై కూలడంతో అటు విద్యుత్ సరఫరాకు, రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఏజెన్సీలోని గ్రామాలను వరద చుట్టుముట్టింది. కొండచరియలు విరిగిపడి బీభత్సం సృష్టించాయి. అనేక చోట్ల వందల ఎకరాల్లో పంట నీటమునిగింది.

**2-3 రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు** : తీవ్ర వాయుగుండం ప్రభావంతో విశాఖలో 2-3 రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురిశాయి. వానలతో విశాఖలోని కొండవాలు ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధురవాడ ప్రాంతంలోని కార్పెంటర్ కాలనీలో ప్రహరీ కూలిపోయింది. పీఎం పాలెంలోని అపార్ట్మెంట్ రక్షణగోడ కూలింది. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పరిస్థితిని పర్యవేక్షించారు. గాజువాక నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. నీటమునిగిన హరిజన జగ్గయ్యపాలెం గ్రామాన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సందర్శించారు. విశాఖ హనుమంతవాక కొండవాలు ప్రాంతంలో రక్షణగోడ కూలి నివాస గృహంపై పడింది. 3 కుటుంబాలు నివసిస్తున్న ఇల్లు పాక్షికంగా కూలిపోయింది. భారీ వర్షాలకు ఆరిలోవ రైతుబజార్ నీటమునిగింది.

**నిండుకుండలా గంభీరం రిజర్వాయర్** : విశాఖ దాహార్తి తీర్చే గంభీరం రిజర్వాయర్ భారీ వర్షాలకు నిండుకుండలా మారింది. 300 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. అనకాపల్లి జిల్లా ఎస్?. రాయవరం మండలంలో వరాహ నది జలకళ సంతరించుకుంది. దార్లపూడి సమీపంలో వరాహ నదిపై నిర్మించిన పోలవరం అక్విడక్టు కింద నుంచి నీరు వేగంగా దూసుకెళ్లోంది. పెనుగొల్లు వద్ద గ్రోయిన్ల మీదుగా పరుగులు తీస్తున్న నీరు జలపాతాన్ని తలపిస్తోంది. నిన్నటి దాకా చుక్క నీరు లేని నది నిండుగా పరుగులు తీస్తుండటంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**స్తంభించిన జనజీవనం** : అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. కొయ్యూరు మండలంలో జాతీయరహదారిపై కొండచరియలు విరిగిపడ్డాయి. అటుగా వెళ్లే వాహనాలు నిలిచిపోవడంతో పెను నష్టం తప్పింది. పాడేరు ఘాట్‌లో కొండచరియలు విరిగిపడగా హుటాహుటిన తొలగించారు. పాడేరు-జి.మాడుగుల మధ్య జాతీయ రహదారి బ్రిడ్జి నిర్మాణానికి ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. జీకే వీధి మండలం పీకే గూడెంలో ఇళ్లలోకి వాన నీరు చేరి ప్రజలు ఇబ్బంది పడ్డారు.

**వాగుల ఉద్ధృతి** : పోలవరం జిల్లా రంపచోడవరం మన్యంలో వర్షాలకు కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వాగుల ఉద్ధృతితో రాకపోకలు స్తంభించాయి. వర్షాలు, గాలుల ధాటికి రహదారులపై విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. భూపతిపాలెం జలాశయం గేట్లు ఎత్తి సీతపల్లివాగులోకి నీరు వదలగా వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

**నాగావళి ఉగ్రరూపం** : తీవ్ర వాయుగుండం తీరం దాటడంతో ఉమ్మడి విజయనగరం జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. సంతకవిటి మండలం రంగరాయపురం ఆనకట్ట వద్ద నాగావళి ఉగ్రరూపం దాల్చింది. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. భారీ వర్షాలతో బొబ్బిలిలో పలు ప్రాంతాలు నీటమునిగాయి. బొబ్బిలి నుంచి మల్లపేటకు వెళ్లే రహదారి జలమయమైంది. రైల్వే అండర్ బ్రిడ్జిలోకి వరద చేరి రాకపోకలు నిలిచాయి. టీబీఆర్ థియేటర్ వద్ద వరద ధాటికి రాకపోకలు నిలిపేశారు. వేగావతి నదికి వరద రావడంతో బొబ్బిలిలో తాగునీటి సరఫరా ఆపేశారు. గోపినాయుడు చెరువు పొంగి రాజాం పరిధి సారథి గ్రామాన్ని ముంచెత్తింది. సంతకవిటి, రేగిడి, రాజాం మండలాల్లో వరి పొలాలు నీటమునిగాయి.

**నాగావళి నదిలో పెరిగిన నీటి ప్రవాహం** : పార్వతీపురం మన్యం జిల్లాపై భారీ వర్షాలు పెను ప్రభావం చూపాయి. పార్వతీపురం వద్ద వరహాలు గెడ్డ ప్రవాహం పెరగడంతో కాలనీలు నీట మునిగాయి. బైపాస్ కాలనీలోని గణేష్‌నగర్‌లో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బంది పడ్డారు. రహదారులు పూర్తిగా మునిగిపోయాయి. కూటమి నేతలు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడారు. ఎస్సీ హాస్టల్ నీటమునిగింది. రెవెన్యూ అధికారులు విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. పాలకొండ ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలింది. నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. పాలకొండ మండలంలో వరి పొలాలు నీటమునిగాయి. బలిజపేట మండలం పెదపింది గ్రామంలో మురుగునీరు ఇళ్లలోకి చేరి స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వీరఘట్టం మండలంలో ఈదురుగాలులకు స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

**నేలకొరిగిన భారీ వృక్షాలు** : శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస, పొందూరు, బూర్జ, సరుబుజ్జిలి మండలాల్లో వాగులు పొంగాయి. పలు చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఈసర్లపేట వద్ద భారీ వృక్షం నేలకొరిగింది. సుమారు 350 ఎకరాల్లో పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. పాతపట్నం నియోజకవర్గంలో పలుచోట్ల రహదారులపై పెద్దఎత్తున వాన నీరు నిలిచి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. కొత్తూరు మండలం వాసప వద్ద రహదారిపై భారీ వృక్షం కూలింది. టెక్కలిలో వంశధార ఎడమ ప్రధాన కాలువ పొంగి గట్టుపై నుంచి పొలాల మీదుగా ప్రవహిస్తోంది. టెక్కలి-మెళియాపుట్టి మార్గంలోని ముంపు ప్రాంతాల్లో మంత్రి అచ్చెన్నాయుడు పర్యటించారు. కాలువ గట్లకు గండ్లు పడకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. టెక్కలి తహసిల్దార్ కార్యాలయ ఆవరణం వాననీటితో చెరువులా మారింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి నీరు చేరి ఇబ్బందులు ఎదురయ్యాయి.

# తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

**●నాదెండ్ల మండల కేంద్రంలో జాతీయ పోషణ మాసోత్సవం-2026లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**

**●కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి స్వర్ణ గ్రామ ఆరోగ్యదర్శిని కార్యక్రమం**



చిలకలూరిపేట (చైతన్యరథం): మహిళలు గర్భం దాల్చినప్పటినుంచి ప్రసవం వరకు వారి ఆరోగ్య సంరక్షణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాయని, అంగన్ వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో మంచి నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. గురువారం ఆయన పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికాశుక్లాతో కలిసి నాదెండ్ల గ్రామంలోని స్థానిక కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లాస్థాయి జాతీయ పోషణ మాసోత్సవం-2026 కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలింతలకు హెచ్.పి.ఎన్ కిట్స్ అందించిన అనంతరం ఎమ్మెల్యే ప్రత్తిపాటి, కలెక్టర్ కృతికా శుక్లా చిన్నారులను ఎత్తుకొని ముద్దాడి ఊయలలో వేశారు. అనంతరం వారు కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి మాట్లాడారు.

**తల్లీ బిడ్డల ఆరోగ్యానికి అధికప్రాధాన్యత..**

ఎన్డీయే ప్రభుత్వం తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణలో భాగంగా పలు చర్యలు తీసుకుంటోందని, చిన్నారుల వయసు, గర్భిణుల్లోని పిండ ఎదుగుదలను బట్టి వారికి అందించే ఆహారంలో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ, సకాలంలో నాణ్యమైన సమతుల పౌష్టికాహారం అందిస్తోందన్నారు. అంగన్ వాడీకేంద్రాల్లో అందించే నాణ్యమైన పోషకాహారానికి తోడు, తల్లీబిడ్డలు తాము వ్యక్తిగతంగా తీసుకునే ఆహారం విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆశ, అంగన్ వాడీ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బంది తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, గర్భిణులు, శిశువుల్ని రక్షించడం వారి ప్రాథమిక బాధ్యతని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం తల్లీబిడ్డల సంరక్షణకూ అధిక ప్రాధాన్యత ఇస్తోందని, గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు ప్రతి దశలోనూ అన్నిజాగ్రత్తలు తీసుకుంటోందన్నారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలా ప్రజల్ని గాలికి వదిలేయదని, ముఖ్యంగా మహిళలు, చిన్నారుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని ప్రత్తిపాటి తెలిపారు. తల్లీ బిడ్డల ఆరోగ్య రక్షణలో పల్నాడు జిల్లా రాష్ట్రంలోనే మంచి ఫలితాలు సాధించిందని, ఇందుకు కారకులైన ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నట్లు ప్రత్తిపాటి చెప్పారు.

# మీ సేవలో.... మీ జీవీ...అధికారులతో టెలికాన్ఫరెన్స్



వినుకొండ (చైతన్యరథం): వాయుగుండం ప్రభావంతో వినుకొండ నియోజకవర్గంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశించారు. వర్షాల పరిస్థితి, విద్యుత్ సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీటి పరిస్థితి తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ముందస్తు చర్యలను సమీక్షించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలని జీవీ సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో సిబ్బందిని రంగంలోకి దించి సాధ్యమైనంత త్వరగా సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది, వాహనాలు, అవసరమైన పరికరాలు, మరమ్మతు సామగ్రిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడిన ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. మున్సిపల్ అధికారులు పట్టణంలోని ప్రధాన డ్రైనేజీలు, కాలువలు, కల్వర్టులు, లోతట్టు ప్రాంతాలను ముందుగానే పరిశీలించాలని జీవీ సూచించారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, మట్టి తదితరాలను తొలగించి అవసరమైన చోట్ల పారిశుద్ధ్య సిబ్బందిని, పరికరాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే పరిస్థితి ఏర్పడితే వెంటనే మోటార్ల ద్వారా నీటిని తొలగించేలా ఏర్పాట్లు చేయాలని ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

# వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఎమ్మెల్యే బొండా ఉమా పరామర్శ

**● లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షణ**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు వెంటనే స్పందించారు. గురువారం 63వ డివిజన్ సుందరయ్య నగర్, రాజీవ్ నగర్, 64వ డివిజన్ కండ్రిక శివారు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బొండా ఉమా స్వయంగా పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఇళ్లలోకి వర్షపు నీరు చేరిన ప్రాంతాలను పరిశీలించి, బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షపు నీరు ఇళ్లలో నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే వెంటనే అధికారులను అప్రమత్తం చేసి మోటార్లను ఏర్పాటు చేసి నీటిని యుద్ధప్రాతిపదికన బయటకు తోడించేలా చర్యలు చేపట్టారు. నీటి తొలగింపు పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల్లోని కనెక్టింగ్ కాలువలు, డ్రైనేజీ మార్గాలను పరిశీలించిన ఎమ్మెల్యే, కాలువల్లో భారీగా పేరుకుపోయిన గుర్రపు డెక్కలు, చెత్తాచెదారం కారణంగా నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతున్న విషయాన్ని గుర్తించారు. వెంటనే జేసీబీలను ఏర్పాటు చేసి గుర్రపు డెక్కలు, చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించి కాలువల్లో నీటి ప్రవాహం సజావుగా సాగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... "వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపడుతోంది. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఇళ్లలోకి నీరు చేరిన ప్రాంతాల్లో వెంటనే మోటార్ల ద్వారా నీటిని బయటకు తోడిస్తున్నాం. కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం." అని తెలిపారు. "ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటారు. అవసరమైన చోట మోటార్లు, జేసీబీలు ఏర్పాటు చేసి సహాయక చర్యలు చేపడతాం. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకుంటాం." అని భరోసా ఇచ్చారు.

# సాధువులకు ఉచిత వసతి సముదాయం



అమరావతి (చైతన్యరథం): శ్రీశైలంలో సాధువులకు ఉచిత వసతి సముదాయం ఏర్పాటు చేయాలని రాష్ట్ర సాధు పరిషత్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అట్లూరి నారాయణరావు, అధ్యక్షులు శ్రీనివాసనంద స్వామి, ప్రతినిధులతో కలిసి ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతు గుంట రమేష్ నాయుడుకు గురువారం వినతిపత్రం అందజేశారు. తక్షణమే స్పందించిన ఛైర్మన్ సాదు పరిషత్ ప్రతినిధులతో స్వయంగా టూరిస్ట్ వసతి సముదాయం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ దేవస్థానానికి చెందిన ఒక డార్మెంటరీ వసతి సముదాయాన్ని సాధువులకు కేటాయించారు. సాధువుల ప్రాధాన్యతను గుర్తించి వసతి సముదాయాన్ని కేటాయించిన ఛైర్మన్ రమేష్ నాయుడు, ఈవో శ్రీనివాసరావుకు సాధు పరిషత్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీశైలం తరహాలో ఇతర దేవస్థానాలు కూడా సాధువులకు వసతి సముదాయం కేటాయించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సాదు పరిషత్ గౌరవ అధ్యక్షులు అట్లూరి నారాయణరావు కోరారు. పోతుకుంట రమేష్ నాయుడు మరో రెండు టర్ములు దేవస్థానం ఛైర్మన్గా కొనసాగించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. సాధువుల వసతి సముదాయం కోసం వెంట ఉండి కృషిచేసిన అరవింద్ రెడ్డి, శివ స్వాములకు సాదు పరిషత్ అభినందనలు తెలిపింది.

# 51 మందికి రూ.92.83 లక్షల ఎల్.ఓ.సిలు మంజూరు

**●పేదల వైద్యానికి అండగా కూటమి ప్రభుత్వం**

**●మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు**



మైలవరం (చైతన్యరథం): అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ మైలవరం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వైద్య సహాయాన్ని అందిస్తోందని మైలవరం శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో తాజాగా 51 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.92,83,607 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్.ఓ.సి.)లను మంజూరు చేశారు. మంజూరైన ఎల్.ఓ.సిలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ... ఖరీదైన వైద్యాన్ని చేయించుకునే స్తోమత లేని పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్), ఎల్.ఓ.సిల ద్వారా ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అందించే వైద్య సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మైలవరం నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైద్య సహాయం అందేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు పేర్కొన్నారు. అత్యవసర వైద్యం అవసరమైన పేదలు ఆర్థిక ఇబ్బందులతో చికిత్సకు దూరం కాకుండా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఎల్.ఓ.సిలు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదుకి కృతజ్ఞతలు తెలిపారు.

# గుంటూరు పశ్చిమలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న టీడీ జనార్ధన్, ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి గురువారం టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు టీడీ జనార్ధన్‌తో కలిసి పలు మర్యాదపూర్వక, పరామర్శ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి నివాసానికి విచ్చేసిన టీడీ జనార్ధన్‌కి ఎమ్మెల్యే గళ్ళా మాధవి, గళ్ళా రామచంద్రరావులు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం గుంటూరులో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు పావులూరి శివరామ కృష్ణయ్య కుమారుడు, ప్రముఖ కాటన్ వ్యాపారవేత్త పావులూరి కృష్ణకుమార్ ఇటీవల మృతి చెందడంతో ఎస్వీఎన్ కాలనీలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఇటీవల భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని గుంటూరులోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని ప్రజాసేవలో మరింత చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.




# సీఎం, డీసీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

## తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దిశానిర్దేశం

వింజమూరు (చైతన్యరథం): ఈ నెల 29వ తేదీన వరికుంటపాడు మండలం, రామాపురం గ్రామ పంచాయతీ పరిధిలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న "పల్లె పండుగ 3.0" కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎనిమిది మండలాల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. వింజమూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధ్యక్షతన పల్లె పండుగ 3.0 సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ చెంచల్ బాబు యాదవ్, ఉదయగిరి నియోజకవర్గ అబ్జర్వర్ మీగడ ఓబుల్ రెడ్డి, ఎనిమిది మండలాల కన్వీనర్లు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. ఈ నెల 29వ తేదీన రామాపురం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించనున్న పల్లె పండుగ 3.0 కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తదితర ప్రముఖులు పాల్గొననున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, మౌలిక వసతులు, ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు పాల్గొనే ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేలా మండలాల వారీగా సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి మండలం నుంచి వచ్చే నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రయాణం, పార్కింగ్, సభా ప్రాంగణం, తాగునీరు, భోజనం, ఇతర అవసరమైన ఏర్పాట్లపై ముందస్తు సమన్వయం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. బాధ్యతలను నాయకులు, కార్యకర్తలకు స్పష్టంగా కేటాయించి, వాటిని సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే కార్యక్రమానికి హాజరయ్యే ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని నాయకులకు సూచించారు. ఎనిమిది మండలాల నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషితో పనిచేస్తే పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించవచ్చని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ చెంచల్ బాబు యాదవ్, నియోజకవర్గ అబ్జర్వర్ మీగడ ఓబుల్ రెడ్డి నాయకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమ విజయవంతానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమన్వయ సమావేశంలో ఎనిమిది మండలాల కన్వీనర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.



# ఘనంగా మన గౌరవం ప్రారంభోత్సవం

## పాల్గొన్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట (చైతన్యరథం): రూ. 131 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవం, "మన ఇల్లు – మన గౌరవం" కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పురపాలక పట్టణాభివృద్ధి శాఖ, ఏపీ టిడ్కో ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలో అందరికీ ఇళ్లు పథకం కింద నిర్మించిన టిడ్కో గృహ సముదాయంలో "మన ఇల్లు – మన గౌరవం" ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా హాజరై, శిలాఫలకాన్ని ఆవిష్కరించి గృహాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ.. నిరుపేదల ఆత్మగౌరవాన్ని కాపాడి, ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. సూళ్లూరుపేట అర్బన్ ఎన్టీఆర్ నగర్ పరిధిలో దాదాపు రూ. 131 కోట్ల అంచనా విలువతో సర్వాంగ సుందరంగా, సకల మౌలిక వసతులతో ఈ గృహ సముదాయాన్ని నిర్మించి నేడు లబ్ధిదారులకు అప్పగించడం ఎంతో గర్వకారణంగా ఉందని తెలిపారు. గతంలో లబ్ధిదారులు చెల్లించిన వాటాధనం మొత్తాన్ని ప్రభుత్వం రీఫండ్ చేయాలనే నిర్ణయానికి అనుగుణంగా, సూళ్లూరుపేట మున్సిపాలిటీకి చెందిన 185 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 56,61,000/- (యాభై ఆరు లక్షల అరవై ఒక్క వేల రూపాయలు) విలువైన భారీ నమూనా చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ స్థానిక నేతలు, అధికారులతో కలిసి పంపిణీ చేశారు. గత 20-25 ఏళ్లుగా అద్దె ఇళ్లలోనే నివసిస్తున్న ఎన్నో నిరుపేద కుటుంబాలు నేడు సొంతింటి యజమానులుగా మారడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే విజయశ్రీ గారికి మరియు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలక కమిషనర్, టిడ్కో ఈఈ, ఏఈలు,, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు, మహిళలు పాల్గొన్నారు.

# 'పల్లె పండుగ'ను విజయవంతం చేయాలి

## టీడీపీ శ్రేణులకు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పిలుపు




కావలి (చైతన్యరథం): శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం, రామాపురం గ్రామంలో ఈ నెల 29వ తేదీన అత్యంత వైభవంగా జరగనున్న 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి టీడీపి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం కావలి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అధ్యక్షతన గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి పాల్గొంటున్న ఈ కార్యక్రమం నెల్లూరు జిల్లా అభివృద్ధి చరిత్రలో ఒక కీలక ఘట్టంగా నిలవబోతోందని అన్నారు. మన ఉమ్మడి జిల్లాకు విచ్చేస్తున్న అధినేతలకు స్వాగతం పలికేందుకు, పల్లె పండుగను జయప్రదం చేసేందుకు కావలి నియోజకవర్గం నుంచి వేలాదిగా కూటమి శ్రేణులు, ప్రజలు తరలివెళ్లాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం 'పల్లె పండుగ' ద్వారా వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే తెలిపారు. పల్లెల్లో రవాణా సౌకర్యాలు, తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి నియోజకవర్గంలోని ప్రతి మండలం, పంచాయతీ నుంచి తరలివచ్చే వాహనాలు, కార్యకర్తల సమన్వయం మరియు ఇతర ఏర్పాట్లపై సమావేశంలో క్షుణ్ణంగా చర్చించారు. ప్రతి గ్రామం నుంచి అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనేలా నాయకులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటన ద్వారా ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఐక్యత, గ్రామసీమల అభివృద్ధే ధ్యేయంగా సాగుతున్న పాలనకు ప్రజల మద్దతు స్పష్టమవుతుందని అభిప్రాయపడ్డారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శ్రేణులంతా క్రమశిక్షణతో ప్రయాణించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో టీడీపీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, స్థానిక ప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎగువ అబ్బవరంలో ఘనంగా గణేశ్ నిమజ్జనం

రాయచోటి (చైతన్యరథం): ఎగువ అబ్బవరం హరిజనవాడలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయకుని నిమజ్జన కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు కమిటీ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులతో కలిసి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమజ్జన ఊరేగింపు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరుపుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలాగే నీటి ప్రదేశాల వద్ద జాగ్రత్తలు పాటిస్తూ, విద్యుత్ తీగలు మరియు ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని, పోలీసుల సూచనలు నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. "వినాయకుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి వెల్లివిరియాలి" అని సుగవాసి ప్రసాద్ బాబు ఆకాంక్షించారు.





# గొడ్డలి పార్టీపై తిరగబడే రోజు దగ్గరలోనే ఉంది

## ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు (చైతన్యరథం): సైకో చేష్టలతో రాష్ట్రంలో అశాంతి రేపుతున్న గొడ్డలి పార్టీపై తిరగబడే రోజు దగ్గరలోనే ఉందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శలు చేశారు. రాప్తాడు ఎంపీడీవో కార్యాలయంలో ఆమె సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని 6మండలాలకు చెందిన 61మంది లబ్ధిదారులకు రూ.42లక్షల 25వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె అందజేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే సునీతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాగానే ప్రజారోగ్య రంగాన్ని గాడిన పెట్టిందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవను బలోపేతం చేయడంతో పాటు, ఎక్కడైనా పేద ప్రజలు తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే.. వారిని ఆదుకోవడానికి ముఖ్యమంత్రి



సహాయనిధి ద్వారా ఒక ఆపద్బంధువులా ఆదుకుంటున్నారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 1,534 మంది లబ్ధిదారులకు రూ.11కోట్ల 75లక్షల సాయాన్ని అందించామన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తుంటే దాన్ని ఓర్వలేక వైసీపీ నాయకులు వారి అరాచకాలను నేటికీ ొనసాగిస్తున్నారన్నారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ ని అత్యంత పారదర్శకంగా నిర్వహించి... 16,000 మందికి పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారన్నారు. అయితే ఇందులో అక్రమాలు జరిగాయి అంటూ నారా లోకేష్ పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. చదువు చెప్పే ఉపాధ్యాయులపై దాడులకు తెగబడుతున్నారంటే వారు ఏ స్థాయికి తెగించారో అర్థమవుతోందన్నారు. ఉపాధ్యాయులకు కూడా సహనం కొంతవరకే ఉంటుందని వారు కూడా సైకో బ్యాచ్ పై తిరగబడతారన్నారు. మరోవైపు రాప్తాడులో నారా లోకేష్ పర్యటన వేల మందితో దిగ్విజయంగా సాగితే ఓర్వలేక కొందరి నాయకులు ఇష్టం వచ్చినట్టు వాగుతున్నారన్నారు. పరిటాల రవి ఫ్యాక్షన్ చేసి ఉంటే మీరు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు విచారణ చేయలేదని నిలదీశారు. 24 మందిని అతి దారుణంగా పొట్టన పెట్టుకున్న చరిత్ర మీదని విమర్శలు చేశారు. కనీసం సొంత గ్రామానికి రోడ్డు కూడా వేయించలేని వారు కూడా నారా లోకేష్, పరిటాల రవి వంటి వారిని విమర్శలు చేస్తున్నారని... ముందు వాళ్ల స్థాయి ఏంటో తెలుసుకోవాలని ఎమ్మెల్యే సునీత హితవు పలికారు.



ఢిల్లీలో పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో ద న్యూ గ్రోత్ ల్యాబొరేటరీ అంశంపై నిర్వహించిన ఫైర్ సైడ్ చాట్ కార్యక్రమంలో పాల్గొన్న హిందూపురం పార్లమెంట్ సభ్యులు పార్థసారథి, సహచర పార్లమెంటు సభ్యులు తదితరులు

# రాయదుర్గంలో టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

## పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మాజీమంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి

రాయదుర్గం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రాయదుర్గం పట్టణంలోని సీతారామాంజనేయ కళ్యాణ మండపంలో గురువారం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక సంస్థల జిల్లా ఎన్నికల కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. తొలుత ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పార్టీ శ్రేణులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణ, సమన్వయం, ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.



# ప్రయాణికుల సౌకర్యాలే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యం

## ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి పనులను పరిశీలించిన జోనల్ చైర్మన్ పూల నాగరాజు



అనంతపురం (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన ప్రజా రవాణా సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు తెలిపారు. అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌ను పూల నాగరాజు సందర్శించి, బస్టాండ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం బస్సు డిపోను పరిశీలించి, ఆర్టీసీ సేవలకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లో ప్రయాణికులతో పూల నాగరాజు నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు అందుతున్న ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం గురించి ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మహిళలకు ఆర్థిక భారం తగ్గించడంతో పాటు, వారి ప్రయాణాన్ని సులభతరం చేయాలనే ఉద్దేశంతో స్త్రీశక్తి పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్త్రీశక్తి పథకం అమలులో మహిళా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పథకం ఉద్దేశం నెరవేరేలా ప్రతి మహిళకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాల్సిన బాధ్యత ఆర్టీసీ సిబ్బందిపై ఉందన్నారు. అనంతపురం బస్టాండ్‌కు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారని, వారి అవసరాలకు అనుగుణంగా బస్టాండ్‌లో మౌలిక వసతులను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. పరిశుభ్రత, తాగునీరు, కూర్చునే సదుపాయాలు, ప్రయాణికులకు అవసరమైన ఇతర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని పూల నాగరాజు పేర్కొన్నారు. ఆర్టీసీ సేవలను మరింత ప్రజలకు చేరువ చేసి, ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు చర్యలు కొనసాగుతాయని పూల నాగరాజు గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, ఇంజనీరింగ్ అధికారులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# అమరావతి కేంద్రంగా కృష్ణా నదిపై వాటర్ మెట్రో

## నోయిడాలో గళమెత్తిన ఏపీఐడబ్ల్యుఏ చైర్మన్ డాక్టర్ జె శివప్రసాద్

నెల్లూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడుల శాఖామాత్యులు బీసీ జనార్దన్ రెడ్డి సూచనల మేరకు ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్. శివ ప్రసాద్ నేతృత్వంలోని అధికారుల బృందం నోయిడాలోని ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయంలో నేషనల్ ఛైర్మెన్ సాహిల్ కుమార్‌ను కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధికి అవకాశం ఉన్న పలు కార్గో - టూరిజం కీలక ప్రాజెక్ట్‌లను వారి దృష్టికి తీసుకువచ్చారు. కృష్ణా నదిపై ముక్త్యాల నుండి మచిలీపట్నం వరకు 168 కిలోమీటర్ల మేర రవాణా అవసరాలు, కార్గో - టూరిజం కోసం ఫెయిర్ వే నిర్మాణం చేపట్టవల్సిందిగా కోరారు. జూలై 2027 లో జరగనున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని గోదావరి నదిపై సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ నుండి పోలవరం వరకు 40 కి.మీ. మేర టూరిజం అభివృద్ధికి అవకాశం కల్పించాలని కోరారు. అమరావతి కేంద్రంగా కృష్ణా నదిపై వాటర్ మెట్రో ఏర్పాటుకు అనుకూలమైన అంశాల పట్ల అధ్యయనం చేయవలసిందిగా కోరడం జరిగింది. సంబంధిత ప్రాజెక్ట్ లను ఐడబ్ల్యుఏ నేషనల్ ఛైర్మెన్ సాహిల్ కుమార్, డైరెక్టర్ టెక్నికల్ శ్రీరాజ్ షిండేలకు వివరించగా వారు సానుకూలంగా స్పందించారు, ఈ సందర్భంగా వారికి ఏపీ డబ్ల్యుఏ ఛైర్మన్ డాక్టర్ జెడ్ శివ ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు












## సేవలో ముందడుగు... మానవత్వంలో ఆదర్శం

# తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా యువత

**ఒమాహా:** సేవ అంటే కేవలం అవసరంలో ఉన్నవారికి చేయూతనివ్వడం మాత్రమే కాదు... వారి స్థితిగతులను అర్థం చేసుకుని, స్పందించే మనసును పెంపొందించుకోవడం కూడా. ఈ భావనను యువతకు ప్రత్యక్ష అనుభవం ద్వారా పరిచయం చేయాలనే లక్ష్యంతో తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా (TSN) ఆధ్వర్యంలో ఒమాహా నగరంలోని Siena Francisలో నిర్వహించిన Feed the Need-Youth Charity & Food Drive స్ఫూర్తిదాయకంగా, విజయవంతంగా జరిగింది.

తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా ప్రస్తుత అధ్యక్షుడు కొల్లి, చారిటీ కమ్యూనిటీ చైర్ ధనారావు గొట్టిపాటితో కలిసి ఈ కార్యక్రమానికి నాంది పలికారు. కమ్యూనిటీ కమిటీ చైర్ అవినాష్ టీఎస్ఎన్ సభ్యుల సహకారంతో కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. యువత, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని అవసరంలో ఉన్నవారికి భోజనం అందించారు. ఈ కార్యక్రమాన్ని కేవలం భోజన సేవకే పరిమితం చేయకుండా యువతకు అక్కడి జీవన పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక పర్యటన కూడా ఏర్పాటు చేశారు. ఇందుకోసం TSN అధ్యక్షుడు కొల్లి Siena Francis House Chair Mrs.Lillyతో ప్రత్యేకంగా మాట్లాడి యువత కోసం facility tour ఏర్పాటు చేశారు. ఈ సందర్శన యువతకు ఎందుకు ముఖ్యమో వివరించడంతో, Mrs. Lilly



సానుకూలంగా స్పందించి అందుకు అవకాశం కల్పించారు. ఈ పర్యటనలో యువత, మహిళలు, పురుషుల కోసం ఏర్పాటుచేసిన shelter విభాగాలతో పాటు నివాస ప్రాంతాలు, laundry facilities తదితర సదుపాయాలను సందర్శించింది. అక్కడ ఆశ్రయం పొందుతున్న వారి రోజువారీ జీవన విధానాన్ని దగ్గరగా గమనించడం ద్వారా సమాజంలోని మరో కోణాన్ని తెలుసుకునే అవకాశం వారికి లభించింది. తరగతి గదిలో తెలుసుకునే విషయాలకు భిన్నంగా జీవితంలోని వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా చూడటం వారిలో లోతైన ఆలోచనకు దారితీసింది. సందర్శన అనంతరం యువత పంచుకున్న అనుభూతులు ఈ కార్యక్రమం వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని స్పష్టంగా ప్రతిబింబింపజేశాయి. తమకు తల్లిదండ్రులు, కుటుంబం, తిరిగి వెళ్లేందుకు ఒక ఇల్లు ఉండటం ఎంత విలువైనదో వారు గుర్తించారు. నిత్య జీవితంలో సహజంగా భావించే ఎన్నో సౌకర్యాలు, అవకాశాలు అందరికీ లభించవనే వాస్తవాన్ని తెలుసుకోవడం వారిలో కృతజ్ఞతాభావాన్ని కలిగించింది.

ఈ సందర్భంగా ఒక యువ వాలంటీర్ చెప్పిన మాట అక్కడున్న వారందరినీ కదిలించింది. "నేను పెద్దయ్యాక, వీరు అనుభవిస్తున్న బాధలో కొంతైనా తగ్గించగల పరిష్కారాన్ని కనుగొనాలని ఉంది" అని చెప్పడం మిగతా యువతలోనూ కొత్త ఆలోచనకు నాంది పలికింది. ఒక కార్యక్రమం ముగిసినప్పుడు కాదు... దాని ఆశయం మనసులను తాకి, ఆలోచనల్లో మార్పునకు నాంది పలికినప్పుడే అది నిజమైన విజయం అనే భావనకు ఈ స్పందన నిదర్శనంగా నిలిచింది.

తానా ఎన్నారై స్టూడెంట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉమా.ఆర్.కటికి (ఆరమండ్ల) ఆధ్వర్యంలో

# 'ఇమ్మిగ్రేషన్ 360°' అవగాహన సదస్సు గ్రాండ్ సక్సెస్

## పలు అంశాలపై అవగాహన కల్పించిన ప్రముఖ న్యాయవాది, అటార్నీ సంతోష్.ఆర్.సోమిరెడ్డి

**యూఎస్ఏ:** అమెరికాలో ప్రస్తుతం ఇమ్మిగ్రేషన్ కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికాలో నివసిస్తున్న తెలుగు వారికి ఇమ్మిగ్రేషన్‌కు సంబంధించిన అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ముందడుగు వేసింది. 'ఇమ్మిగ్రేషన్ 360°' పేరుతో తానా ఎన్నారై స్టూడెంట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉమా.ఆర్.కటికి (ఆరమండ్ల) ఆధ్వర్యంలో 'జూమ్' మాధ్యమం ద్వారా ఒక ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఇమ్మిగ్రేషన్ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న ప్రముఖ న్యాయవాది ఆటార్నీ సంతోష్.ఆర్.సోమిరెడ్డి ముఖ్య వక్తగా హాజరయ్యారు. యూఎస్ ఇమ్మిగ్రేషన్ చట్టాలు, ఉద్యోగ ఆధారిత వీసాలు (H-1B, Green Card), కుటుంబ ఆధారిత ఇమ్మిగ్రేషన్ ప్రాసెస్, లీగల్ స్టేటస్‌కు సంబంధించిన సమస్యలు, ఇటీవలి కాలంలో వచ్చిన కీలక మార్పులు.. తాజా పరిణామాలను ఆయన సవివరంగా వివరించారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ విధానాలు, వీసా నిబంధనలు, ఉద్యోగ అనుమతులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అమెరికా ఇమ్మిగ్రేషన్‌కు సంబంధించిన సంక్లిష్టమైన నిబంధనలు, వీసా ప్రక్రియలు, సాధారణంగా ఎదురయ్యే న్యాయపరమైన అంశాలపై కమ్యూనిటీ సభ్యులకు స్పష్టత ఇచ్చారు. H-1B, F-1 వంటి వీసా విభాగాలు, తాజా వీసా మార్పులు, ఉద్యోగ అనుమతులు, రిమోట్ వర్క్‌కు సంబంధించిన మార్గదర్శకాలు వంటి అంశాలపై ఆటార్నీ సోమిరెడ్డి అవగాహన కల్పించారు. వాటికి పరిష్కారాలు చూపించారు. యూనివర్సిటీలు, అంతర్జాతీయ విద్యార్థులు పాటించాల్సిన నిబంధనలు, ప్రయాణ సమయంలో అవసరమైన పత్రాలు, ప్రయాణ పరిమితులపై కూడా వివరాలు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు తమ వ్యక్తిగత ఇమ్మిగ్రేషన్ సందేహాలను నేరుగా అడిగి నివృత్తి చేసుకున్నారు. వీసా, ఉద్యోగం, విద్య, ప్రయాణం వంటి అంశాలపై కమ్యూనిటీ సభ్యులు సోమిరెడ్డి నుంచి సమాధానాలు పొందారు. అమెరికాలో ఇమ్మిగ్రేషన్ నిబంధనలు తరచూ మారుతున్న నేపథ్యంలో.. తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పాల్గొన్న సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.




తానా ఎన్నారై స్టూడెంట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉమా.ఆర్. కటికి (ఆరమండ్ల) మాట్లాడుతూ... "ఇమ్మిగ్రేషన్ అనేది ఇప్పుడు ఎంతో మంది భారతీయుల కలలు, ఆశయాలు, వారి భవిష్యత్తును నిర్దేశించే ప్రక్రియగా మారింది. ప్రస్తుతం రోజురోజుకూ మారుతున్న ఇమ్మిగ్రేషన్ నిబంధనలతో ఎంతో మంది ప్రొఫెషనల్ ఉద్యోగులు, విద్యార్థులు కన్ఫ్యూజన్‌లో పడుతున్నారు. అందుకోసమే తానా తరపున ఇమ్మిగ్రేషన్ సమస్యలపై అవగాహన కల్పించి.. అనుభవజ్ఞులైన అటార్నీ సంతోష్.ఆర్.సోమిరెడ్డితో ఉద్యోగులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలనే ఈ సెమినార్ ఏర్పాటు చేశాం. లీగల్‌గా ఇబ్బందులు ఎదురైన వారి సమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా పెట్టుకున్నాం." అన్నారు. యాంకర్ లావణ్య గూడురు సంధానకర్తగా వ్యవహరించి ఉద్యోగులు, విద్యార్థుల సమస్యలను అటార్నీకి వివరించి సమాధానాలు రాబట్టారు.

తానా ప్రెసిడెంట్ నరేన్ కొడాలి ఫోన్ కాల్ ద్వారా మాట్లాడి ఇంతటి అద్భుతమైన ఇమ్మిగ్రేషన్ సెమినార్ కండెక్ట్ చేసిన డాక్టర్ ఉమా.ఆర్.కటికి (ఆరమండ్ల), సెమినార్లో పాల్గొన్న తన మిత్రుడు సోమిరెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గొప్ప కార్యక్రమం నిర్వహించారని ప్రశంసించారు.

అవగాహన సదస్సు గ్రాండ్ సక్సెస్ కావడానికి సహకారం అందించిన తానా ఫౌండేషన్ ట్రస్టీ సతీష్ మేక, యూత్ కో-ఆర్డినేటర్ చెరుకూరి శ్రీనివాసరావు, ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ కృష్ణ ప్రసాద్ కోంపల్లి, ఓహియోవ్యాలీ రీజినల్ రిప్రజెంటేటివ్ ప్రదీప్ చందనం, శ్రీదేవి దొంతి, యాంకర్ లావణ్య గూడురులకు తానా ఎన్నారై స్టూడెంట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉమా.ఆర్.కటికి (ఆరమండ్ల) ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తానా 'ఇమ్మిగ్రేషన్ 360°' అవగాహన సదస్సు పూర్తి వీడియోను కింద లింక్‌లో చూడొచ్చు. https://youtu.be/mC5rPsi-Bjk



## న్యూయార్క్‌లో వైభవంగా

# 'నైటా' గణేశ్ ఉత్సవాలు

**న్యూయార్క్:** న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం (నైటా) ప్రెసిడెంట్ రవీందర్ కోడెల ఆధ్వర్యంలో న్యూయార్క్‌లోని అసమయి ఆలయ ప్రాంగణంలో వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. తెలుగు కుటుంబాలతో పాటు న్యూయార్క్ ప్రజలు కూడా ఉత్సాహంగా పాల్గొని భారతీయ ఆధ్యాత్మికత, సంస్కృతి, సంప్రదాయాలను ఆసక్తిగా వీక్షించారు. వినాయకుడికి చిన్నారులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు జరిపారు. ప్రముఖ వ్యాపారవేత్త, సంఘ శ్రేయోభిలాషి డాక్టర్ పైళ్ళ మల్లారెడ్డి దంపతులతో పాటు పలువురు ప్రముఖులు, భక్తులు వేడుకలను తిలకించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో అధ్యక్షుడు రవీందర్ కొడెలతో పాటు కార్యవర్గ సభ్యులు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, సలహాదారులు, వాలంటీర్లు విశేష కృషి చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను సమన్వయం చేస్తూ పూజలు, సాంస్కృతిక ప్రదర్శనలను విజయవంతంగా నిర్వహించారు. న్యూయార్క్‌లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తూ భవిష్యత్ తరాలకు భారతీయ ఆధ్యాత్మిక విలువలను పరిచయం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని వారు పేర్కొన్నారు.



# సీఈసీపై అభిశంసనకు విపక్షాల విశ్వప్రయత్నాలు

## తీర్మానం నోటీసుపై కసరత్తు, గతంలోనూ నోటీసు ఇచ్చిన ప్రతిపక్షాలు



సర్ ప్రక్రియపై అభ్యంతరాల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అభిశంసనకు కాంగ్రెస్ సారథ్యంలో ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ దిశగా కాంగ్రెస్ ప్రయత్నాలతో కూటమిలో ఏకాభిప్రాయం కుదిరినట్టు సమాచారం. సీఈసీ అభిశంసన తీర్మానం నోటీసులపై కూడా ప్రతిపక్షం కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. వచ్చే వారం పార్లమెంటులో ఈ నోటీసు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. సర్ ప్రక్రియపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు రావడం కలకలం రేపింది. గత 10 నెలల్లో ఎన్నికల కమిషనర్లు 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయితే, ఎన్నికల కమిషన్ మాత్రం అభ్యంతరాలను పక్కన పెట్టి సర్ ప్రక్రియపై ముందుకెళ్లినట్టు కథనాలు వెలువడ్డాయి. ఈ అంశాల ఆధారంగా కూడా సీఈసీ అభిశంసనకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. అయితే, ఎన్నికల సంఘం మాత్రం ఈ కథనాలను కొట్టిపారేసింది. ఎన్నికల కమిషనర్లు తమ అభ్యంతరాలను అధికారికంగా వ్యక్తం చేశారన్న వాదనను తోసిపుచ్చింది. సమగ్ర ఓట్ల సవరణ (సర్) సహా అన్ని నిర్ణయాలూ ఏకాభిప్రాయంతో తీసుకున్నవేనని స్పష్టం చేసింది. గతంలో కూడా ప్రతిపక్షాలు సీఈసీ అభిశంసనకు పార్లమెంటులో నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. సీఈసీ తీరు సరికాదని మొత్తం 73 మంది ప్రతిపక్ష ఎంపీలు నోటీసులపై సంతకాలు చేశారు. తమ నోటీసులో మొత్తం 9 రకాల ఆరోపణలు చేశారు. నాటి నోటీసు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షం కొత్తగా మరోసారి అభిశంసన నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది.




# పోలీసులు లంచం అడిగారని.. విషం తాగిన యువకుడు!

## పంజాబ్‌లోని బర్నాలాలో జరిగిన ఘటన, దిద్దుబాటులో పోలీసులు

పోలీసులు లంచం డిమాండ్ చేశారని ఆరోపిస్తూ పోలీస్ స్టేషన్‌లో ఓ యువకుడు విషం తాగాడు. పంజాబ్‌లోని బర్నాలాలో ఈ ఘటన జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 11న జోబన్‌ప్రీత్ సింగ్ అనే యువకుడి కారుకు మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదానికి సంబంధించిన రిపోర్టు కాపీని తీసుకోవడానికి ఆయన గురువారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. అయితే.. స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో పాటు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లంచం ఇవ్వాలని తనను వేధిస్తున్నారని ఆయన ఆరోపించాడు. గత 14 రోజులుగా పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా తనకు కాపీ ఇవ్వడం లేదన్నాడు. దీంతో గత్యంతరం లేక విషం తాగుతున్నానని చెప్పాడు. ఈ మేరకు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. జోబన్‌ప్రీత్ సింగ్ వీడియో వైరల్‌గా మారడంతో పాటు వివాదాస్పదంగానూ మారింది. ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనం లోపించిందని, అవినీతి పెరిగిందని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఈ ఘటనపై దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ నేత సుఖ్‌జిందర్ సింగ్ రంధావాతో పాటు శిరోమణి అకాలీ దళ్ నేతలు కూడా డిమాండ్ చేశారు. అయితే, జోబన్‌ప్రీత్ ఆరోపణలను పోలీసులు ఖండించారు. జోబన్ కుటుంబంలో ఆస్తి వివాదాలు ఉన్నాయని, అంతేకాకుండా అతను మానసిక ఒత్తిడితో బాధపడుతున్నాడని చెప్పారు. 'కారు ప్రమాదానికి సంబంధించిన కాపీని తీసుకోవడానికి జోబన్.. పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. ఆ సమయంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను కలవాల్సి ఉందన్నాడు. అప్పుడు ఆ ఆఫీసర్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారు. దీంతో కాసేపు ఎదురుచూడాలని ఆ ఆఫీసర్ చెప్పారు. అంతలోనే జోబన్ విషం తాగాడు. అతడిని ఆసుపత్రికి తరలించాం. ప్రమాదం నుంచి బయటపడ్డాడని డాక్టర్లు చెప్పారు' అని పోలీసులు తెలిపారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు. రిపోర్టు కాపీని ఇవ్వకుండా పోలీసులు వేధిస్తున్నందువల్లే అతను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని చెప్పడం సరికాదన్నారు.

# రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త ఉద్యమం

## చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు కాక్రోచ్ జనతాపార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అల్టిమేటం



కాక్రోచ్ జనతాపార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత దేశప్రజాస్వామ్యానికి సీఈసీ అతిపెద్ద ముప్పుగా మారారని అన్నారు. తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే 48 గంటల్లోగా ఆయన రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త నిరసనలకు తెరతీస్తామని అల్టిమేటమ్ జారీ చేశారు. సర్ ప్రక్రియకు సంబంధించి ఇతర ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలను పక్కన పెట్టి సీఈసీ ముందుకెళ్లినట్టు వెలుగులోకి రావడం ప్రస్తుతం కలకలం రేపుతోంది. ఓటర్ల తొలగింపు, తిరిగి చేర్చే విధానంపై ఈసీలు సుఖ్‌బీర్ సంధూ, వివేక్ జోషి అభ్యంతరాలను పక్కనపెట్టారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజా పత్రికా సమావేశంలో అభిజీత్ దీప్కే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై మండిపడ్డారు. ఈ ఉదంతాలు ప్రధాన ఎన్నికల కమిషనర్ దేశంలోనే అతిపెద్ద దేశద్రోహి అని నిరూపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య సూత్రాలకు వ్యతిరేకంగా కేంద్ర ఎన్నికల కమిషనర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

## ప్రధాన ఎన్నికల కమిషనర్ మెడ చుట్టూ మరో ఉచ్చు

ఓటరు జాబితాలో కొత్త ఓటర్ల పేర్లను కలపడం, పాత ఓటర్ల పేర్లను తొలగించడం వంటివి చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మెడ చుట్టూ మరో ఉచ్చు బిగుసుకోనుంది. ఎన్నికల సంఘం సాఫ్ట్‌వేర్ ఈసీఐనెట్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీ శశిథరూర్ కోరారు. కాగా.. ఓటరు జాబితాలను ప్రక్షాళించేందుకు ఆ జాబితాకు సంబంధించిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ను ఎన్నికల సంఘం నిరుడు ప్రారంభించిన విషయం తెలిసిందే. తర్వాత ఈ ఏడాది జనవరిలో ఈసీఐనెట్ అనే యాప్‌ను ఎన్నికల సంఘం ప్రారంభించింది. ఈసీఐనెట్ యాప్ ద్వారా ఓటర్లు తమ వివరాలను సమర్పించి అప్‌డేట్ చేసుకోవాలని ఈసీ సూచించింది. దీంతో ఓటర్లు ఆ యాప్ ద్వారా తమ వివరాలు సమర్పించారు. ఓటర్ల వివరాలను ప్రాసెస్ చేయడానికి ఆ యాప్‌ను అధికారులు ఉపయోగించారు. అయితే, నిరుడు నవంబరులో బిహార్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ యాప్‌కు సంబంధించిన బీటా వర్షన్‌ను అధికారులు పరీక్షించారు. అలాగే, పోర్టల్‌ను కూడా ఉపయోగించారు.



# ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం

## ధీమా వ్యక్తం చేసిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసులో సుప్రీంకోర్టు తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనపై సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు అని అభివర్ణించారు. ఇది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు గుణపాఠమని అన్నారు. పార్టీ ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారంలో సుప్రీంకోర్టు గురువారం స్పందించింది. ఈ నేపథ్యంలో దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నాడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం చట్ట వ్యతిరేకంగా మంత్రులను చేసిందని.. నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేను చేర్చుకుని కాంగ్రెస్ తమ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేయించిందని గుర్తు చేశారు. త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికలో.. రెండు ఫిరాయింపు పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఉప ఎన్నికలో బీజేపీ ఘనవిజయం ఖాయమని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు. దానం నాగేందర్ పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యం అవుతుందని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి.. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారని తెలిపారు. దీనిపై తెలంగాణ హైకోర్టును బీజేపీ ఆశ్రయిస్తే.. 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించిందని.. దీన్ని సుప్రీంకోర్టు తాజాగా సమర్థించిందని అన్నారు. ఈ తీర్పు ఒక్క కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంశం మాత్రమే కాదని.. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చట్టవ్యతిరేకంగా అనుసరిస్తున్న పార్టీ ఫిరాయింపుల రాజకీయాలకు ఇది ఓ గుణపాఠమని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోవడం.. వారికి మంత్రిపదవులు ఇవ్వడం తెలంగాణ రాజకీయాల్లో ఈ రెండు పార్టీలు ఓ దురదృష్టకరమైన సంస్కృతిగా మార్చారని మండిపడ్డారు. ప్రజా తీర్పును కాలరాయడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణలో పోటీ పడుతూ.. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులను విమర్శించడం అధికారంలోకి వచ్చాక అదే ఫిరాయింపులను ప్రోత్సహించడం ఈ రెండు పార్టీల రాజకీయ ద్వంద్వ వైఖరికి అద్దం పడుతుందని చెప్పారు. ప్రజా తీర్పును తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా కాల రాస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అవకాశవాద రాజకీయాలకు సుప్రీంకోర్టు తీర్పు స్పష్టమైన హెచ్చరిక అని తెలిపారు. దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవి అనర్హత కారణంగా ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిందని పేర్కొన్నారు. ఇప్పుడు ఖైరతాబాద్ ప్రజలు.. అవకాశవాద, స్వార్థ, ఫిరాయింపు రాజకీయాలకు వ్యతిరేకంగా తమ ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం రానుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణేతలు ప్రజలేనని వివరించారు. ఈ రెండు పార్టీల కుళ్లు రాజకీయాలకు తగిన బుద్ధి చెప్పి.. ఖైరతాబాద్ అసెంబ్లీ ప్రజలు.. వచ్చే ఉప ఎన్నికలో బీజేపీకి పట్టంగట్టడం ఖాయమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు

# అమెరికాలో గ్రాండ్ వెల్‌కమ్



- **స్వాగతం పలికిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దంపతులు**
- **100 అడుగుల రెడ్ కార్పెట్, రన్‌వేపై యుద్ధ విమానాలు, గగనతలంలో బీ-1 బాంబర్ల విన్యాసాలు**

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు అగ్రరాజ్యంలో అరుదైన, అత్యంత ఆడంబరమైన రెడ్ కార్పెట్ స్వాగతం లభించింది. వాషింగ్టన్ సమీపంలోని అమెరికా సైనిక విమానాశ్రయమైన 'జాయింట్ బేస్ ఆండ్రూస'లో జిన్‌పింగ్ విమానం దిగగానే.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలెనియా స్వయంగా వెళ్లి జిన్‌పింగ్ దంపతులకు దగ్గరుండి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమెరికా తన సైనిక శక్తిని ప్రదర్శించింది. విమానాశ్రయంలో జిన్‌పింగ్ కోసం 100 అడుగుల రెడ్ కార్పెట్ ఏర్పాటు చేయడంతో పాటు మిలిటరీ బ్యాండ్ సంగీతం వినిపిస్తున్న సమయంలో ఇద్దరు నేతలు పక్కపక్కన నిలుచుండగా రెండు బీ-1 బాంబర్ విమానాలు గాల్లో విన్యాసాలు చేశాయి. విమానాశ్రయ రన్‌వేపై ఆరు ఎఫ్-22 యుద్ధ విమానాలు, ఆరు ఎఫ్-16 విమానాలను బారులు తీర్చి ఉంచారు.

ప్రపంచంలోనే అత్యంత పెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనా మధ్య దౌత్య, వాణిజ్య సంబంధాలు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో ఇరు దేశాల మధ్య సంధి కుదుర్చుకునే లక్ష్యంతోనే అమెరికా ఈ స్థాయిలో ఆడంబరంగా స్వాగతం పలికినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. జిన్‌పింగ్ అమెరికాలో మూడు రోజుల పాటు పర్యటించనుండగా... వైట్‌హౌస్‌లో మరొకసారి ఫ్లైపాస్ట్, అధికారిక విందు కార్యక్రమాలు జరగనున్నాయి.

### ట్రంప్‌నకు అమెరికా మీడియా షాక్!

అమెరికా అధ్యక్షుడ్డు ట్రంప్‌నకు సొంత దేశ మీడియా ఊహించని షాక్ ఇచ్చింది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అమెరికా పర్యటనకు అక్కడి మీడియా సంస్థలు భారీగా ప్రసార కవరేజీ ఇస్తున్నప్పటికీ, ఎక్కడా కూడా అధ్యక్షుడు ట్రంప్ ఫొటోలను, వివరాలను ప్రచురించకపోవడం గమనార్హం. వైట్‌హౌస్ పరిణామాల కవరేజీలో ట్రంప్‌ను మీడియా వర్గాలు పూర్తిగా పక్కనబెట్టాయి.

# అంతరిక్షంలో శాటిలైట్ల వార్

## ఇతర దేశాల ఉపగ్రహాలను బ్లాక్ చేస్తున్న బ్రిటన్



అంతరిక్షంలో ఆధిపత్యం సాధించేందుకు అగ్రరాజ్యాలు చేస్తున్న ప్రయత్నాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల అమెరికా ఆయుధాలను అంతరిక్షంలో మోహరించినట్లు ఒప్పుకోగా, తాజాగా బ్రిటన్ కూడా ఇతర దేశాలకు చెందిన ఉపగ్రహాలను జ్యామింగ్ లేదా బ్లాక్ చేస్తున్నట్లు అంగీకరించింది. అయితే ఈ చర్యలు కేవలం తమ దేశ ఆత్మరక్షణ కోసమేనని బ్రిటన్ పబ్లిక్ సర్వీస్ బ్రాడ్‌కాస్టర్ బీబీసీ కథనంలో పేర్కొంది. భూ ఉపరితలం నుంచే ప్రత్యేక సాంకేతికతను ఉపయోగించి శత్రుదేశాల ఉపగ్రహాలు కీలక సమాచారాన్ని సేకరించకుండా ది రాయల్ ఎయిర్‌ఫోర్స్ నిరోధిస్తోంది. ముఖ్యంగా అణు నిల్వలు, అణు జలాంతర్గాముల కదలికలు, దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన ప్రదేశాల వివరాలు శత్రు శాటిలైట్లకు చిక్కకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది.

తమ దేశ ఉపగ్రహాలను రక్షించుకోవడానికి రాయల్ ఎయిర్‌ఫోర్స్ తాజాగా 'మిలిటరీ స్పేస్ స్క్వాడ్రన' ఏర్పాటు చేసింది. అంతరిక్షంలో శత్రువుల నుంచి తీవ్ర ముప్పు పొంచి ఉందని 'రాఫ' అధిపతి వ్యాఖ్యానించారు. అంతరిక్షం నుంచి తమ దేశ భద్రతా సమాచారం శత్రువుల చేతికి చిక్కకుండా ఈ స్క్వాడ్రన్ రక్షణ కల్పిస్తుందని బ్రిటన్ రక్షణ శాఖ తెలిపింది. శత్రుదేశాల క్షిపణి దాడులను ముందస్తుగా హెచ్చరించే ఉపగ్రహాలకు కూడా ఇది రక్షణ ఇస్తూ, నౌకలకు దిశానిర్దేశం చేస్తుందని వివరించింది.

# భారతీయులను రష్యా యుద్ధంలోకి లాగుతోంది: జెలెన్‌స్కీ

***మోసపూరిత కుతంత్రాలతో విదేశీయులను బలితీసుకుంటోందన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు***

***ఐరాస వేదికగా రష్యా వైఖరిపై ధ్వజం***



రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం నాలుగేళ్లకు పైగా తీవ్రంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ భారతీయులకు ఒక ముఖ్యమైన అభ్యర్థన చేశారు. మోసం, కుతంత్రాలతో భారతీయులను రష్యా ఈ యుద్ధంలోకి లాగుతోందని ఆరోపించారు. పుతిన్‌కు ఆ అవకాశాన్ని ఇవ్వొద్దని, తమ పౌరులు యుద్ధంలో భాగం కాకుండా జాగ్రత్త వహించాలని కోరారు. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి 81వ సర్వప్రతినిధి సభ సమావేశంలో జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేశారు.

### 47 దేశాల ప్రజలతో రష్యా ఆటలు:

ఈ యుద్ధంలో రష్యా దాదాపు 47 దేశాల ప్రజలను బలిపశువులుగా వాడుకుంటోందని జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. "ఘనా, నేపాల్, తజికిస్తాన్, భారత్, యెమెన్, కెన్యా, క్యూబా తదితర పలు దేశాల పౌరులు ఈ యుద్ధరంగంలో ప్రాణాలు కోల్పోవడాన్ని మనం చూస్తున్నాం. వారంతా రష్యా వేసిన మోసపూరిత వలలో చిక్కుకున్నవారే. అందుకే ఈ దేశాల ప్రతినిధులతో నేరుగా మాట్లాడాలని అనుకుంటున్నాను" అని తెలిపారు.

### పుతిన్ కుట్రలను తిప్పికొట్టండి:

"మీ దేశ ప్రజలను జాగ్రత్తగా చూసుకోండి.. వారు యుద్ధ క్షేత్రంలోకి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోండి. పుతిన్ మిమ్మల్ని ఈ యుద్ధంలో భాగస్వాములను చేయకుండా, మీ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడకుండా అడ్డుకోండి" అని వివిధ దేశాల అధినేతలకు జెలెన్‌స్కీ విజ్ఞప్తి చేశారు.



# మక్కాకు ముప్పు

## - సౌదీ హెచ్చరిక

**రెండోసారి అలెర్ట్ జారీ చేసిన పౌర రక్షణ శాఖ**

రియాద్: పవిత్ర ప్రదేశమైన మక్కాతో పాటు దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో హూతీ తిరుగుబాటుదారులు క్షిపణి దాడులకు దిగే అవకాశం ఉందని సౌదీ అరేబియా పౌర రక్షణ శాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు అక్కడి అధికారిక మీడియా సామాజిక మాధ్యమం 'ఎక్స' వేదికగా వివరాలను వెల్లడించింది. గత 10 రోజుల వ్యవధిలోనే సౌదీ ప్రభుత్వం ఈ తరహా 'డేంజర్ బెల్స' మోగించడం ఇది రెండోసారి కావడం గమనార్హం. మక్కాతో పాటు సౌదీ పశ్చిమ తీరంలోని యాన్బు, తాయిఫ్, జెడ్డా, తబూక్ తదితర కీలక ప్రాంతాల్లోనూ దాడులు జరిగే ప్రమాదముందని వేర్వేరుగా హెచ్చరికలు జారీ అయ్యాయి.

### గగనతలంలోనే డ్రోన్ పేల్చివేత:

ఇరాన్ మద్దతుతో వ్యవహరిస్తున్న హూతీలు మక్కాను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడే అవకాశం ఉండటంతో ఈ తాజా హెచ్చరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇటీవల మక్కాపైకి హూతీలు డ్రోన్ ప్రయోగించగా, అది నిషేధిత గగనతలంలోకి ప్రవేశించకముందే 'రాయల్ సౌదీ ఎయిర్ డిఫెన్స' బలగాలు దాన్ని గగనతలంలోనే అడ్డుకుని విజయవంతంగా నిర్వీర్యం చేశాయి. ఈ పరిణామంతో మక్కా ప్రాంతంలో తొలిసారిగా హైఅలెర్ట్ ప్రకటించారు. అంతకుముందు 2017లోనూ హూతీలు మక్కా నగరాన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి యత్నించిన సంగతి తెలిసిందే.

# అమెరికా యుద్ధ నౌకలో దారుణం

- **సముద్రంలోకి దూకి నావికుడి ఆత్మహత్యాయత్నం!**
- **'యుఎసఎస్ అబ్రహాం లింకన' నౌకపై పెరిగిన మానసిక ఒత్తిడి**
- **ఘటనను ధ్రువీకరించిన అమెరికా నేవీ**



పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు అలముకోవడంతో అమెరికా యుద్ధ నౌకలోని సైనికులపై తీవ్ర మానసిక ఒత్తిడిపెరుగుతోంది. యుద్ధ రంగంలో విధులు నిర్వర్తిస్తున్న అమెరికా నావికుడు ఒకరు ఒత్తిడి తట్టుకోలేక 'యుఎసఎస్ అబ్రహాం లింకన' విమాన వాహక నౌక నుంచి సముద్రంలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు నమ్మదగిన వర్గాలు వెల్లడించాయి. ఈ విషయాన్ని అమెరికా నేవీ తాత్కాలిక సెక్రటరీ హారంగ్ లీ అధికారికంగా ధ్రువీక రించారు. నివేదిక ద్వారా వివరాలు వెల్లడిస్తూ... ఆత్మహత్యాయత్నం జరిగిన మాట వాస్తవమేనని, అయితే సదరు నావికుడికి ఎలాంటి ప్రాణాపాయం లేదని స్పష్టం చేశారు. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం కావడానికి ముందే అమెరికా తన పలు యుద్ధనౌకలను పశ్చిమాసియా జలాల్లో మోహరించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే 'యుఎసఎస్ అబ్రహాం లింకన' నౌకలోని నావికులు, విమాన సిబ్బంది రికార్డు స్థాయిలో దాదాపు 250 రోజులుగా సముద్రంలోనే ఉంటూ నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారు. సుదీర్ఘకాలం పాటు కంటిమీద కునుకు లేకుండా నిరంతర కాపలా కాయడం, కుటుంబాలకు దూరంగా ఉండటంతో సిబ్బందిపై తీవ్ర మానసిక ఒత్తిడి పడుతోంది. ఈ ఆత్మహత్యాయత్నం ఘటన తర్వాత సెప్టెంబరు ప్రారంభంలో ఆ నౌకలోని సిబ్బందికి అధికారులు కొంత విశ్రాంతి ఇచ్చారు.

# బీసీసీఐతో దోస్తీ

## టీమిండియా టైటిల్ స్పాన్సర్‌గా 'ముత్తూట్ ఫిన్‌కార్ప్'






ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ పంట పండనుంది. బంగారంపై రుణాలతో అందరికీ చేరువైన ఈ సంస్థ భారత క్రికెట్ నియంత్రణ మండలితో దోస్తీకి సిద్ధమైంది. పలు సంస్థలను వెనక్కి నెట్టి భారత జట్టు టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులు దక్కించుకుందీ సంస్థ. వచ్చే రెండేళ్ల పాటు టీమిండియా జెర్సీలపై ముత్తూట్ పేరు తళుక్కుమననుంది. 'బ్లూ ముత్తూట' పేరుతో టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించనుందీ కంపెనీ. అయితే.. స్వదేశంలో టీమిండియా ఆడే మ్యాచ్‌లకు మాత్రమే పరిమితం కానుందని సమాచారం.

క్రిక్ బజ్ కథనం ప్రకారం.. ప్రస్తుతం ద్వైపాక్షిక సిరీస్‌లో భారత జట్టు టైటిల్ స్పాన్సర్‌గా కంపా, ఎస్‌బీఐ లైఫ్, చాట్‌జీపీటీ ఉన్నాయి. ఇప్పుడు వీటి సరసన ముత్తూట్ ఫిన్‌కార్ప్ కూడా చేరనుంది. రెండేళ్ల కాలానికి బీసీసీఐతో ముత్తూట్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. అంటే 2028 మార్చి 31 వరకూ ఈ హోదాలో కొనసాగనుందీ కొచ్చికి చెందిన ఫైనాన్స్ కంపెనీ. అయితే.. ఈ విషయాన్ని బీసీసీఐ అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

### ఒక్క మ్యాచ్ 4.85 కోట్లు

సొంతగడ్డపై త్వరలో వెస్టిండీస్‌తో జరుగనున్న వన్డే సిరీస్‌తో టీమిండియా టైటిల్ స్పాన్సర్‌గా ముత్తూట్ ప్రయాణం మొదలవ్వనుంది. అక్టోబర్ 16 నుంచి విండీస్‌తో వన్డే సిరీస్ నుంచి బ్లూ ముత్తూట్ పేరుతో ఈ కంపెనీ పేరు మరింత మందికి చేరువకానుంది. ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన బీసీసీఐ టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులకు ముత్తూట్ ఫైనాన్స్ భారీగానే ఖర్చు చేయనుందని టాక్. టీమిండియా ఒక్కో మ్యాచ్‌కు కనీస ధర రూ.4.85 కోట్లు కాగా.. బేరసారాల అనంతరం ఈ మొత్తం కాసింత తగ్గే అవకాశముంది. టైటిల్ స్పాన్సర్‌గా ముత్తూట్ పేరును బీసీసీఐ త్వరలోనే వెల్లడించనుంది. ఈ రెండేళ్లలో.. టీమిండియా స్వదేశంలో 35 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది. వీటిలో 10 టెస్టులు, 12 వన్డేలు, 13 టీ20లు ఉన్నాయి.

# చివరి నిమిషంలో వచ్చి... రజతంతో మెరిసి





భారత వుషు క్రీడాకారిణి రోషిబినా దేవి ఆసియా క్రీడల్లో మరోసారి సత్తా చాటింది. చివరి నిమిషంలో జట్టులో చోటు దక్కించుకున్న రోషిబినా దేవి రజతంతో మెరిసింది. జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో మహిళల 60 కిలోల సాండా విభాగంలో ఆమె రజతం పతకం సాధించింది. ఫైనల్లో చైనాకు చెందిన జాంగ్ షియావోయు చేతిలో 0-2 తేడాతో ఓడిపోయింది. రెండు రౌండ్లలోనూ చైనా క్రీడాకారిణి ఆధిపత్యం ప్రదర్శించింది. రోషిబినా దేవికి ఆసియా క్రీడల్లో ఇది వరుసగా మూడో పతకం. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో ఆమె కాంస్య పతకం సాధించింది. 2023 హాంగ్‌జౌ క్రీడల్లో 60 కిలోల సాండా విభాగంలో రజతం గెలిచింది. ఇప్పుడు 2026 ఐచి-నాగోయాక్రీడల్లోనూ రజతం దక్కించుకుంది. దీంతో వరుసగా మూడు ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన తొలి భారత వుషు క్రీడాకారిణిగా రోషిబినా నిలిచింది. అయితే ఈసారి ఆసియా క్రీడల ప్రయాణం రోషిబినాకు అంత సులభంగా సాగలేదు. మహిళల 60కిలోల విభాగానికి జరిగిన ట్రయల్స్‌లో రోషిబినాను దివ్యాంశి చౌదరి ఓడించి భారత జట్టులో స్థానం సంపాదించింది.

# మిక్స్‌డ్ రిలేలో రజతం

## మారథాన్‌లో సీమాకు చరిత్రాత్మక కాంస్యం



ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. ఐదో రోజు షూటర్లు వెండి వెలుగులు విరజిమ్మగా.. అథ్లెట్లు కూడా పోడియంపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. పదివేల మీటర్ల పరుగులో సీమా కుమారి కంచుమోత మోగించింది. సీమ కాంస్యం అందుకున్న ఇరవై నిమిషాల్లోనే మిక్స్‌డ్ రిలే ఫైనల్లో భారత బృందం రజతం ఒడిసిపట్టింది. ఫలితంగా భారత్ ఖాతాలో 17 పతకాలు చేరాయి.

జపాన్‌లోని నగోయాలో జరుగుతున్న పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు పతక పోరులో దూసుకెళ్తున్నారు. మిక్స్‌డ్ రిలే విభాగంలో... మిక్స్‌డ్ విభాగం ఫైనల్లో పూవమ్మ రాజు, విశాల్ థెన్నరసు, విథ్యా రామరాజు, మను టీఎస్‌లు రెండో స్థానంతో రజతం గెలుపొందారు. గురువారం ఫైనల్లో.. విథ్యా, విశాల్ చిరుతలా పరుగెత్తారు. వీరి కృషి ఫలితంగా ఈ టోర్నీలో తమ రికార్డును కాపాడుకుంది మిక్స్‌డ్ రిలే బృందం. ఇది వరకు 2018లో స్వర్ణం, 2022 ఎడిషన్‌లో భారత టీమ్ రజతం గెలుపొందింది.

అంతకుముందు.. మహిళల 10వేల మీటర్ల పరుగులో సీమా కుమారి సత్తా చాటింది. ఈ మారథాన్ రేసులో 16 ఏళ్లుగా పతకం కోసం నిరీక్షిస్తున్న భారత్‌ను సంబురాల్లో ముంచెత్తింది. ఫైనల్లో 32:50:05 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని కాంస్య పతకాన్ని ముద్దాడిందీ హిమాచల్‌ప్రదేశ్ అథ్లెట్. ఆమె మూడో స్థానానికి పరిమితమవ్వగా.. విన్‌ఫ్రెడ్ యవీ (బహ్రెయిన్) పసిడి, నొజొమి (జపాన్) వెండి పతకాలు సాధించారు.



## 'రోకో' 2027 వన్డే వరల్డ్ కప్ నెగ్గాలి - రింకూ సింగ్

2027లో జరిగే వన్డే ప్రపంచ కప్‌లో స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడతారా లేదా అనే అంశంపై కొంతకాలంగా క్రికెట్ వర్గాల్లో సందిగ్ధత, తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఈ ప్రతిష్టాత్మక టోర్నీకి వారిద్దరినీ పక్కన పెట్టవద్దని కొందరు సూచిస్తుండగా... యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో టీమిండియా ఫినిషర్, యువ బ్యాటర్ రింకూ సింగ్ చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి.



"విరాట్ భాయ్, రోహిత్ భాయ్ ఇద్దరూ లెజెండ్స్. వారు 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడి, భారత్‌కు ట్రోఫీని గెలిపించే జట్టులో భాగంగా ఉండాలని నేను మాత్రమే కాదు.. యావత్ దేశం ఆశిస్తోంది. అదే జరిగితే దేశం మొత్తానికి అది ఒక గొప్ప జ్ఞాపకమవుతుంది. ఎందుకంటే వారికి ఇదే చివరి వన్డే ప్రపంచకప్ కావచ్చు. మనం 2011 తర్వాత ఇప్పటివరకు వన్డే ప్రపంచ కప్ గెలవలేదు. ఇప్పుడు ట్రోఫీ నెగ్గితే 'రో-కో' (రోహిత్-కోహ్లీ) జోడీకి కూడా గొప్ప ముగింపుగా ఉంటుంది. అందువల్ల వీరిద్దరూ జట్టులో ఉండి భారత్‌కు ప్రపంచకప్ అందిస్తారని ఆశిస్తున్నా" అని రింకూ స్పష్టం చేశాడు.

## అక్టోబరు 6 నుంచి హైదరాబాద్ టీ20 టిక్కెట్ల విక్రయం

హైదరాబాద్: భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య జరిగే నాలుగో టీ20 మ్యాచ్ టిక్కెట్ల విక్రయం అక్టోబరు 6 నుంచి జరుగుతుంది. వచ్చేనెల 14వ తేదీన ఉప్పల్ స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్‌కు రెండువేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా టిక్కెట్లు ఇవ్వనున్నట్టు హెచ్‌సీఏ కార్యదర్శి మన్నె జీవన్‌రెడ్డి ప్రకటించారు. కాగా మహబూబ్‌నగర్, కరీంనగర్‌ల్లో త్వరలో క్రికెట్ అకాడమీలు తెరుస్తామని ఆయన తెలిపారు. నవంబరులో హెచ్‌సీఏ ఎన్నికలు నిర్వహించే అవకాశముందని చెప్పారు.



# 'జార్జ్ క్రిష' ఫస్ట్ గ్లింప్స్ వచ్చేసింది!





టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, మాస్ అండ్ ఎంటర్‌టైనర్ల దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'జార్జ్ క్రిష'. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు శ్రీను వైట్ల పుట్టినరోజును పురస్కరించుకుని మేకర్స్ ఈ సినిమా నుంచి 'ఫస్ట్ బూస్టర' పేరిట ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇది సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. శర్వానంద్ రెండు విభిన్నమైన పాత్రల్లో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. 'జార్జ', 'క్రిష' అనే పేర్లతో ఈ రోల్ చేస్తుండటంతో సినిమాపై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ విపరీతంగా ఏర్పడింది. శ్రీనువైట్ల తనదైన మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ టేకింగ్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరించే అన్ని హంగులతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఫెమినా మిస్ ఇండియా మానస వారణాసి నాయికగా నటిస్తుండగా, సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ అందిస్తున్న బాణీలు సినిమాకు అదనపు బలంగా నిలవనున్నాయి. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఈ పండగ సీజన్‌కి సరిగ్గా సరిపోయే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'జార్జ్ క్రిష' సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

# 'సిగ్మా' ప్రీ-రిలీజ్
## ముఖ్య అతిథిగా మెగాస్టార్ చిరంజీవి





టాలీవుడ్ టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్, గ్లామరస్ హీరోయిన్ ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'సిగ్మా'. తమిళనాడు సీఎం, నటుడు విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. హైదరాబాద్‌లోని ప్రఖ్యాత పార్క్ హయత్ వేదికగా జరిగే ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. స్టార్ డైరెక్టర్‌గా మారుతున్న జేసన్ సంజయ్ మొదటి సినిమా వేడుకకు మెగాస్టార్ గెస్ట్‌గా వస్తుండటంతో సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. రూ.500 కోట్ల నేపథ్యంతో సాగే క్రైమ్, గ్యాంబ్లింగ్, మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ విడుదల చేస్తోంది. గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# తనపై క్రష్ ఏమాత్రం తగ్గట్లేదు: రష్మిక



టాలీవుడ్ ప్రముఖ జంట విజయ్ దేవరకొండ, రష్మిక వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన తర్వాత తొలిసారిగా కలిసి నటిస్తున్న చిత్రం 'రణబాలి'. విజయ్ దేవరకొండ 'సింగనమల బొబ్బిలి రణబాలి' అనే పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తుండగా ఆయన భార్యగా 'జయమ్మ' పాత్రలో రష్మిక కనిపిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇటీవల విడుదల చేసిన 'ఏందయ్యా సామీ..' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పాటలో విజయ్, రష్మిక మధ్య ఉన్న కెమిస్ట్రీ అభిమానులను ఆకట్టుకుంటోంది. కాగా ఈ పాట క్లిప్‌ను రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ విజయ్‌పై తనకున్న ప్రేమను చాటుకున్నారు. "అతడు పూర్తిగా నాకే సొంతమయ్యాడు.. కానీ తనపై ఉన్న క్రష్ ఏమాత్రం తగ్గడం లేదు. ఇదేం విచిత్రమో!" అని రష్మిక పోస్ట్ చేయగా... దానికి విజయ్ దేవరకొండ స్పందిస్తూ.. "నేను ఎంతో అదృష్టవంతుడిని. జయమ్మను మిస్ అవుతాను కానీ నువ్వు జీవితాంతం నా దగ్గరే ఉంటావు" అని రిప్లై ఇచ్చారు. వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధాన్ని చూసి నెటిజన్లు ముచ్చటపడుతున్నారు. రాహుల్ సాంకృత్యాయన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ డ్రామా చిత్రం దసరా కానుకగా అక్టోబరు 16న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

### రూ.2,490 కోట్లు తగ్గిన షారుఖ్ ఖాన్ సంపద
# అయినా అతడే నెం.1



బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ ఆస్తికి సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. దేశంలోని ధనవంతుల జాబితాను రూపొందించే 'హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026' తాజాగా ఒక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం గత ఏడాదితో పోలిస్తే షారుఖ్ ఖాన్ ఆస్తి కాస్త తగ్గింది. గతేడాది ఆయన ఆస్తి విలువ రూ.12,490 కోట్లుగా ఉండగా, ఈ ఏడాది అది రూ. 2,490 కోట్లు తగ్గి రూ.10వేల కోట్లకు చేరింది. ఆయన వ్యాపారాలు, నిర్మాణ సంస్థ 'రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట', ఐపీఎల్ టీమ్ 'కోల్‌కత్తా నైట్ రైడర్స్' వంటి వాటిని లెక్కలోకి తీసుకుని ఈ అంచనా వేశారు. ఆస్తి కొంత తగ్గినా సరే, భారతదేశంలో అత్యధిక ఆస్తులున్న నటుడిగా షారుఖ్ ఖాన్ మాత్రం తన నెం.1 స్థానాన్ని పదిలంగా కాపాడుకున్నారు. ఈ జాబితాలో అమితాబ్ బచ్చన్ రూ.4వేల కోట్లతో రెండో స్థానంలో ఉండగా, సల్మాన్‌ఖాన్ (రూ.3,000 కోట్లు), హృతిక్ రోషన్ (రూ.2,500 కోట్లు) తర్వాతి స్థానాల్లో నిలిచారు. మరోవైపు సినిమాల విషయంలో షారుఖ్ జోరు ఏమాత్రం తగ్గలేదు. ప్రస్తుతం ఆయన సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ సినిమా 'కింగ' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా డిసెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది

### యాక్షన్ కింగ్...
# 64 ఏళ్ల వయసులోనూ అదిరిపోయే స్టంట్స్



దక్షిణాది సినీ పరిశ్రమలో 'యాక్షన్ కింగ'గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ సర్జా ఇప్పటికీ తన ఫిట్‌నెస్‌తో అభిమానులను ఆశ్చర్యపరుస్తూనే ఉన్నారు. 64 ఏళ్ల వయసులోనూ యువకుడిలా కఠినమైన యాక్షన్ విన్యాసాలు చేయగల ఆయన సామర్థ్యానికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అర్జున్ ఎంతో సులభంగా గాల్లోకి కాలు ఎత్తి, కరాటే విన్యాసంతో బాటిల్ మూతను ఎగరగొట్టారు. ఈ స్టంట్‌లో ఆయన చూపించిన వేగం, శరీర సౌష్టవం, కాళ్ల ఫ్లెక్సిబిలిటీ చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. వయసు 64కు చేరినా ఆయనలోని చురుకుదనం ఏమాత్రం తగ్గలేదంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలతపై దాడి

హైదరాబాద్: తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమావేశం జరుగుతుండగా కొందరు వ్యక్తులు తనపై భౌతిక దాడికి పాల్పడ్డారని, చంపేస్తామని బెదిరించారని ఆరోపిస్తూ అసోసియేషన్ అధ్యక్షురాలు వి.వి. సుమలతాదేవి బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందిరానగర్‌లోని రాఘవ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ ఘటన జరిగిందని సుమలత ఫిర్యాదులో పేర్కొన్నారు. సమావేశాన్ని అడ్డుకోవడంతో పాటు అసోసియేషన్‌కు సంబంధించిన ముఖ్యమైన రికార్డులను అక్రమంగా తీసుకెళ్లేందుకు కొందరు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించారని ఆమె ఆరోపించారు. తాను అధ్యక్ష పదవికి రాజీనామా చేయకపోతే ప్రాణాలు తీస్తామని తీవ్రంగా



బెదిరించినట్లు ఫిర్యాదులో వివరించారు. తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, పోలీసు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఘటనకు సంబంధించిన అసలు వాస్తవాలు వెలుగులోకి రావడానికి సీసీటీవీ ఫుటేజీ రికార్డులను పరిశీలించాలని పోలీసులను సుమలత కోరారు.